www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 124
గురువారం | 1-8-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి మ. 3.29 తదుపరి త్రయోదశి; నక్షత్రం: మృగశిర ఉ 10.24 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.7.00-8.38; దుర్ముహూర్తం: ఉ.10.13-11.04, మ.3.20-4.11; అమృతఘడియలు: రా.12.44-2.22; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.58; సూర్యాస్తమయం: 6.44
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రాజ్‌భవన్‌లో ప్రమాణం అనంతరం జిష్ణుదేవ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జస్టిస్ అరాధే, చిత్రంలో సీఎం

గవర్నర్‌గా జిష్ణుదేవ్ ప్రమాణ స్వీకారం

చేయించిన హైకోర్టు సీజే అరాధే

హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు

తెలంగాణ ప్రజలకు సేవచేసే అదృష్టం దక్కిందన్న కొత్త గవర్నర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యంగ్ అండ్ డైనమిక్ లీడర్ అంటూ ప్రశంస

14

అట్టుడికిన అసెంబ్లీ



సబిత కంటతడి

సీఎం అవమానకరంగా మాట్లాడారు

మహిళలపై ఆయనకు గౌరవం లేదు

శాంతిభద్రతలపై ప్రశ్నించినందుకే మమ్మల్ని టార్గెట్ చేశారు

మీడియా పాయింట్ వద్ద సబిత

ఏ పార్టీలో ఉన్నా కమిట్‌మెంట్‌తో పనిచేస్తాం: సునీత

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తనపై అవమానకరంగా మాట్లాడారంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కంటతడి పెట్టారు. బుధవారం మధ్యాహ్నం సభ వాయిదా పడిన అనంతరం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆమె మీడియా పాయింట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేటీఆర్ బడ్జెట్‌పై నిజాలు మాట్లాడుతుంటే దాని నుంచి దృష్టి మళ్లించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ తమపై అవమానకరంగా

మిగతా 13వ పేజీలో...

'అక్కలు ఇక్కడ ముంచి అక్కడ తేలారు'.. సీఎం రేవంత్ వ్యాఖ్యలతో దుమారం

వారిని నమ్ముకుంటే బస్టాండే గతి అన్న సీఎం

తీవ్ర నిరసన తెలిపిన బీఆర్‌ఎస్ సభ్యులు

పోడియం వద్ద మహిళా సభ్యుల బైఠాయింపు

ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్

కాంగ్రెస్ సభ్యుల ఎదురుదాడితో గందరగోళం

రేవంత్‌పై మండిపడ్డ సబితా ఇంద్రారెడ్డి

గందరగోళం మధ్యే 'ద్రవ్య వినిమయ బిల్లు'కు మూజువాణి ఓటుతో శాసనసభ ఆమోదం

నేటికి సభను వాయిదా వేసిన స్పీకర్

రాష్ట్రంలో రాజకీయం వేడెక్కింది. శాసనసభ బడ్జెట్ సమావేశాల సాక్షిగా అది బహిర్గతమైంది. సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధంగా మారి.. అసెంబ్లీ అట్టుడికింది. ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు సమాధానం చెప్పే క్రమంలో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు సభలో ప్రకంపనలు సృష్టించాయి. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నిరసన తెలిపారు. సీఎం అవమానకరంగా మాట్లాడారంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబిత కంటతడి పెట్టారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నేతల ఆరోపణల్ని అధికార కాంగ్రెస్ నేతలు తిప్పికొట్టారు. మరోవైపు కొందరు ఎమ్మెల్యేల శాసనసభ్యత్వం రద్దవుతుందంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు తెరలేపాయి.

12





అభయ హస్తమని చెప్పి.. భస్మాసుర హస్తమయ్యారు!

420 హామీలతో ప్రజలను మోసం చేశారు

రాష్ట్రాన్ని రోగీ అనంటే పెట్టుబడులొస్తాయా?

సబితక్క, సునీతక్కపై సీఎం హీనాతిహీనంగా నోరుపారేసుకున్నారు.. క్షమాపణలు చెప్పాలి

నేడు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నిరసనలు

రేవంత్, నేను స్నేహితులమే..

పదేళ్లుగా మాకు చెడింది: కేటీఆర్

12

కొందరు ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు!

13

కోమటిరెడ్డి, సంపత్ కుమార్ సభ్యత్వం రద్దు కాలేదా?

నన్ను కూడా ఏ ఒక్కరోజు అసెంబ్లీలో ఉండనివ్వలేదు

బీఆర్‌ఎస్ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి పరోక్ష హెచ్చరిక

సబితక్క ఈ తమ్ముణ్ని అనాథ చెయ్యొచ్చా అని వ్యాఖ్య

కేటీఆర్ 100% ఆర్టిఫిషియల్.. 0 ఇంటెలిజెన్స్: సీఎం

ధరణి పేరు భూమాతగా మార్పు?

సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో ఒకదానికి పీవీ పేరు?

రైతు, విద్యా కమిషన్ల ఏర్పాటు!.. నేడు క్యాబినెట్

12

పోచారం ఇంట్లో విందు.. హాజరైన సీఎం

ఈనెల 5 నుంచి స్వచ్ఛదనం.. పచ్చదనం

నేడు స్కిల్ వర్సిటీకి సీఎం శంకుస్థాపన

ఎక్కడ చూసినా.. విషాదమే

వయనాడ్‌లో మృత్యువు విలయ తాండవం

సోఫాలో కూర్చునే మరణించిన ఓ కుటుంబం

పరుగెడుతూ.. బురదలో ఇరుక్కుని మరికొందరి మృతి

శునకాలు గుర్తించినా.. మృతదేహాల వెలికితీతకు బండరాళ్ల అడ్డంకులు

భారీ వర్షాలతో మరిన్ని ఆటంకాలు

1000 మందిని కాపాడిన సైన్యం

వారం క్రితమే హెచ్చరించాం: అమిత్ షా

అంతా అబద్ధం.. రాజకీయాలకు సమయం కాదు: కేరళ సీఎం పినరయి



వయనాడ్ జిల్లా చురల్‌మలలో వరదను దాటుతున్న బాధితులు

270కి పెరిగిన మృతుల సంఖ్య

240 మందికి పైగా గల్లంతు

విపత్తును సుమోటోగా తీసుకున్న ఎన్‌జీటీ

వయనాడ్, జూలై 31: టీవీ ముందు.. సోఫాలో కూర్చున్న ఐదుగురు కుటుంబ సభ్యులు.. కొండచరియల ధాటికి.. అదే సోఫాలో విగతజీవులుగా మారిపోయారు..! భారీ వర్షం, చలిని తాళలేక.. రెండుమూడు బెడ్‌షీట్లు కప్పుకొని పడుకున్నవారు.. ఆ దుప్పట్ల కిందే మృతదేహాలుగా కనిపించారు..! కొండచరియలు పెళపెళా విరిగిపడుతున్న శబ్దాలు విని.. బయటకు పరుగులు తీయాలనే ప్రయత్నంలో ఉన్నవారు.. అదే భంగిమలో బురదలో కూరుకుపోయి చనిపోయారు..! ఘటన జరిగిన సమయంలో వారి ఆందోళన.. భయాన్ని, నిస్సహాయతను స్పష్టంగా చెబుతున్నాయా? అన్నట్లుగా ఉన్న ఆ మృతదేహాల కళ్లు..! ఇవీ కొండచరియలు బీభత్సం సృష్టించిన కేరళలోని వయనాడ్ జిల్లా.. ముండక్కై, చురల్‌మలలో సహాయక సిబ్బందికి బుధవారం

మిగతా 2వ పేజీలో...



ఆప్తులను పోగొట్టుకున్న వారి దుఃఖం

మానవ చర్యల వల్లే..

వయనాడ్ విలయానికి కారణం అదే

కేరళలో తరచూ ప్రమాదాలు అందుకే

పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ ధ్వజం

పశ్చిమ కనుమలు పర్యావరణపరంగా సున్నితమైనవంటూ 2011లో నివేదిక

అక్కడ అభివృద్ధి కార్యక్రమాలు, మైనింగ్‌పై ఆంక్షలు విధించాలని సూచన

2

తిరస్కరించిన కేరళ రాజకీయ పార్టీలు

ఇప్పటికీ అమలు చేయని ప్రభుత్వాలు

ఎల్‌ఆర్‌ఎస్‌కు పచ్చజెండా

నేటి నుంచి కార్యాచరణ.. పెండింగ్ దరఖాస్తులకు మోక్షం

మూణ్నెల్లలో క్షేత్రస్థాయి పరిశీలన.. అంతా ఆన్‌లైన్‌లోనే..

నాలుగు దశల్లో వడపోత.. అనుమతికి సర్కారు ఉత్తర్వులు

4 ఏళ్ల నిరీక్షణకు తెర.. నేడు అధికారులతో సీఎస్ సమీక్ష

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని(ఎల్‌ఆర్‌ఎస్) ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో నాలుగేళ్ల నిరీక్షణకు తెరపడనుంది. గురువారం నుంచి ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రారంభమవ్వనుంది. మూణ్నెల్లలో క్షేత్రస్థాయి పరిశీలనను పూర్తిచేసుకునేలా.. నాలుగు దశల్లో ఈ దరఖాస్తుల స్ర్కూటినీ జరగాలని నిర్దేశిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. గ్రామ పంచాయతీ

మిగతా 12వ పేజీలో...

ఆరు కోర్సులు.. 2వేల మంది విద్యార్థులు!

స్కిల్ వర్సిటీలో వచ్చే ఏడాది నుంచి ప్రవేశాలు ప్రారంభం

తొలుత 6 రంగాల్లో తరగతులు

క్రమంగా ఏడాదికి 20 వేల అడ్మిషన్ల పెంపు

14

నాలుగో నగరం

మహానగరంలా మారనున్న మహేశ్వరం

ముచ్చెర్లలో కాలుష్య రహిత నెట్‌జీరో సిటీ

శంషాబాద్ నుంచి మెట్రో

వేల ఎకరాల్లో ఐటీ కంపెనీలు

పర్యాటకం, విద్య, ఆరోగ్యం, ఏఐ హబ్‌గా తీర్చిదిద్దే యత్నం

విదేశీ కంపెనీలను ఆకర్షించే దిశగా సర్కారు చర్యలు



రంగారెడ్డి అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గానికి మహర్దశ పట్టనుంది. రంగారెడ్డి జిల్లాలోని ఈ నియోజకవర్గంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ముచ్చెర్లలో ఫార్మాసిటీ కోసం గతంలో సేకరించిన 12 వేల ఎకరాలకు పైగా భూమిలో కాలుష్యరహిత నెట్‌జీరో సిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో పలు కాలుష్యరహిత కంపెనీలను ఏర్పాటు చేయనుంది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీలు ఏర్పాటు కానున్నాయి. ఇక మహేశ్వరం చుట్టుపక్కల

మిగతా 14వ పేజీలో...



నామమాత్రంగా మాఫీ

నిబంధనల వల్ల 70% మందికి అందలేదు

3

రాష్ట్ర ప్రభుత్వం.. శ్వేతపత్రం విడుదల చేయాలి

రుణమాఫీ కాని వారు వివరాలు తెలియజేయండి

మీ తరఫున పోరాడతాం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్ సెంటర్

రాజ్యసభలో బీజేపీ విప్‌గా లక్ష్మణ్

ప్రకటించిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ

14

నేరము - శిక్ష

పూజా ఖేద్కర్‌పై వేటు

ట్రైనీ ఐఏఎస్‌గా నియామకం రద్దు

మళ్లీ పరీక్షలు రాయకుండా నిషేధం

యూపీఎస్సీ ప్రకటన

2

న్యూ రూల్స్



ఐదేళ్లు దాటితే కొత్త ఫాస్టాగ్

మూడేళ్లు దాటితే కేవైసీ చేయించాలి

నేటి నుంచి నిబంధనల్లో మార్పు

అమలుకు అక్టోబరు 31 చివరి తేదీ

న్యూఢిల్లీ, జూలై 31: ఫాస్టాగ్ నిబంధనలు గురువారం నుంచి మారుతున్నట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. మారిన నిబంధనలకు అనుగుణంగా వినియోగదారులు, ట్యాగ్ సేవలను అందిస్తున్న సంస్థలు చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు ఐదేళ్లు దాటిన ట్యాగ్‌లన్నింటినీ కచ్చితంగా మార్చాలి. మూడేళ్లు దాటితే తప్పనిసరిగా కేవైసీ చేయించాలి. వాహనం రిజిస్ట్రేషన్, ఛాసిస్ నంబర్లతో ట్యాగ్‌ను అనుసంధానం చేయాలి. అలాగే ప్రతి ఫాస్టాగ్ ఒక మొబైల్ నంబరుతో అనుసంధానమై ఉండాలి. కొత్త వాహనమైతే కొనుగోలు చేసిన 90 రోజుల్లోపు వాహనం నంబరును ఫాస్ట్‌ట్యాగ్ డేటాబేస్‌లో అప్‌డేట్ చేయించాలి. అలాగే వాహనం ముందు భాగం స్పష్టంగా కనిపించేలా ఫొటో అప్‌లోడ్ చేయాలి. గడువు అక్టోబరు 31.

హితవు



జీవిత, వైద్య బీమాలపై జీఎస్టీ తొలగించండి

2

వాటిపై 18% అంటే.. జీవితంలోని అనిశ్చిత పరిస్థితులపై పన్ను వేయడం లాంటిదే

దీని వల్ల ఇన్సూరెన్స్ రంగం వృద్ధికి ఆటంకం

నిర్మలా సీతారామన్‌కు నితిన్ గడ్కరీ లేఖ

నియామకం



యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ప్రీతి సుదన్

2

1983 బ్యాచ్ ఏపీ క్యాడర్ ఐఏఎస్

ఆరని చిచ్చు

హమాస్ చీఫ్ హనియా హతం

హెజ్‌బొల్లా కమాండర్ షుక్ర్ కూడా..

ఇజ్రాయెల్ పనేనన్న హమాస్

ప్రతీకారం తప్పదని హెచ్చరిక

2

సాయం కోసం బేలీ వంతెనలు

వయనాడ్‌లో బురద ప్రవాహంలో చిక్కుకుపోయినవారిని రక్షించేందుకు, రోడ్డు మార్గాలు పూర్తిగా ధ్వంసమైన చోట బాధితులకు సహాయం అందించేందుకు సహాయక బృందాలు ఉక్కుతో నిర్మించే తాత్కాలిక వంతెనలను ఉపయోగిస్తున్నాయి. వీటిని బేలీ వంతెనలు అంటారు. వరదలు సంభవించినప్పుడు ప్రాణనష్టాన్ని తగ్గించడంలో ఇవి చాలా కీలకంగా మారాయి. ఈ వంతెనలను చిన్న, తేలికైన వస్తువులతో వేగంగా నిర్మించవచ్చు. వయనాడ్‌లో ఈ బ్రిడ్జిల నిర్మాణానికి పరికరాలను ఢిల్లీ, బెంగళూరు నుంచి తరలించారు. వీటికి బ్రిటన్ సివిల్ సర్వెంట్ డొనాల్డ్ బేలీ రూపకల్పన చేశారు. ఆయన పేరు మీదుగానే వీటికి బేలీ బ్రిడ్జి అని పేరు వచ్చింది. ఈ తరహా వంతెనలను బ్రిటిష్ సైనికులు రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఉపయోగించడం విశేషం.



ఎక్కడ చూసినా విషాదమే



(మొదటి పేజీ తరువాయి)

ఎదురైన దృశ్యాలు..! వయనాడ్ విషాదంలో మృతుల సంఖ్య 270కు పెరిగినట్లు, మరో 240 మంది జాడను ఇంకా గుర్తించాల్సి ఉందని కేరళ మీడియా వెల్లడించింది. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని పేర్కొంది. అయితే.. భారీ వర్షాలు, దట్టమైన పొగమంచు కారణంగా.. సహాయక చర్యలను బుధవారం మధ్యాహ్నం 3 గంటలకే నిలిపివేయాల్సి వచ్చిందని విపత్తు నివారణ అధికారులు వెల్లడించారు. బుధవారం సాయంత్రానికి 143 మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయినట్లు తెలిపారు. వీరిలో 89 మందిని గుర్తించినట్లు పేర్కొన్నారు. 148 మంది బాధితులు చికిత్స పొందుతున్నారు.

ఎక్కడ చూసినా మృతదేహాలే..

బుధవారం ఉదయం సహాయక చర్యలు ప్రారంభమయ్యాక.. ఎక్కడ చూసినా మృతదేహాలు కనిపించాయని సైన్యం, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు తెలిపాయి. చలియార్ నదిలో కొట్టుకొచ్చిన మృతదేహాల సంఖ్య 52గా ఉన్నట్లు వెల్లడించాయి. ముండక్కై, అట్టమల, చురల్‌మలలో 72 వరకు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు, వేర్వేరు ప్రాంతాల్లో 1000 మందిని కాపాడి, సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొన్నాయి. "ఆర్మీ శునకాలు మృతదేహాలను గుర్తించడంలో కీలకంగా ఉపయోగపడుతున్నాయి. అయితే, బురద, భారీ బండరాళ్ల కారణంగా వాటిని వెలికితీయలేకపోయాం. ఎక్స్‌కవేటర్‌లు వస్తే గానీ, బండరాళ్లను, కుప్పకూలిన కాంక్రీట్ దిబ్బలను తొలగించలేం" అని ఓ అధికారి జాతీయ మీడియాకు వివరించారు. ముండక్కైలో 150 వరకు ఇళ్లు ఉండగా.. వాటిల్లో 65 పూర్తిస్థాయిలో నేలమట్టమైనట్లు తెలిపారు. శిథిలాలను తొలగిస్తేగానీ లోపల ఎంత మంది ఉన్నారనేది తెలియదని పేర్కొన్నారు. చురల్‌మలలో కూడా నదికి సమీపంలో ఉన్న ఇళ్లు నేలమట్టమైనట్లు వెల్లడించారు. కాగా, వయనాడ్ ఘటనపై జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) స్పందించింది. ఈ విపత్తుపై సుమోటోగా కేసును స్వీకరించింది. మరోవైపు, వయనాడ్‌లోని పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదముందంటూ అధికారులు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. హెచ్చరికలు జారీ చేసినట్లుగానే.. కన్నడిపుళ, విలంగాడు, చురల్‌మల ప్రాంతాల్లో మధ్యాహ్నం కొండచరియలు విరిగిపడ్డాయి. ముందు జాగ్రత్త చర్యల వల్ల ప్రాణనష్టం జరగలేదని అధికారులు పేర్కొన్నారు.

ముందే హెచ్చరించాం: అమిత్‌షా

కేరళలో కొండచరియలు విరిగిపడే ప్రమాదముందని ముందే హెచ్చరించినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో వెల్లడించారు. "ఈ ముప్పు గురించి జూలై 23నే అప్రమత్తం చేశామన్నారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పౌరులను సకాలంలో తరలించలేదు. వయనాడ్ విషాదాన్ని ఎదుర్కొనేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం బాసటగా నిలుస్తుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ కోరారు. దీనిపై అమిత్‌షా స్పందించలేదు. మరోవైపు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ కూడా వయనాడ్ బాధితులకు సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాహుల్, ఆయన సోదరి ప్రియాంక వయనాడ్‌లో పర్యటించనున్నారు.

ప్రముఖుల సాయం

వయనాడ్ విపత్తుపై ప్రముఖ వ్యాపారవేత్తలు స్పందించారు. సీఎంఆర్ఎఫ్‌కు రూ.5 కోట్ల చొప్పున విరాళాలు ఇస్తామని లులూ గ్రూప్ చైర్మన్ ఎంఏ యూసుఫ్ అలీ, రవి పిళ్లై, కల్యాణ్ జ్యువెల్లర్స్ యజమాని కల్యాణరామన్, విజింజం పోర్ట్ అదానీ గ్రూప్ ప్రకటించాయి. తమిళ నటుడు విక్రమ్ రూ.20 లక్షల సాయాన్ని ప్రకటించారు. ఒమన్ సుల్తాన్ పాలకుడు సుల్తాన్ హైతం-బిన్-తారీఖ్ వయనాడ్ ఘటనపై ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. రాష్ట్రపతి ముర్ము కూడా కొండచరియలు విరిగిపడి పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అంతా అబద్ధం: విజయన్

లోక్‌సభలో అమిత్‌షా చేసిన ప్రకటనను కేరళ సీఎం విజయన్ ఖండించారు. బుధవారం ఆయన తిరువనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. "ప్రమాదం జరిగిన రోజు తెల్లవారుజామున మాత్రమే రెడ్ అలెర్ట్ జారీ అయ్యింది. అమిత్‌షా చెప్పిన దాంట్లో వాస్తవం లేదు. ఇది ఒకరిపై మరొకరు నిందలు వేసుకునే సాయం కాదు. కేంద్ర ప్రభుత్వం వారం రోజుల నుంచి వయనాడ్‌కు ఆరెంజ్ అలెర్ట్ మాత్రమే జారీ చేసింది. కానీ, భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయానికి (గడిచిన 48 గంటల్లో) 57.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది" అని పినరయి వ్యాఖ్యానించారు.

బెంగళూరు నుంచి వయనాడ్‌కు హనీమూన్ కోసమని వెళ్లిన రెండు జంటల్లో ఇద్దరు గల్లంతయ్యారు. ఒడిశాకు చెందిన రెండు జంటలు వయనాడ్‌లోని ఓ రిసార్టులో బస చేశాయి. రాత్రి నిద్రలో ఉండగానే రిసార్టు నామరూపాలు లేకుండా కొట్టుకుపోయింది. ఒడిశా నుంచి బెంగళూరుకు వచ్చిన రెండు జంటలు.. బెంగళూరులో ఓ కారు అద్దెకు తీసుకొని వయనాడ్ వెళ్లారు. ఆ

ఐదుగురిని కాపాడిన ఫోన్ కాల్

కారును హావేరికి చెందిన డ్రైవర్ మంజునాథ్ నడిపారు. ఆ రాత్రి రిసార్టుకు 300 మీటర్ల దూరంలో మంజునాథ్ కారులోనే నిద్రించాడు. కారుకు జీపీఎస్ ఉండడంతో అక్కడి ప్రమాదకర పరిస్థితుల కారణంగా కారు యజమాని సచిన్‌కు మెసేజ్ చేరింది. అర్ధరాత్రి కారు ఆన్ కావడంతో డ్రైవర్ మంజునాథ్‌కు ఆయన ఫోన్ చేశారు. 'మీరున్న ప్రాంతంలో ఏదో ప్రమాదం జరుగుతోంది' అని అప్రమత్తం చేశారు. రిసార్టు సమీపంలోనే చామరాజనగరకు చెందిన ఓ కుటుంబం నివసిస్తోందని, వారిని సంప్రదించాలని సూచించారు. మంజునాథ్ అక్కడికి వెళ్లేలోగా సచిన్.. చామరాజనగర్‌కు చెందిన నలుగురిని అప్రమత్తం చేశారు. దీంతో, ఆ ఇంట్లో ఉన్న అందరూ అర్ధరాత్రి బయటకు వచ్చి దూరంగా పరిగెత్తారు. ఆ తరువాత కాసేపటికే ఇల్లు నీటిలో కొట్టుకుపోయింది.

లోకం తీరు



ఢిల్లీలో రెడ్ అలెర్ట్

న్యూఢిల్లీ, జూలై 31 : భారత వాతావరణ శాఖ ఢిల్లీకి భారీ వర్ష సూచనతో రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక్కడ రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నట్లు హెచ్చరించింది. ఆగస్టు 5వరకు వర్షాలు కురుస్తాయని తెలిపింది. అలాగే ఒడిశాలోనూ పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలియజేసింది. హిమాచల్‌ప్రదేశ్‌లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అక్కడి వాతావరణ కేంద్రం హెచ్చరించింది. భారీ వర్షాల కారణంగా ఢిల్లీకి రావాల్సిన 10 విమానాలను బుధవారం దారి మళ్లించారు. ఢిల్లీలో లుటెన్స్ ఢిల్లీ, కశ్మీర్ గేట్, రాజేంద్ర నగర్ ప్రాంతాలు నీట మునిగాయి. కోచింగ్ సెంటర్లలో ఉంటున్న విద్యార్థులు నడుం లోతు నీళ్లలో నిలబడి నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాజేంద్రనగర్‌లో విద్యార్థులు మృతి చెంది 3రోజులు గడవక ముందే మళ్లీ అదే పరిస్థితి నెలకొందని ఆప్ ఎంపీ స్వాతి వాపోయారు. కాగా యూపీలో వర్షాల కారణంగా 24 గంటల్లో 12 మంది మృతి చెందారు.



సివిల్స్ అభ్యర్థులు చనిపోయిన రావూస్ స్టడీ సర్కిల్ ఎదుట నిలిచిన వరద

మానవ చర్యల వల్లే..

వయనాడ్ విలయానికి కారణం అదే.. కేరళలో తరచూ ప్రమాదాలు అందుకే

పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ ధ్వజం

మనిషి అత్యాశకు పోయి ప్రకృతితో ఆటలాడితే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది! అలనాటి కేదారనాథ్ వరదల నుంచి.. కేరళను ఏటా కుదిపేస్తున్న వరదలు, కొండచరియలు విరిగిపడడం వంటి ఉత్పాతాలన్నీ ఇందుకు ఉదాహరణలే. పశ్చిమ కనుమల స్థితిగతులపై అంచనా వేయడానికి 2010 మార్చిలో అప్పటి కేంద్ర పర్యావరణ శాఖ ఏర్పాటు చేసిన 14 సభ్యుల కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించిన మాధవ్ గాడ్గిల్ అదే మాట చెబుతున్నారు. మంగళవారం నాడు వయనాడ్‌ను వణికించిన విలయం మానవుల పాపాల ఫలితమేనని ఆయన తేల్చిచెప్పారు. అద్భుతమైన జీవావరణానికి, అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్న జీవజాతులకు ఆలవాలమైన పశ్చిమ కనుమలను.. పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన (ఎకలాజికల్లీ సెన్సిటివ్) మూడు జోన్లు(ఈఎస్‌జెడ్ 1, 2)గా విభజించాలంటూ ఆయన నేతృత్వంలోని కమిషన్ 2011 ఆగస్టు 31న కేంద్రానికి నివేదిక ఇచ్చింది. దేశ పడమటి తీరాన గుజరాత్ నుంచి తమిళనాడు దాకా ఆరు రాష్ట్రాల పరిధిలో విస్తరించి ఉన్న పశ్చిమ కనుమల్లో దాదాపు 70 శాతం ప్రాంతంలో ఎలాంటి వాణిజ్య కార్యకలాపాలకూ, మైనింగ్‌కు, అభివృద్ధి పనులకు, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని గాడ్గిల్ కమిషన్ తన నివేదికలో సూచించింది. ఈఎస్‌జెడ్-1లో మైనింగ్ అనుమతులను తగ్గించుకుంటూ వెళ్లి.. 2016 నాటికి అక్కడ మైనింగ్‌ను పూర్తిగా నిషేధించాలని.. రెండుజోన్లలోనూ 2015 నాటికి ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని, 2020 నాటికి అన్ని రకాల క్రిమిసంహారక పురుగుమందుల వినియోగాన్ని నిషేధించాలని సూచన చేసింది. తాజాగా ప్రమాదం జరిగిన ప్రాంతం గాడ్గిల్‌కమిషన్ గుర్తించిన జోన్-1 లోనిదే కావడం గమనార్హం. ఇక, ఈఎస్‌జెడ్-2లో మాత్రం మైనింగ్ కార్యకలాపాలను అత్యంత కఠినమైన ఆంక్షలతో కొనసాగించవచ్చని, ఎప్పటికప్పుడు మైనింగ్‌పై సోషల్ ఆడిట్ నిర్వహించాలని కమిషన్ సూచించింది. రెండు జోన్లలోనూ.. కొత్తగా ఎలాంటి డ్యాములు, రైల్వే లైన్లు, పెద్ద పెద్ద రహదారులు నిర్మించకూడదని.. అటవీ భూమిని అటవీయేతర అవసరాలకు మళ్లించడంపైన నిషేధం విధించాలని.. పశ్చిమ కనుమల్లో 75% ప్రాంతాన్ని పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన ప్రాంతంగా ప్రకటించాలని, అక్కడ ఏ ప్రాజెక్టుకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ అనుమతులు ఇవ్వరాదని ఇలా సూచనలు చేసింది.





పార్టీలకతీతంగా ఆగ్రహం

కేరళలో అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సర్కారు, ప్రతిపక్ష పార్టీలు, సైరో-క్యాథలిక్ మలబార్ చర్చ్.. ఆ నివేదిక అమలును ఆపేయాలంటూ సుప్రీంకోర్టు దాకా వెళ్లాయి. కానీ, సర్వోన్నత న్యాయస్థానం వారి అభ్యర్థనను తోసిపుచ్చింది. అప్పటి కేరళ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ అత్యవసరంగా అఖిలపక్ష సమావేశం నిర్వహించి.. గాడ్గిల్ కమిషన్ నివేదికను తిరస్కరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, వామపక్షాలు.. ఇలా పార్టీలకు అతీతంగా కేరళలో రాజకీయ నాయకులందరూ కమిషన్ నివేదికను చెత్తగా అభివర్ణించారు. ఆ ప్రాంతవాసుల జీవనోపాధి గురించి పట్టించుకోకుండా కమిషన్ ఆ నివేదిక ఇచ్చిందని.. పర్యావరణ పరిరక్షణ పేరుతో ఆ నివేదిక పశ్చిమ కనుమల ప్రాంతంలో అభివృద్ధిని పూర్తిగా నిలిపివేస్తుందని మండిపడ్డారు. దీంతో, కేంద్రం గాడ్గిల్ కమిషన్ నివేదికను పరిశీలించడానికి ప్రముఖ స్పేస్ సైంటిస్ట్ జి.కస్తూరి రంగన్ నేతృత్వంలో ఉన్నతస్థాయి వర్కింగ్ గ్రూపును నియమించింది. కానీ.. కస్తూరి రంగన్ కమిటీ కూడా జోనల్ వర్గీకరణలో చిన్నచిన్న మార్పులు సూచించింది. పశ్చిమకనుమల్లో 37% ప్రాంతాన్ని (గాడ్గిల్ కమిషన్ సూచించిన 75 శాతంలో సగం ప్రాంతం) పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతంగా ప్రకటించాలనే సవరణతో ఆ నివేదికను ఆమోదించింది. కానీ, ఇప్పటికీ ఆ ఈఎస్‌జెడ్‌లను నోటిఫై చేయకపోవడం గమనార్హం. కాగా, కస్తూరి రంగన్ కమిటీ సూచించిన చిన్నచిన్న మార్పులను సైతం మాధవ్ గాడ్గిల్ వ్యతిరేకించారు. ఆ చిన్నచిన్న వెసులుబాట్లు కూడా పశ్చిమ కనుమలకు తీరని నష్టం చేస్తాయని హెచ్చరించారు. తన హెచ్చరికలను కేరళ సర్కారు పట్టించుకోలేదని.. అందుకే ఆ రాష్ట్రంలో తరచుగా ప్రకృతి ఉత్పాతాలు సంభవిస్తున్నాయని గాడ్గిల్ బుధవారం పేర్కొన్నారు. - సెంట్రల్ డెస్క్

జీవవైవిధ్యానికి పట్టుగొమ్మ

పశ్చిమ కనుమలు.. మన భారతదేశ మ్యాప్‌లో పడమటివైపున గుజరాత్ నుంచి మొదలై మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, కేరళ మీదుగా తమిళనాడులోని కన్యాకుమారి దాకా.. 1600 కిలోమీటర్ల పొడవున ఒక పచ్చటి గీతలాగా విస్తరించిన పర్వత శ్రేణులు! దేశ జనాభాలో 40% భూభాగానికి... దాదాపు 24.5 కోట్ల జనాభాకు నీటివనరులను అందించే జలప్రదాతలు ఈ పశ్చిమ కనుమలు. కృష్ణా, గోదావరి, కావేరి వంటి ప్రధానమైన నదులకు.. తుంగ, భద్ర, భీమా, మలప్రభ, ఘటప్రభ, హేమావతి, కాబిని వంటి ఉపనదులకు పుట్టినిల్లు. అంతరించే ముప్పును ఎదుర్కొంటున్న జీవుల జాబితాలో ఉన్న 325 జీవజాతులు ఈ పశ్చిమకనుమల్లో ఉన్నాయి. ఇంతటి జీవవైవిధ్యానికి, పర్యావరణ అద్భుతాలకు ఆటపట్టయిన పశ్చిమ కనుమలపై మనిషి అత్యాశ అనే పడగ నీడ ఉన్నంతకాలం అవి ప్రమాదంలో ఉన్నట్టే! వాటితోపాటే మనుషులు కూడా ప్రమాదంలో ఉన్నట్టే!!

పూజా ఖేడ్కర్‌పై వేటు

- ట్రైనీ ఐఏఎస్‌గా నియామకం రద్దు
- మళ్లీ పరీక్షలు రాయకుండా నిషేధం



న్యూఢిల్లీ, జూలై 31: మహారాష్ట్రకు చెందిన వివాదాస్పద ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్‌పై యూపీఎస్సీ వేటు వేసింది. ట్రైనీ ఐఏఎస్‌గా ఆమె ఎంపికను రద్దు చేయడంతో పాటు జీవితంలో మళ్లీ అన్ని ప్రవేశ పరీక్షలు/యూపీఎస్సీ సెలెక్షన్స్‌లో పాల్గొనకుండా నిషేధం విధించింది. యూపీఎస్సీకి పూజా ఖేడ్కర్ తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్టు రుజువు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు బుధవారం అధికారులు వెల్లడించారు. 34 ఏళ్ల పూజపై ఆరోపణల నేపథ్యంలో 2009-2023 మధ్య ఐఏఎస్ స్క్రీనింగ్ ప్రక్రియను పూర్తి చేసిన 15 వేలమందికి పైగా అభ్యర్థుల డేటాను పరిశీలించినట్టు ప్యానల్ వెల్లడించింది.

వ్యవస్థలోని ఖేడ్కర్‌లనూ గుర్తించాలి

- సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్

హైదరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పూజా ఖేడ్కర్‌పై యూపీఎస్సీ అనర్హత వేటువేయడంపై సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సభర్వాల్ స్పందించారు. ఇప్పుడు వ్యవస్థలోని పూజా ఖేడ్కర్‌లనూ గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. యూపీఎస్సీ చైర్మన్‌గా కొత్త సారథి వచ్చినందున ఇందులో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని, తప్పులను దిద్దుబాటు చేయాల్సిన బాధ్యత ఆమెపై ఉందన్నారు.

యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ప్రీతిసూదన్

న్యూఢిల్లీ, జూలై 31: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) చైర్‌పర్సన్‌గా ప్రీతిసూదన్ నియమితులయ్యారు. ప్రస్తుతం యూపీఎస్సీ సభ్యురాలిగా ఉన్న ఆమె ఆగస్టు 1న ఈ మేరకు బాధ్యతలు స్వీకరించనున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రీతి సుదన్ 1983 బ్యాచ్ ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. 2020 జూలై వరకు మూడేళ్ల పాటు కేంద్ర ఆరోగ్య కార్యదర్శిగా ఆమె సేవలందించారు. కాగా, వ్యక్తిగత కారణాల వల్ల జూలై 4న యూపీఎస్సీ చైర్మన్ పదవికి మనోజ్ సోని రాజీనామా చేశారు.

గాలి మనవైపే

మూడు రాష్ట్రాల్లో గెలిస్తే దేశంలో రాజకీయ మార్పు

మెజారిటీ తగ్గినా ప్రధాని మోదీ పాఠాలు నేర్వలేదు

జనగణన చేపట్టే ఉద్దేశం లేనట్లుంది: సోనియా



బుధవారం పార్లమెంటు ఆవరణలో సోనియా, రాహుల్

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నాయని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు, పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్మన్ సోనియాగాంధీ అన్నారు. మరో 2-3 నెలల్లో మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయని.. మనం మంచి పనితీరును ప్రదర్శిస్తే జాతీయ రాజకీయాల్లో పరివర్తనం ఖాయమని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఈ ఎన్నికల్లో కూడా ప్రతిఫలించాలని చెప్పారు. బుధవారమిక్కడ సీపీపీ సమావేశంలో ఎంపీలనుద్దేశించి ఆమె ప్రసంగించారు. 'కాంగ్రెస్ ఇక తన వేగాన్ని ఆపకూడదు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పనిచేస్తూనే ఉండాలి. అతి విశ్వాసం గానీ, ఉదాశీనత గానీ కూడదు. దేశంలో పార్టీకి అనుకూల వాతావరణం ఏర్పడుతోంది. అందరూ ఒకే లక్ష్యంతో కలిసికట్టుగా పనిచేయాలి' అని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ గణనీయంగా పడిపోవడం చూసి మోదీ ప్రభుత్వం పాఠాలు నేర్చుకుంటుందని భావించామని.. కానీ వారు మతాలను విడదీసే విధానం కొనసాగిస్తున్నారని.. భయం, విద్వేష వాతావరణాన్ని వ్యాప్తి చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో విద్యావ్యవస్థను కుప్పకూల్చారని ఆరోపించారు. జాతీయ భద్రత ఆందోళనకరంగా ఉందని.. జమ్మూకశ్మీర్లో మళ్లీ తీవ్రవాదం ప్రబలుతోందని అన్నారు. ఇదిలా ఉండగా, ఉభయసభల్లో సమర్థంగా మాట్లాడారంటూ రెండు సభల్లో ప్రతిపక్ష నేతలైన రాహుల్ గాంధీ, ఖర్గే, ఇతర నేతలను సోనియా అభినందించారు. ఆర్థిక, సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో బడ్జెట్ విఫలమైన తీరును వారు బాగా ఎండగట్టారని కొనియాడారు. బడ్జెట్‌పై దేశవ్యాప్తంగా అసంతృప్తి నెలకొందన్నారు. "2021లో జరిపించాల్సిన జనగణనను చేపట్టే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి లేదని స్పష్టమవుతోంది. దేశ జనాభా సంఖ్య, ముఖ్యంగా దళితులు, ఆదివాసీల సంఖ్య గురించి అంచనా లేదు. యూపీఏ ప్రవేశ పెట్టిన ఆహార భద్రతా చట్టం పేరు మార్చి 'ప్రధాని గరీబ్ కల్యాణ్ అన్న యోజన'గా వ్యవహరిస్తున్నారు' అని విమర్శించారు.

మోదీపై సభా హక్కుల తీర్మానం

న్యూఢిల్లీ, జూలై 31: ప్రధాని మోదీపై కాంగ్రెస్ పార్టీ లోక్‌సభలో సభా హక్కుల తీర్మానాన్ని ప్రవేశ పెట్టింది. ఈ మేరకు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు పంజాబ్ మాజీ సీఎం, కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ బుధవారం ఫిర్యాదు చేశారు. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ సభలో చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను సభాపతి రికార్డుల నుంచి తొలగించారని, అయితే ఆ తొలగించిన వ్యాఖ్యలతో సహా మొత్తం ప్రసంగం వీడియోను మోదీ 'ఎక్స్'లో పోస్టు చేయడం దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆ ఫిర్యాదు లేఖలో చన్నీ పేర్కొన్నారు. కాగా, ఇండియా కూటమి మురికి రాజకీయాలను బహిర్గతం చేస్తూ... వాస్తవాలు, హాస్యచతురతతో అనురాగ్ ఠాకూర్ చేసిన ప్రసంగాన్ని తప్పనిసరిగా వినాలంటూ ప్రధాని ఎక్స్‌లో కితాబిచ్చారు.

హమాస్ చీఫ్ హనియా హతం

- హెజ్‌బొల్లా కమాండర్ షుక్ర్ కూడా
- టెహ్రాన్‌లో హనియా ఇంటిపై క్షిపణి దాడి
- ప్రతీకారం తప్పదన్న హమాస్



బీరుట్, జూలై 31: ఇజ్రాయెల్‌కు శత్రువులు, ఇద్దరు కీలక వ్యక్తులు కొన్ని గంటల వ్యవధిలోనే హతమయ్యారు. హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా(62)ను ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో హతమార్చగా.. హెజ్‌బొల్లా కమాండర్ ఫాద్ షుక్ర్‌ను బీరుట్‌లో మట్టుపెట్టారు. హనియా హత్యపై ఇజ్రాయెల్ స్పందించలేదు. మరోవైపు హెజ్‌బొల్లాపై ప్రతీకార దాడులు తప్పవని హెచ్చరిస్తున్న ఇజ్రాయెల్ మంగళవారం రాత్రి లెబనాన్ రాజధాని బీరుట్‌పై క్షిపణులు ప్రయోగించింది. తమ దేశంపై ఇటీవల రాకెట్ దాడికి పాల్పడి.. 12 మంది చిన్నారులు, యువత మృతికి కారణమైన హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ కమాండర్ ఫాద్ షుక్ర్ లక్ష్యంగా ఈ దాడి జరిపింది. ఈ దాడిలో తమ షుక్ర్ మరణించినట్లు బుధవారం రాత్రి హెజ్‌బొల్లా ప్రకటించింది. టెహ్రాన్‌లోని హనియా ఇంటిపై కూడా క్షిపణి దాడి జరిగినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఈ దాడిలో హనియా, ఆయన అంగరక్షకుడు మృతి చెందినట్లు వెల్లడించారు. హనియా ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై ఇంటికి వచ్చిన తర్వాత దాడి జరిగినట్లు చెబుతున్నారు. హమాస్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. దీన్ని ఇజ్రాయెల్ దాడిగా అభివర్ణించింది. ఇక ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హనియా ముగ్గురు కుమారులు, నలుగురు మనవళ్లు, మనవరాళ్లు మరణించినట్లు అప్పట్లో హమాస్ ప్రకటించింది. హనియా, షుక్ర్ హత్యలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరగనున్నాయి. గాజాలో ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధం మరిన్ని ప్రాంతాలకు విస్తరించే ముప్పు ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

జీవిత, వైద్య బీమాలపై జీఎస్టీ తొలగించండి

ముంబై, జూలై 31: జీవిత బీమా, వైద్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ మేరకు ఆయన లేఖ రాశారు. నాగపూర్ డివిజనల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం నేతలు.. బీమా పరిశ్రమకు సంబంధించిన సమస్యలను తనకు విన్నవించారని, అందులో వారు ప్రధానంగా జీవిత, వైద్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని ఉపసంహరించాలని డిమాండ్ చేశారని గడ్కరీ ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ రెండు బీమా ప్రీమియంలపై జీఎస్టీ 18 శాతంగా ఉందని, వాటిపై జీఎస్టీ విధించడమంటే జీవితంలోని అనిశ్చిత పరిస్థితులపై పన్ను విధించడమేనని ఆయన అన్నారు. కుటుంబానికి భరోసా కల్పించే ఉద్దేశంతో జీవిత బీమాను కొనుగోలు చేస్తుంటారని, అలాంటి ప్రీమియంలపై పన్ను విధించకూడదని ఉద్యోగుల సంఘం భావిస్తోందని చెప్పారు.

రాయల్టీని తిరిగి చెల్లిస్తే పీఎస్‌యూలు దివాలా

న్యూఢిల్లీ, జూలై 31: గనులు, ఖనిజాలపై ఇప్పటి వరకూ వసూలు చేసిన రాయల్టీని తమకు చెల్లించాలంటూ పలు రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న డిమాండ్‌ను కేంద్రం వ్యతిరేకించింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. రాష్ట్రాలు కోరుతున్నట్లు, 1989 నుంచి ఇప్పటి వరకూ వసూలు చేసిన రాయల్టీని చెల్లించాల్సి వస్తే, అది దాదాపు రూ.70 వేల కోట్లు అవుతుందని, మైనింగ్ రంగంలో ఉన్న పలు ప్రభుత్వ రంగసంస్థలు దివాలా తీస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. గనులు, ఖనిజాలపై పన్ను విధించే అధికారం రాష్ట్రాలదేనని జూలై 25వ తేదీన 9మంది సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 1989 నుంచి ఇప్పటి వరకూ ఈ 35 ఏళ్లలో కేంద్రం భారీ ఎత్తున వసూలు చేసిన రాయల్టీని తమకు చెల్లించేలా ఆదేశించాలని ఝార్ఖండ్ తదితర రాష్ట్రాలు ధర్మాసనాన్ని కోరాయి.

చిన్న బ్యాంకులకు టెక్నాలజీ అందించే సీ-ఎడ్జ్ టెక్నాలజీస్‌పై ర్యాన్సమ్‌వేర్ దాడి

- స్తంభించిన పలు సహకార బ్యాంకుల కార్యకలాపాలు

న్యూఢిల్లీ, జూలై 31: దేశంలోని పలు చిన్న, సహకార బ్యాంకులకు బ్యాంకింగ్ టెక్నాలజీ అందించే 'సి-ఎడ్జ్ టెక్నాలజీస్' అనే సర్వీస్‌ప్రొవైడర్‌పై హ్యాకర్లు దాడిచేశారు. ఆ సంస్థ సర్వర్లను హ్యాక్ చేసి తాము అడిగిన మొత్తం చెల్లించాలని డిమాండ్‌చేశారు. దీంతో దేశవ్యాప్తంగా 300 చిన్న బ్యాంకుల్లో కార్యకలాపాలు మూడు, నాలుగు రోజులుగా నిలిచిపోయాయి. ఆయా బ్యాంకుల వినియోగదారులు ఏటీఎంల నుంచి డబ్బు తీసుకోలేకపోతున్నారు. యూపీఐ చెల్లింపులు జరపలేకపోతున్నారు. ఈ దాడితో అప్రమత్తమైన నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. సీ-ఎడ్జ్ టెక్నాలజీస్ సంస్థకు రీటైల్ పేమెంట్ సిస్టమ్స్ యాక్సెస్‌ను నిలిపివేసింది. ఆ సంస్థ కార్యకలాపాల పునరుద్ధరణకు అధికారులు యుద్ధప్రాతిపదికన కృషిచేస్తున్నారు. గురువారం ఉదయానికల్లా పరిస్థితి చక్కబడుతుందని అంచనా వేస్తున్నారు.



కృష్ణమూర్తి-ప్రేమలత (ఫైల్)

భర్త మృతి తట్టుకోలేక భార్య ఆత్మహత్య

తల్లాడ, జూలై 31: కష్ట సుఖాల్లో తోడుగా ఉన్న భర్త అకాల మరణంతో ఓ ఇల్లాలు బలవన్మరణానికి పాల్పడింది. బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఖమ్మం జిల్లా తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత తల్లాడ సొసైటీ మాజీ చైర్మన్ జక్కంపూడి కృష్ణమూర్తికి ప్రేమలతతో 1971లో వివాహమైంది. వారికి కిషోర్, రాము అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. కిషోర్ హైదరాబాద్‌లో కాంట్రాక్టర్‌గా పని చేస్తుండగా రాము అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డాడు. కొన్ని రోజులుగా కృష్ణమూర్తి క్యాన్సర్‌తో బాధపడుతూ జూలై 27న మరణించారు. అప్పటి నుంచి ప్రేమలత తీవ్ర మనోవేదనతో ఉన్నారు. భర్త చనిపోయిన ఐదు రోజుల వ్యవధిలోనే బుధవారం ఉదయం ఇంటి సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.

నామమాత్రంగానే రుణ మాఫీ

నిబంధనల వల్ల 70% మందికి అందలేదు.. రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి

- రుణమాఫీ కాని వారు.. వివరాలు తెలియజేయండి
- మీ తరపున బీజేపీ పోరాటం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్ సెంటర్ ప్రారంభం



టోల్ ఫ్రీ నంబర్‌ను విడుదల చేస్తున్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఏ గ్రామంలో ఎంత మంది రైతులకు రుణ మాఫీ చేశారు? రైతుల వారీగా విడుదల చేసిన నిధులెన్ని? మొదటి, రెండో దశల్లో రుణమాఫీ పొందిన రైతుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏక కాలంలో రుణ మాఫీ చేస్తామన్న కాంగ్రెస్ సర్కార్.. ఇప్పుడు దశలవారీగా అంటూ మాట మార్చిందని, అది కూడా నామమాత్రంగానే అమలు చేస్తోందని ఆరోపించారు. పలు నిబంధనలతో 70శాతం మంది రైతులకు అతీగతీ లేకుండా పోయిందన్నారు. రైతులకు అండగా నిలిచేందుకు కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని బుధవారం కిషన్ రెడ్డి ప్రారంభించారు. రుణమాఫీ జాబితాలో లేని రైతులు, కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి కారణంగా నష్టపోతున్న అన్నదాతలు 88861 00097 నంబర్‌కు ఫోన్ చేసి తమ వివరాలు అందజేయాలని కిషన్‌రెడ్డి కోరారు. రైతు భరోసాతోపాటు పంటలకు రూ.500 బోనస్ కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ గ్రామాల్లో రచ్చబండ నిర్వహించాలని పిలుపునిచ్చారు. తమకు రుణమాఫీ ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలంటూ సీఎం రేవంత్‌కు రైతులు లేఖ లు రాయాలని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి.. వారికి న్యాయం జరిగేలా పార్టీ పోరాడుతుందని కిషన్‌రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం కారణంగా వేలాది మంది రైతులను బ్యాంకులు డీఫాల్టర్ల జాబితాలో చేర్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. "అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 6గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కానీ, ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ధరణితో నష్టపోయిన రైతుల సమస్యలు పరిష్కరిస్తామని గొప్పలు చెప్పారు. మాటలు కోటలు దాటాయి కానీ.. చేతలు మాత్రం సెక్రటేరియట్ దాటడం లేదు" అని ఆరోపించారు. మోసం చేయడం కాంగ్రెస్ నైజమని ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి, పీఆర్సీ, ఏమైంది? బెల్ట్‌షాపులు ఎందుకు రద్దు చేయడం లేదు? జాబ్ క్యాలెండర్ ఏది? అని సీఎం రేవంత్‌ను నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గత బడ్జెట్ కంటే రూ.10వేల కోట్లు తగ్గించారని, విద్యా రంగానికి 7.60శాతం నిధులే కేటాయించారని విమర్శించారు. కాగా, రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ విమర్శించారు.

సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు

లోక్‌సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టత

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణిని ప్రైవేటీకరించే ఆలోచన కేంద్రప్రభుత్వానికి లేదని పార్లమెంటు వేదికగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. లోక్‌సభలో బుధవారం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి సమాధానమిచ్చారు. సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 51శాతమని, కేంద్రం వాటా 49 శాతమని తెలిపారు. అలాంటప్పుడు సింగరేణిని కేంద్రం ఎలా ప్రైవేటీకరిస్తుందని ప్రశ్నించారు.

ముల్కనూర్ మహిళా డెయిరీ సభ్యులకు బతుకమ్మ బోనస్

- లాభాల్లో నుంచి రూ. 11.57 కోట్లు ఖర్చు

భీమదేవరపల్లి, జూలై 31: ముల్కనూర్ మహిళా డెయిరీ సభ్యులకు బతుకమ్మ పండగ బోనస్ అందిస్తామని ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ ప్రకటించారు. అందుకు రూ.11.57 ఖర్చు చేస్తామని వారు తెలిపారు. బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో జరిగిన ముల్కనూర్ మహిళా డెయిరీ వార్షిక మహాసభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఈ డెయిరీ పరిధిలో 2.06 కోట్ల లీటర్ల పాల సేకరణ జరిగిందని, తద్వారా రూ. 13.57 కోట్ల లాభాలు వచ్చాయని వెల్లడించారు. ఇందులో రూ.11.57 కోట్లను బతుకమ్మ పండగ సందర్భంగా మహిళా రైతులకు బోనస్‌గా అందజేస్తున్నామన్నారు.

APGVB ANDHRA PRADESH GRAMEENA VIKAS BANK
HEAD OFFICE : : WARANGAL

NOTICE FOR INVITING ONLINE TENDERS

Tenders for Printing & Supply of i)Applications, Forms, Vouchers, Passbooks, Booklets & ii) Registers (Refer Tender Notice No.5 & 6, Dated: 30.07.2024)

We invite online tenders for Printing and supply of Stationery Items to our Bank. For details, see tender documents placed in our Banks' website: www.apgvbank.in & https://etender.sbi which can be downloaded at free of cost. The last date for submission of Tender is 20.08.2024 by 04:00 PM

General Manager (Operations)

మునిసిపల్ కౌన్సిల్ వేములవాడ

"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

1) E1/525/VMD/MGF/2024, ఎ) వేములవాడ పురపాలక సంఘంలో మునిసిపల్ జనరల్ ఫండ్స్ క్రింద ఇతర కవర్ చేయబడని వార్డులలో వీధి, రోడ్డు మరియు వార్డు వివరాల సూచిక పేరుబోర్డుల ఏర్పాటు, బి) మొత్తం అంచనా విలువ రూ.20.00 లక్షలు, 2) E1/526/VMD/MGF/2024, ఎ) మునిసిపల్ జనరల్ ఫండ్స్ క్రింద వేములవాడ పురపాలక సంఘంలో వర్షాల సమయంలో నీరు నిలిచిన ప్రదేశాల వద్ద ఓపెన్ డ్రెయిన్ తయారీకు మరియు రోడ్డుకు ఇరువైపులా పొదల తొలగింపు కొరకు హైడ్రాలిక్ ఎక్స్‌కవేటర్ (జెసిబి) అద్దె, బి) మొత్తం అంచనా విలువ రూ.5.00 లక్షలు. 9) మొత్తం పనులు (8), 10) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ: 01.08.2024, 11) బిడ్ల స్వీకరణకు చివరి తేదీ: 09.09.2024న సా.4.30 గం.ల వరకు, 12) బిడ్ ధర తెరుచు తేదీ & సమయం: 09.08.2024న సా. 4.45 గం.ల నుండి

సం/- కమీషనర్, వేములవాడ పురపాలక సంఘం

DIPR R.O. No.2319-PP/CL/ADVT/1/2024-25 తేదీ: 31.07.2024

వరంగల్ మహా నగర పాలక సంస్థ

"ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

టెండరు ప్రకటన నం.EE-IV/GWMC/CTN/30/e-proc/2024 తేదీ: 31.07.2024

పనుల సారాంశం:ఎమ్‌పిఎల్ జనరల్ ఫండ్ క్రింద 4 నం.ల పనులు: 3 నం.ల ఎలక్ట్రికల్ పనుల కొరకు రూ.139.17 లక్షలు, 01 నం.ఇఎస్‌టి పని కొరకు రూ.24.40 లక్షలు. **టెండరు-4 నం.ల పనుల కొరకు 7 రోజులు. డౌన్‌లోడింగ్ కొరకు చివరి తేదీ:** 08.08.2024న ఉ.11.30 గం.వరకు. **బిడ్లు తెరవడం:** 08.08.2024న ఉ.11.45 గం.లకు **సంప్రదించుటకు వివరాలు:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-IV, GWMC, వరంగల్ ఇమెయిల్: **ee.elec.gwmc@gmail.com.** తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా **www.eprocurement.gov.in** లో చూడగలరు. ఇ-ప్రొక్యూర్ పనుల డౌన్‌లోడింగ్ ప్రారంభం: 01.08.2024 నుండి.

సం/- కమిషనర్, వరంగల్ మహానగర పాలక సంస్థ.

DIPR RO No. 2314-PP/CL/ADVT/1/2024-25 తేదీ: 31.07.2024

సవరించిన చట్టంతో తెలంగాణకు అన్యాయం : తమ్మినేని

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భూ వినియోగ విధానాన్ని సవరిస్తూ కేంద్రం చేసిన చట్టంతో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు.దీంతో ప్రభుత్వ భూములు, ప్రభుత్వ రంగ సంస్థల భూములను కేంద్ర బొగ్గుగనుల శాఖ ద్వారా ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇచ్చి మైనింగ్ చేసేందుకు అవకాశముందని ఓ ప్రకటనలో ఆరోపించారు.

GST: 36AAACT4053B3ZR

भारतीय कपास निगम लिमिटेड

THE COTTON CORPORATION OF INDIA LIMITED
A Mini Ratna Company (Government of India Undertaking - Ministry of Textiles)

Branch Office, Mangalmurthy Tower, 1st Floor, Cinema Road, Adilabad - 504 001, Telangana.
Ph: 08732-226538/226708, E-mail: adilabad@cotcorp.com

REF:CCI/ADL/MKTG/SALES/2023-24 DT.31.07.2024

టెక్స్‌టైల్ ఇండస్ట్రీకి విజ్ఞప్తి

ప్రస్తుతం CCI ప్రతిరోజు రెండు ఇ-వేలం నిర్వహిస్తోంది. అంటే ఒకటి టెక్స్‌టైల్ మిల్లుల కోసం ప్రత్యేకంగా మరియు మరొకటి అన్ని వర్గాలకు చెందిన కొనుగోలుదారులకు. ఇంకా, టెక్స్‌టైల్ మిల్లులు / కొనుగోలుదారులు 30 సెప్టెంబర్ 2024తో ముగిసే కాటన్ సీజన్‌లో మిగిలిన కాటన్ అవసరాలను పొందేందుకు వీలుగా, CCI ఇప్పుడు డెలివరీ వ్యవధిని 1 ఆగస్టు 2024 నుండి 60 రోజుల వరకు పొడిగించింది. వివరణాత్మక నిబంధనలు & షరతుల కోసం కొనుగోలుదారులు CCI వెబ్‌సైట్ : www.cotcorp.org.inలో "CCI ద్వారా FP కాటన్ బేల్స్ అమ్మకానికి సంబంధించిన నిబంధనలు మరియు షరతులను" దయచేసి చూడగలరు.

కాబట్టి CCI ప్రస్తుత పత్తి సీజన్‌లో (2023-24) తమ స్టాక్ అవసరాలు ఏమైనా ఉంటే, వీలైనంత త్వరగా కవర్ చేయమని గౌరవనీయులైన మిల్లు కొనుగోలుదారులందరికి విజ్ఞప్తి చేస్తుంది.

APPEAL TO TEXTILE INDUSTRY

It is informed that at present CCI is holding daily two e-auctions i.e. one exclusively for textile mills and another to all category of buyers. Further, to enable Textile Mills/buyers to source their cotton requirements for the rest of Cotton Season ending 30th September, 2024, CCI has now extended delivery period upto 60 days w.e.f 1st August 2024. For detailed terms & conditions, buyers may kindly refer "Terms and Conditions for Sale of FP Cotton Bales by CCI" on website of CCI: www.cotcorp.org.in.

CCI therefore appeals to all its esteemed Mill Buyers to cover their stock requirements, if any, for current cotton season (2023-24) at the earliest.

Date: 31-07-2024

Sd/- Dy. General Manager
CCI Adilabad.



సగానికి పైగా నిండిన సాగర్

- 2.16 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- గోదావరిలో బ్యారేజీలకే భారీగా వరద
- భద్రాచలం వద్ద 44.9 అడుగుల ఎత్తులో ప్రవాహం

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: కృష్ణమ్మ ఉధృతికి నాగార్జున సాగర్‌లో నీటిమట్టం పెరుగుతోంది. ఎగువన శ్రీశైలం నుంచి 8 గేట్ల ద్వారా 2.16 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు సగానికి పైగా నిండింది. 312.05 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో ప్రస్తుతం 161.97 టీఎంసీల నీరు ఉంది. కృష్ణాబేసిన్‌లో సాగర్ దిగువన ఉన్న పులిచింతల మినహా మిగిలిన ప్రాజెక్టులన్నీ దాదాపుగా నిండాయి. గోదావరి బేసిన్‌లో సాగునీటిని అందించే కీలక ప్రాజెక్టుల్లో తప్పిస్తే.. మిగతా ప్రాజెక్టుల్లో వచ్చిన నీటిని వచ్చినట్లు గానే విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గుతోంది. బుధవారం సాయంత్రం 44.9 అడుగుల నీటి మట్టం నమోదైంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కాగా, గురువారం ఏపీ సీఎం చంద్రబాబు శ్రీశైలం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఈ సందర్భంగా కృష్ణమ్మకు జలహారతి ఇవ్వనున్నారు.

బీసీలకు రాజ్యాధికారం కోసం త్వరలో రాజకీయ పార్టీ ఏర్పాటు

- ఆగస్టు చివరి వారంలోపు కులగణన చేయాలి
- లేకుంటే లక్ష మందితో హైదరాబాద్ దిగ్బంధిస్తాం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల



ప్రసంగిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

గణేశ్‌నగర్, జూలై 31: బీసీలకు రాజ్యాధికార కోసం ప్రత్యేకంగా రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కరీంనగర్‌లో బుధవారం బీసీ సమగ్ర కుల గణన సాధన యాత్ర ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకొస్తే ఆరు నెలల్లో బీసీ గణన చేసి రిజర్వేషన్ పెంచుతామని ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేసిందని, దాన్ని ఆ పార్టీకి గుర్తు చేయడానికే తాను కామారెడ్డి నుంచి యాత్ర ప్రారంభించానన్నారు. బీసీ రిజర్వేషన్ పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు పోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించకుంటే గాంధీభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాడతామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేసి బీసీల వాటా తేల్చాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 2న తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టరేట్ల ఎదుట నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని, ఆగస్టు చివరి వారంలోపు కులగణన చేయకుంటే లక్ష మందితో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు.

అప్లై చేయడానికి QR ని స్కాన్ చేయండి

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427; ఫ్యాక్స్: 022-22820411

స్పోర్ట్స్ వ్యక్తుల నియామకం

భారతీయ స్టేట్ బ్యాంకు స్పోర్ట్స్ వ్యక్తుల నియామకం కోసం అర్హులైన భారతీయ పౌరులనుండి దరఖాస్తులు కోరుచున్నది

పోస్ట్ పేరు	ఖాళీ
అధికారులు (క్రీడాకారులు)	17
క్లరికల్ సిబ్బంది (క్రీడాకారులు)	51

అర్హత ప్రమాణాలు (వయస్సు, విద్య, క్రీడలు అర్హత మొదలైనవి) ఆవసరమైన ఫీజులు మరియు ఇతర వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు మరియు ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు లింక్‌తో పాటు, బ్యాంక్ వెబ్‌సైట్ **https://bank.sbi/web/careers/current-openings** ప్రకటన నం. **CRPD/SPORTS/2024-25/07** లో లభిస్తుంది. అభ్యర్థులు అప్లై చేసే ముందు మరియు ఫీజు చెల్లించే ముందు పూర్తి ప్రకటనను చూసి, తమ అర్హతలను నిర్ధారించుకోమని సలహా.

- **ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : 24.07.2024 నుండి 14.08.2024 వరకు**

ఏమైనా సందేహాలు ఉన్నా, దయచేసి మాకు పైన పేర్కొన్న బ్యాంకు అధికారిక వెబ్ సైటు లో అందుబాటులో ఉన్న - **"CONTACT US"** - లింకు ద్వారా వ్రాసి పంపండి

స్థలం: ముంబయ్
తేదీ: 24.07.2024

మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వయనాడ్ విలాపం

కేరళలోని వయనాడ్‌జిల్లాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఏకంగా గ్రామాలకు గ్రామాలు ఆనవాళ్ళు లేకుండా పోయాయి. వందలాది ఇళ్ళు నేలమట్టమై, మొత్తం కుటుంబాలు ప్రాణాలు వదిలేసిన ఘోర విషాదం ఇది. బురదలో చిక్కుబడిన మృతదేహాలను వెలికి తీయడం అత్యంత కష్టమైపోతున్నది. వందలాదిమందిని ఒకేసారి ముంచేసిన ఈ అతిపెద్ద విపత్తులో సహాయక చర్యలు మరింత కాలం కొనసాగక తప్పదు.

విపక్షాల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలను సమస్యలు వెంటాడినప్పుడు కేంద్ర మంత్రుల స్పందన సామాన్యంగా ఉండదు. గత చరిత్రనంతా తవ్వితీసి అక్కడి పాలకులు అసమర్థులనీ, బధిరులనీ విరుచుకుపడతారు. విషాద సమయాల్లో ఈ తుచ్ఛరాజకీయాలేమిటని ఉపన్యాసాలు ఇస్తూనే వయనాడ్ దారుణంమీద కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు రాజకీయ యుద్ధం చేసుకుంటున్నాయి. భయంకరమైన వర్షాలు పడతాయనీ, కొండచరియలు విరిగి పడి ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడతాయనీ ఎంతో ముందుగా హెచ్చరించినా పినరయ్ ప్రభుత్వం పెడచెవినపెట్టిందని హోంమంత్రి దాడికి దిగారు. ఆయన మాటలు కేంద్రప్రభుత్వాన్ని సమర్థించుకోవడానికి పరిమితం కాలేదు. తాము హెచ్చరించినా రాష్ట్రప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు, ప్రజల ప్రాణాలకు ముప్పు ఉన్నదని చెప్పినా సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా వారి కర్మానికి వారిని వదిలివేసినట్టు ఆయన వ్యాఖ్యలు అర్థాన్నివ్వడంతో పినరయ్ సమర్థింపులతో పాటు విమర్శలకు కూడా దిగారు. ఎవరిది నిజం అన్న ప్రశ్నను అటుంచితే, భారీ వర్షాలు కురుస్తాయని కేంద్రం వారం ముందుగానే హెచ్చరించివుండ వచ్చు, ఎన్డీఆర్ఎఫ్‌ను సైతం పంపివుండవచ్చు కానీ, ఒక్కసారిగా హెచ్చిన ముప్పును ముందుగా అంచనావేయడం కష్టమైన విషయమే. కేంద్రం తన హెచ్చరికలో పేర్కొన్న వర్షపాతానికీ, కొద్దిగంటల్లోనే కురిసిన కుంభవృష్టికీ హస్తిమశకాంతరం ఉన్నది. ఆ మూడు రంగుల హెచ్చరికలు తమకు ఏయే దశలో ఎప్పుడెప్పుడు అందాయో, అప్పటికే అక్కడ జరిగిందేమిటో పినరయ్ వివరించారు. అంతమాత్రాన రుతుపవనాల కాలంలో ప్రతీ హెచ్చరికనూ తీవ్రంగా తీసుకోవాల్సిన బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించలేదు.

కేరళలోని పద్నాలుగు జిల్లాలో పదిజిల్లాలు కొండచరియలు విరిగిపడే ప్రమాదం అధికంగా ఉన్నవి. ఏడేళ్ళకాలంలో దేశం మొత్తం మీద 3782ఘటనలు జరిగితే, అందులో 2239 ఘటనలు కేరళలోనే జరిగాయి. ఏటా కేరళలోని ఏదో ఒకజిల్లాలో కొండచరియలు విరిగిపడి కొందరు మరణించడం జరుగుతూంటుంది. వర్ష విషాదాలు దానిని వెన్నాడుతూనే ఉంటాయి. 2018 ఆగస్టులో వర్ష బీభత్సం వందలాది ప్రాణాలు తీసింది, లక్షల మందిని పునరావాస శిబిరాలకు తరలించాల్సివచ్చింది. ఒక ఏడాది రాష్ట్ర బడ్జెట్ అంత ఆర్థిక నష్టాన్ని మిగల్చిన విషాదం ఇది.

వయనాడ్‌లో ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరుగా ఉన్న ప్రాంతాలన్నీ ఇప్పుడు నేలమట్టమైపోయాయి. పెను విషాదం కమ్మేసిన ఈ ప్రాంతాలన్నీ పర్యాటకులు మెచ్చినవే. పెరుగుతున్న పర్యాటకం, తదనుగుణంగా సాగుతున్న భారీ నిర్మాణాలు సున్నితమైన ఈ ప్రాంతాలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నమాట నిజం. ఆచరణకు దూరంగా మిగిలిపోయిన గాడ్గిల్ కమిటీ నివేదికలను ఇలాంటి విషాదాలు సంభవించినప్పుడల్లా స్మరించుకోవడం వినా ఏమీ జరగడం లేదు. ప్రకృతితో చెలగాటం ఎంత ప్రమాదకరమో, వాతావరణమార్పు ఎంతటి ఉపద్రవాన్ని సృష్టిస్తుందో ఈ ఘటన గుర్తుచేస్తోంది. వేడెక్కిన అరేబియా సముద్రం కుంభవృష్టికీ ఎడతెగని భారీ వర్షాలకూ కారణమవుతోంది. ఒక ఆనకట్ట ఒక్కసారిగా బద్దలైనట్టుగా ఏకంగా ఎనిమిదికిలోమీటర్ల మేరకు కొండచరియలు కొట్టుకురావడం, భారీ పరిమాణంలో నీరూ, బురదా ప్రజలను సజీవంగా కప్పివేయడం ఇప్పటివరకూ అరుదు.

బిల్లులు సమర్పించలేదనీ, నిధులు సక్రమంగా వినియోగించలేదనీ అభ్యంతరాలు వెలిబుచ్చుతూ నిధుల విడుదలలో అడపాదడపా ఆటంకాలు కల్పిస్తున్న కేంద్రప్రభుత్వం ఈ విషాదసమయంలో కేరళపట్ల సానుభూతితో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. వయనాడ్ ఘోరాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలన్న విపక్షపార్టీల అభ్యర్థనను పరిశీలించి, కేరళను భారీ ఆర్థికసాయంతో ఆదుకోవాలి. మిగతారాష్ట్రాలు తమకు తోచిన సాయం చేస్తున్నాయి, ధనికులూ ప్రముఖులూ విరాళాలు ప్రకటిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్ సహా, అన్ని రకాల సహాయసహకారాలు ఉంటాయని హామీ ఇచ్చిన కేంద్రప్రభుత్వం తక్షణమే నిధుల విడుదలతో ఈ కష్టంనుంచి బయటపడేవరకూ రాష్ట్రాన్ని కాపుగాయాల్సిన అవసరం ఉంది.

ఇంత గొప్ప కీర్తిని సొంతం చేసుకున్నా ఎక్కడా ఉద్వేగానికి, ఆవేశానికి చోటివ్వని మను భాకర్ పరిపక్వత, పతకం సాధించిన తర్వాత గీతాశ్లోకాన్ని (కర్మణ్యే వాధికారస్తే..) గుర్తుచేసిన తీరు ప్రతి భారతీయుడినీ ఉద్వేగానికి గురిచేసింది. ప్యారిస్ వేదికపై రెండు ఒలింపిక్స్ మెడల్స్ సాధించి, జాతీయంగా, అంతర్జాతీయంగా గొప్ప పేరు తెచ్చుకోవడంతోపాటుగా, కేంద్ర ప్రభుత్వ TOPS (టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్) పథకం ద్వారా అందుతున్న సానుకూల ఫలితాలకు చక్కటి ఉదాహరణగా నిలిచిందీ యువ తరంగం.



అమృతకాలపు స్ఫూర్తిపతాక 'మను'

కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మ ఫలహేతుర్భూర్మాతే సంగోస్త్వ కర్మణీ

"పని చేయాల్సిన బాధ్యత మాత్రమే నీది. ఫలితాన్ని ఆశించే హక్కు నీది కాదు. అలాగని నీ పని చేయడం మాత్రం ఆపొద్దు. ప్రతిఫలాన్ని ఆశించకుండా పని చేయాలి," ఇది కురుక్షేత్రం వేదికగా పార్థుడికి శ్రీకృష్ణ పరమాత్ముడు చేసిన గీతాబోధలోనిది. గత రెండు రోజులుగా ఈ శ్లోకం ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతోంది. దీనికి కారణం మను భాకర్ అనే భారత యువ కెరటం. 2024 ఒలింపిక్స్‌లో దేశానికి తొలి పతకాన్ని అందించడంతోపాటుగా ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన భారత క్రీడాకారిణిగా, షూటింగ్‌లో భారతదేశానికి పతకం తీసుకొచ్చిన తొలి మహిళగా రికార్డు సృష్టించిందీ యువతరంగం. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలను గెలవడం స్వతంత్ర భారత చరిత్రలోనే ఇది తొలిసారి.

ఇంత గొప్ప కీర్తిని సొంతం చేసుకున్నా ఎక్కడా ఉద్వేగానికి, ఆవేశానికి చోటివ్వని మను భాకర్ పరిపక్వత, పతకం సాధించిన తర్వాత గీతాశ్లోకాన్ని (కర్మణ్యే వాధికారస్తే..) గుర్తుచేసిన తీరు ప్రతి భారతీయుడినీ ఉద్వేగానికి గురిచేసింది. దేశం కోసం కష్టపడటం మాత్రమే నాకు తెలుసు, ఫలితం నా చేతిలో లేదని ఒక్క మాటలో ఆమె చెప్పిన తీరు 140 కోట్ల మంది భారతీయుల గుండెలను గర్వంతో నింపింది. ప్యారిస్ వేదికపై రెండు ఒలింపిక్స్ మెడల్స్ సాధించి, జాతీయంగా, అంతర్జాతీయంగా గొప్ప పేరు తెచ్చుకోవడంతోపాటుగా, కేంద్ర ప్రభుత్వ TOPS (టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్) పథకం ద్వారా అందుతున్న సానుకూల ఫలితాలకు చక్కటి ఉదాహరణగా నిలిచిందీ యువ తరంగం. ప్రపంచ క్రీడావేదికల మీద భారత్ సామర్థ్యాన్ని పెంచేలా అవసరమైన ప్రోత్సాహాన్ని, వసతులను కల్పించడం కోసం 2014లో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ TOPS పథకం అనుకున్న లక్ష్యాల దిశగా వెళ్తోందని మరోసారి నిరూపితమైంది.

2018 కామన్వెల్త్ గేమ్స్ క్రీడల్లో బంగారు పతకాన్ని సాధించి అందరి దృష్టినీ ఆకర్షించిన మను భాకర్ కెరటం సామర్థ్యానికి కేంద్ర ప్రభుత్వం TOPS పథకం చేయూతనందించింది. దీంట్లో భాగంగా మను భాకర్ శారీరక, మానసిక, నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందుకుంది. '2020 టోక్యో ఒలింపిక్స్' టార్గెట్‌గా మిషన్ మొదలైంది. అంతా సరిగ్గానే జరుగుతోందనుకున్న సమయంలో టోక్యో ఒలింపిక్స్‌లో మను పిస్టల్ మాల్‌ఫంక్షన్ (మొరాయించడం) కారణంగా పతకం చేజారింది. కానీ ఆమె ఏ మాత్రం కలత చెందలేదు. ఇవాళ పతకం గెలిచిన తర్వాత ఎంత స్థితప్రజ్ఞతనైతే ప్రదర్శించిందో అదే పరిపక్వతను టోక్యో పతకం చేజారిన తర్వాత కూడా చూపించింది.



'కర్మణ్యే వాధికారస్తే..' అన్నట్లుగా తన వంతుగా 100 శాతం ప్రయత్నించింది. ఫలితం గురించి కలత చెందకుండా తర్వాతి ఈవెంట్లపై దృష్టిసారించింది. ప్యారిస్ ఒలింపిక్స్ కోసం పూర్తిగా సన్నద్ధమైంది. టాప్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ మానసికంగా మరింత దృఢత్వాన్ని పొందడంపై దృష్టిసారించింది. దీని ఫలితమే ప్యారిస్ వేదికగా ముచ్చటగా మూడు ఘనతలను తన ఖాతాలో వేసుకుంది.

2014లో TOPS పథకాన్ని ప్రారంభించిన తర్వాత ఇలాంటి ఆణిముత్యాలను వెలికితీసి సానబెట్టే ప్రయత్నం జోరందుకుంది. అథ్లెట్లు, ప్లేయర్ల క్రీడానైపుణ్యాన్ని సానబెట్టేందుకు అవసరమైన ఆర్థిక సహకారం, ప్రపంచస్థాయి కోచింగ్, అత్యాధునిక స్పోర్ట్స్ సైన్స్ సపోర్ట్, ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించడం వంటివాటితోపాటుగా, వారి శారీరక, మానసిక సామర్థ్యాన్ని పెంచేందుకు జరిగిన ప్రయత్నం సత్ఫలితాలను ఇస్తోంది. టాప్స్ పథకంలో భాగంగా భారతదేశ మిషన్ ఒలింపిక్స్ సెల్ (MOC) అనే ఓ కమిటీని ఏర్పాటుచేసి ఇందులో మాజీ అథ్లెట్లు, కోచ్‌లు, వివిధ క్రీడాసంఘాలకు సంబంధించిన సమర్థులైన అధికారులను కేంద్రం నియమించింది. ఈ ఏర్పాట్ల ద్వారా క్రీడాకారులు పతకాలు సాధించేందుకు ఏమేం కావాలి, వాటిని ఎలా సమకూర్చాలనే దానిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఖేలో ఇండియా, టాప్స్ వంటి పథకాల ప్రభావంతో 2023 ఆసియా క్రీడల్లో 107 మెడల్స్ సాధించిన భారత దేశం, ప్రపంచ క్రీడావేదికలపై 'హమ్ కిసీసే కమ్ నహీ' అన్నట్లుగా ముందుకెళ్తోంది.

టాప్స్ పథకం ఎలా పనిచేస్తుందనడానికి ఒక ఉదాహరణ బ్యాడ్మింటన్ స్టార్, రెండుసార్లు ఒలింపిక్స్ మెడలిస్ట్ పీవీ సింధు. తెలుగుతేజమైన పీవీ సింధు మూడోసారి ఒలింపిక్స్ పతకాన్ని సాధించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలనూ కేంద్ర ప్రభుత్వం టాప్స్ ద్వారా కల్పించింది. ఈ యువ క్రీడాకారిణి సామర్థ్యాన్ని మరింతగా పెంచేందుకు 12 మంది ప్రత్యేక నిపుణుల బృందం ఆధ్వర్యంలో జర్మనీ–ఫ్రెంచ్ సరిహద్దుల్లోని 'సార్ బ్రూకెన్' అనే పట్టణంలో సింధుకు బూట్ క్యాంప్ ఏర్పాటుచేసి శిక్షణనిస్తున్నారు. ఇది కేంద్రప్రభుత్వ క్రీడాభివృద్ధి సంకల్పానికి ఒక ఉదాహరణ. టేబుల్ టెన్నిస్ చాంపియన్ మానికా బాత్రా ప్రాక్టీస్ కోసం పారిస్ వాతావరణం లాగా బాల్ బౌన్సింగ్, పేస్, స్పిన్ ఉండే ఇంపోర్టెడ్ టేబుల్ టెన్నిస్ బల్లను సిద్ధం చేశారు. హార్స్ రైడింగ్‌లో భాగమైన ఈక్వెస్ట్రేన్ పోటీలో పాల్గొనే అనుష్ అగర్వాల్ కోసం ఆయన గుర్రానికి అవసరమయ్యే ప్రత్యేక ఫీడ్, బ్లాంకెట్లు, బూట్స్, సాడిల్స్ వంటివి సమకూర్చారు. ఇలా ప్రతి క్రీడాకారుడికి అవసరమైన వసతులను సమకూర్చి ఒలింపిక్స్ పతకాలు సాధించడమే లక్ష్యంగా 'టాప్స్'పై చిత్తశుద్ధితో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోంది. ఇందుకోసం ఇప్పటివరకు రూ.100 కోట్లకు పైగా ఖర్చుచేసింది.

టాప్స్‌లో ఇప్పటివరకు 230 మంది అథ్లెట్లకు 40కి పైగా పారాఅథ్లెట్లు శిక్షణ పొందారు. ప్రస్తుతం 120మంది అథ్లెట్లు, 60కి పైగా పారా అథ్లెట్లు శిక్షణ పొందుతున్నారు. వీరంతా కోర్ టీమ్ కాగా మరో 130 మంది అథ్లెట్లు డెవలప్‌మెంట్ స్టేజ్‌లో ఉన్నారు.

ఇలాంటి పథకాల ద్వారా క్రీడాకారులకు ప్రోత్సాహం జరుగుతుండగానే దేశంలోనే మొట్ట మొదటి స్పోర్ట్స్ యూనివర్సిటీని రూ.634.34 కోట్లతో మణిపూర్‌లో కేంద్రం ఏర్పాటుచేసింది. స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మ్యానుఫ్యాక్చరింగ్, కోచింగ్, స్పోర్ట్స్ సైకాలజీ వంటి కీలకమైన అంశాలపై ఈ యూనివర్సిటీ ప్రత్యేక దృష్టి సారించింది. దీంతోపాటుగా కేంద్రం క్రీడాభివృద్ధికోసం బడ్జెట్ విషయంలో రాజీలేని నిర్ణయాలు తీసుకుంటోంది. దీని ఫలితాలు క్షేత్రస్థాయిలో కనబడుతున్నాయి. చాలా మంది ఔత్సాహికులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ తమ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇవాళ దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా 'ఖేలో ఇండియా' కేంద్రాలు, 30కి పైగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లు పనిచేస్తున్నాయి. ఖేలో ఇండియాలో భాగంగా రూ.2,168 కోట్లతో దేశవ్యాప్తంగా క్రీడారంగంలో చేపట్టిన మౌలికవసతులు ఔత్సాహిక యువతకు నిరంతరం ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయి. ఖేలో ఇండియా ద్వారా గుర్తించబడి అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇచ్చిన 28 అథ్లెట్లు ఇవాళ పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్నారు.

మోదీ ప్రభుత్వ ప్రయత్నాల కారణంగానే మను భాకర్, సరబ్ జోత్, నీరజ్ చోప్రా, పీవీ సింధు, లవీనా బోర్గోహైన్, మీరాబాయి చానూ, నికత్ జరీన్ వంటి క్రీడాకారులు దేశం కోసం మెడల్స్ తీసుకొచ్చారు. భారత హాకీ జట్టు కూడా 41 ఏళ్ల తర్వాత టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుచుకుంది. ఇదే స్ఫూర్తితో ప్యారిస్ ఒలింపిక్స్‌లోనూ భారత జట్టు సత్తా చాటి 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలను సాకారంచేస్తారనే బలమైన విశ్వాసం నాకుంది. ఈ క్రీడోత్సవాల ఫలితాలు ఎలా ఉంటాయనేదానికన్నా భారతదేశంలో క్రీడాభివృద్ధికి, రేపటి క్రీడా బంగారు భవిష్యత్తుకు బాటలు పడుతుండటం చాలా సంతోషకరమైన విషయం.

■ జి. కిషన్ రెడ్డి
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

తల్లుల గర్భశోకం, దయలేని లోకం!

హమాస్ నాయకుడు ఇస్మాయిల్ హానియేను టెహరాన్‌లో ఆయన బస చేసిన చోటనే రాకెట్ దాడితో హత్య చేశారు. ఇది దుర్మార్గమైన యూదు ఉన్మాద హత్య అని హమాస్ చెబుతోంది. ఇంకా ఒప్పుకోలేదు కానీ, ఇది ఇజ్రాయిల్ చేసిన హత్యే అని తెలిసిపోతోంది. ప్రపంచంలో చెడును తగ్గించడానికి ఇదే సరైన పద్ధతి అని ఇజ్రాయిల్ మంత్రి ఒకరు ట్వీట్ చేశారు కూడా. పాలస్తీనా పోరాట చరిత్రలో ఇటువంటి హత్యలు పెద్ద ఆశ్చర్యం ఏమీ కాదు. కానీ, ఇటువంటి బోరవిరుపు, అంతర్జాతీయ సమాజాన్ని ఖాతరు చేయని తనం మాత్రం పశ్చిమాసియా సంఘర్షణలోనే కాదు, ప్రపంచమంతటా కూడా పెరిగిపోతున్న ధోరణి. ఇరాన్ కొత్త అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ప్రమాణస్వీకారానికని హానియే ఇరాన్ వెళ్లారు. మన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో పాటు హానియే కూడా ఆ వేడుకలో పాల్గొన్నారు. ప్రమాణకార్యక్రమం తరువాత అర్ధరాత్రి ఈ హత్య జరిగింది. ఒకపక్కన శాంతిచర్చలు జరుగుతుండగా, అమెరికా ఎన్నికల్లో సైతం పాలస్తీనా సమస్య ప్రముఖ అంశంగా పరిణమిస్తుండగా, ఈ హత్య జరిగింది. దీనికి గొలుసుకట్టు పర్యవసానాలు అనేకం ఉంటాయి. ఈ ఏడు గ్లోబల్ రాజకీయాలు మరింత ఉద్రిక్తం అవుతాయి.

చంపుతామని ఇజ్రాయిల్ ముందే చెప్పింది. చిట్టచివరి హమాస్ సభ్యుడిని చంపేవరకు వదిలిపెట్టబోమని చెబుతూనే ఉంది. ఇక అధినేతను వదులుతుందా? ఏ టర్కీలోనో, ఖతార్‌లోనో ఉండగా చంపవచ్చుకదా? ఎందుకు చేయలేదు? పోయిన ఏడాది అక్టోబర్ 7నాడు హమాస్ చేసిన హత్యాకాండ వెనుక ఇరాన్ దన్ను ఉందని ఇజ్రాయిల్‌కూ, లోకానికీ కూడా తెలుసు. ఇరాన్ గడ్డ మీదనే, హమాస్ నేతను చంపి చూపించాలని ఇజ్రాయిల్ అనుకున్నది. 'గుస్ గుస్ కే మారా' అని తన గురించి నాయకుడు, నాయకుడి గురించి ప్రజలు గర్వంగా చెప్పుకుంటున్న రోజుల్లో, ఇజ్రాయిల్ చర్య సాహసోపేతమైనదిగా, 'మగతనానికి' ఆనవాలుగా కనిపించడంలో ఆశ్చర్యం ఉండదు.

ఇజ్రాయిల్ మొదటి నుంచీ దాదాపుగా ఇంతే, 1948లో, 1967లో కూడా ఆ దేశానిది క్రూరమైన తెంపరి తనమే. ఐక్యరాజ్యసమితిని కానీ, ప్రపంచ దేశాల అభిప్రాయం కానీ లెక్కచేయకపోవడమే దాని నైజం. అప్పుడప్పుడు మాట వరసకు పాలస్తీనాకు న్యాయం గురించి, రెండుదేశాల పరిష్కారం గురించి మాట్లాడుతూ, చేతల్లో మాత్రం ఇజ్రాయిల్‌ను పెంచి పోషించింది అమెరికాయే. సోవియట్ రష్యా విచ్ఛిన్నమయిన తరువాత, ఇజ్రాయిల్ ప్రాధాన్యం, దుందుడుకుతనం మరింత పెరిగాయి. ఓస్లో ఒప్పందం ద్వారా పాలస్తీనా ఉద్యమం రెండడుగులు కిందికి దిగినా, ఇజ్రాయిల్ దాన్ని గౌరవించలేదు. మొత్తంగా దేశమంతటినీ యూదుల సెటిల్‌మెంట్లతో నింపేసి, పాలస్తీనా జీవితాలను అతిచిన్న భూభాగంలో శరణార్థి శిబిరాలకు, లేదా కిక్కిరిసిన జనావాసాలకు పరిమితం చేయడం దాని లక్ష్యంగా ఉంది. ఇజ్రాయిల్ దక్షిణ సరిహద్దులో ఉన్న ఎడారి ప్రాంతంలోకి గాజావాసులను పూర్తిగా తరిమేసి, వారిని అక్కడే ఉంచడం పరిష్కారమన్న జియోనిస్టుల ప్రతిపాదనకు ట్రంప్ ప్రభుత్వం వంతపాడింది కూడా. మరోపక్క, ఆరంభంనుంచి పాలస్తీనా పక్షాన ఉన్న దేశాలు ఒక్కొక్కటిగా జారిపోవడం మొదలుపెట్టాయి. చిట్టచివరగా సౌదీ అరేబియా కూడా ఇజ్రాయిల్‌తో సంబంధాలు పెట్టుకోబోతున్నప్పుడు, దానిని నివారించడానికి హమాస్ గత అక్టోబర్‌లో హంతక దాడులు చేసింది. హమాస్ 1100 మంది ఇజ్రాయిలీలను చంపగా, అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ 40 వేల మంది పాలస్తీనియన్లను చంపింది. ఈ లెక్క ఇంకా పెరుగుతోంది.

హానియే హత్య తరువాత ఏం జరుగుతుంది? ఈ ఘాతుకానికి జవాబు తప్పక ఇస్తామని హమాస్ సహజంగానే అంటుంది, అంది. ఇరాన్ కూడా బాధ్యులను కనుగొని చర్యలు తీసుకుంటామని అంది. హమాస్ ఎంతగా ప్రతికూల ప్రచారానికి లోనయిందంటే, ఈ చర్యను నేరుగా ఖండించేందుకు ప్రపంచ నేతల్లో చాలా మందికి నోరు రావడం లేదు. ఒకపక్క చర్చలు జరుగుతుండగా, ఇదేమిటని శాంతిప్రక్రియలో పాలుపంచుకుంటున్న ఖతార్ బాధపడింది. చైనా మాత్రం హత్యను తీవ్రంగా ఖండిస్తూ, తక్షణం కాల్పుల విరమణ జరగాలని కోరింది. తనకు ఎటువంటి సంబంధం లేదని అమెరికా చేతులు దులుపుకుంది.



పశ్చిమాసియా, ఉక్రెయిన్ మాత్రమే కాదు, ప్రపంచమంతా ఒక కొత్త అమానవీయ పతనస్థాయికి చేరుకున్నట్టు కనిపిస్తున్నది. రాజకీయ వ్యూహాలు అతి కర్కశంగా అనైతికంగా మారుతున్నాయి. మన దేశంలోనూ అంతే. మణిపూర్ హాహాకారాలు కేంద్ర ప్రభుత్వాన్ని ఎంతకీ కదిలించలేదు. దేశరాజకీయాల ప్రాతిపదికన మణిపూర్‌పై స్పందన కూడా చీలిపోయింది. బాధితులనే అన్యాయంగా నిందించే మనుషులు పెరిగిపోయారు. కానీ లెమ్మని, జరగనిమ్మని, జరగవలసిందేనని అనుకుంటున్నారు. అట్లాగే, ఛత్తీస్‌గఢ్.

హమాస్, హిజ్బొల్లా వంటి సంస్థల వెనుక ఇరాన్ ఉంటే, ఇజ్రాయిల్ చర్యల వెనుక అమెరికా ఉండాలి కదా? బైడెన్ ప్రభుత్వం ఎంతటి అవకాశవాద వైఖరితో వ్యవహరించి, ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలిచినా, రెండు దేశాల పరిష్కారం మీద, గాజాలో కాల్పుల విరమణ మీద సూత్రప్రాయంగా ఆమోదంతో ఉన్నది. ఒక సందర్భంలో 2000 పౌండ్ల బాంబులను పంపడానికి నిరాకరించింది కూడా. మునుపెన్నడూ లేని విధంగా అమెరికాలో పాలస్తీనాకు మద్దతు పెరిగింది. ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. మరి తన పెద్దన్న దేశానికి ఇబ్బందికరమైన పని ఇజ్రాయిల్ ఎందుకు చేస్తుంది? ఇజ్రాయిల్ ప్రస్తుత తీవ్రవాదానికి అమెరికా అండలో కాక, మరెక్కడైనా మూలాలు ఉన్నాయేమో చూడాలి. బహుశా, ప్రపంచ వ్యవస్థలో ఇప్పుడు ఏకధ్రువత కూడా చెదిరిపోవడం వల్ల పెద్ద దేశాలతో పాటు, కొంత బలమూ బలగమూ ఉన్న అనేక చిన్నా చితకా రౌడీ దేశాలు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నాయనిపిస్తుంది. కాకపోతే, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ అమెరికన్ కాంగ్రెస్‌లో మాట్లాడిన తీరు ఏమిటి? ఒక పక్కన బైడెన్ అతనితో శాంతి చర్చల ప్రక్రియ గురించి మాట్లాడుతుంటే, గాజా మీద బాంబుదాడులు పెంచడమేమిటి? ఇద్దరూ కూడబలుక్కుని చేశారనుకోవడానికి కూడా లేదు. తాను నష్టపోతూ అందుకు అమెరికా ఎందుకు సిద్ధపడుతుంది?



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఏ విలువలూ విధానాలూ లేకుండా పోయిన అంతర్జాతీయ రాజకీయాలలో, పాలస్తీనా సమస్య ప్రచ్ఛన్న యుద్ధ కాలం నుంచి కొనసాగుతున్న పురాతన అంశం. భారతదేశం సంగతే చూద్దాము. ఇప్పటికీ అధికారికంగా పాలస్తీనాకు రెండు దేశాల పరిష్కారాన్ని భారత్ కోరుకుంటుంది. సార్వభౌమాధికారాన్ని, ప్రతిపత్తిని గుర్తిస్తుంది. కానీ, మరోవైపు 1960లలో రహస్యంగా మొదలుపెట్టి, 1970ల మీదుగా, 1990లలో ఇజ్రాయిల్‌తో అధికారిక సంబంధాలను ఏర్పాటు చేసుకున్నది. బీజేపీ హయాంలో నైతే పట్టపగ్గాలు లేని దౌత్యం మొదలయింది. కానీ, పాలస్తీనాకు మద్దతుగా నిలబడి, ఇజ్రాయిల్ మీద కత్తులు దూస్తున్న ఇరాన్ కూడా భారత్‌కు చాలా గట్టి నేస్తం. మొన్నటి దాకా ఇరాన్ మీద యుద్ధానికి కాలుదువ్విన అమెరికాను అదుపు చేయడంలో రష్యా ముందుంది. ఈ రష్యా భారత్‌కు సోవియట్ కాలం నుంచి కొనసాగుతున్న పాత భల్లూకపు నేస్తం. అమెరికా పక్కన నిలిచీ, దౌత్యాన్ని పెంచీ ఇజ్రాయిల్‌కు అండగా ఉన్నట్టు కనిపిస్తున్న భారత్, మరో కోణంలో, రష్యా పక్కన నిలిచి ఇరాన్‌కు, హమాస్‌కూ కూడా మద్దతు తెలుపుతున్నట్టే. ఈ విదేశాంగ వైఖరుల్లో ఏ విలువలూ లేవు. రేపు ట్రంప్ గెలిస్తే, అతను అనుసరించే తీవ్ర ఇజ్రాయిల్ అనుకూల విధానాలతో బహుశా, రష్యాకు కూడా పెద్ద అభ్యంతరం ఉండదు. ఉక్రెయిన్ మీద అదనంగా నాలుగు బాంబులు వేస్తానని రష్యా అంటే, ట్రంప్ కూడా కాదనడు. ఈ ఇద్దరితో సఖ్యంగా ఉంటూ, పాలస్తీనా విముక్తిని కోరుకుంటూ, ఇజ్రాయిల్ దాడులకు కళ్లు మూసుకుంటూ, ఇండియా లౌక్యంగా మెసలగలదు!

బాహాటంగా రష్యాతోను, చాటుగా చైనాతోను గట్టి స్నేహాలున్న ఇండియాను తొందరపడి దూరం చేసుకోవాలని అమెరికా అనుకోదు. కానీ, ఉక్రెయిన్ మీద రష్యా దాడి విషయంలో భారత్ వైఖరి అమెరికాకు సంతృప్తికరంగా లేదు. ఆ అసంతృప్తిని అతిగా ప్రకటించకుండా, "తలచుకుంటే మోదీ యుద్ధాన్ని ఆపగలరు" అన్న ప్రశంసాత్మక అభిప్రాయాన్ని ప్రచారంలో పెట్టారు. ఎక్కడ మోదీ దానికి ప్రభావితమవుతారో అనుకున్న పుతిన్, మోదీ మాస్కోలో ఉన్నప్పుడే, ఉక్రెయిన్‌లో పిల్లల ఆస్పత్రి మీద బాంబు వేశాడు. దానితో జెలెన్స్కీ మోదీకి నైతికమైన సవాల్ విసిరాడు. మోదీ చాలా ఇబ్బంది పడ్డారు. ఎంతో కొంత అప్రదిష్ట వచ్చిందని గ్రహించో, లేదా, అమెరికాను ఊరడించడానికో మోదీ ఇప్పుడు ఉక్రెయిన్‌కు ఒక ప్రత్యేక యాత్ర చేయబోతున్నారు. మరి అప్పుడు పుతిన్ మరో దాడిచేస్తే? అలా చేయబోమని, అనధికార హామీ ఏదో లభించి ఉండవచ్చు. లేకపోతే, కష్టమే.

ఇక్కడ మళ్లీ అనేక అనుబంధ ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. ఉక్రెయిన్‌లో పిల్లల మరణాలు మానవీయమైన స్పందనల అవసరాన్ని చాటి చెప్పినప్పుడు, గాజా పట్టీలోని వేలాది మంది పిల్లల చావులు ఎందుకు ఎవరినీ కదలించలేకపోతున్నాయి? దుఃఖాలకు లెక్కలుండకూడదు నిజమే కానీ, అధికారికంగా 1139 మందిని చంపిన అక్టోబర్ 7 నాటి హమాస్ దాడిలో పిల్లలు 33 మంది, మరి ఆ తరువాత ఇజ్రాయిల్ చేసిన ఆకాశ, భూతల దాడుల్లో గాజాలో మరణించిన పిల్లల సంఖ్య 13,800 మంది. ఏ పక్షానికి చెందిన ఏ ఒక్క చిన్నారీ ఈ సంఘర్షణల్లో చనిపోకూడదనే అందరం కోరుకుంటాం. కానీ, పదులకు స్పందించిన గుండెలు, వేల మరణాలకు ఎందుకు మౌనంగా ఉంటున్నాయి?

ఇజ్రాయిల్ మొదటి నుంచీ దాదాపుగా ఇంతే, 1948లో, 1967లో కూడా ఆ దేశానిది క్రూరమైన తెంపరి తనమే. ఐక్యరాజ్యసమితిని కానీ, ప్రపంచ దేశాల అభిప్రాయం కానీ లెక్కచేయకపోవడమే దాని నైజం. అప్పుడప్పుడు మాటవరసకు పాలస్తీనాకు న్యాయం గురించి, రెండుదేశాల పరిష్కారం గురించి మాట్లాడుతూ, చేతల్లో మాత్రం ఇజ్రాయిల్‌ను పెంచి పోషించింది అమెరికాయే.

ఘర్షణలో ఉన్న పక్షాలకు, చంపడానికి, చావడానికీ వాటి సమర్థనలు, కారణాలు వాటికి ఉంటాయి. కానీ, జీవిత పోరాటంలోనే మునిగిపోయిన నిరాయుధులు దాడులకు ఎందుకు లక్ష్యం కావాలి? ఏ పక్షం వైపు న్యాయం ఉన్నదో చెప్పలేకపోవచ్చు, కానీ, అమాయకుల మరణాల గురించి ప్రపంచం ఎందుకు మాట్లాడదు? పశ్చిమాసియా, ఉక్రెయిన్ మాత్రమే కాదు, ప్రపంచమంతా ఒక కొత్త అమానవీయ పతనస్థాయికి చేరుకున్నట్టు కనిపిస్తున్నది. రాజకీయ వ్యూహాలు అతి కర్కశంగా అనైతికంగా మారుతున్నాయి. మన దేశంలోనూ అంతే. మణిపూర్ హాహాకారాలు కేంద్ర ప్రభుత్వాన్ని ఎంతకీ కదిలించలేదు. దేశరాజకీయాల ప్రాతిపదికన మణిపూర్‌పై స్పందన కూడా చీలిపోయింది. బాధితులనే అన్యాయంగా నిందించే మనుషులు పెరిగిపోయారు. కానీ లెమ్మని, జరగనిమ్మని, జరగవలసిందేనని అనుకుంటున్నారు. అట్లాగే, ఛత్తీస్‌గఢ్. అక్కడి మరణాల గురించి మాట్లాడడానికి నక్సలైట్ల మీదనో, ప్రభుత్వ విధానాల మీదనో ఏదో ఒక వైఖరి అవసరమా? అమాయక ఆదివాసుల మరణాలు సమాజాన్ని కుదిపివేయకూడదా?

'ధరణి' ఇలాగైతే ఎలా మరి?

తమ భూ వివాదాల పరిష్కారానికి సార్వత్రిక ఎన్నికలకు ముందు తేదీ వరకు ధరణి పోర్టల్‌కి 2,47,000 తెలంగాణ రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 1,05,000 వరకు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి అయినాయి. ప్రభుత్వం మారింది. తమకు న్యాయం జరుగుతుందని, అన్ని భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ధరణి సంబంధిత పనులు ఏవీ కూడా ముందుకు వెళ్లడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారంలో ఏదో ఒక రోజు ప్రజావాణి పేరిట అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆయన కార్యాలయంలోను, ఆర్డీఓ, కలెక్టర్ ఆఫీసు పరిధిలో కూడా అన్ని రకాల దరఖాస్తులతో పాటు భూ సంబంధిత దరఖాస్తులను కూడా స్వీకరిస్తున్నారు. ధరణికి సంబంధించినవి అయితే మీ సేవ ద్వారా 1100+400 మొత్తం రూ.1500 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

ఇలా వివిధ ఆఫీసుల్లో తీసుకున్న దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తూ కలెక్టర్‌కు పంపుతారు. ఆయన ఆయా శాఖాధిపతులకు వాటిని కేటాయిస్తూ... అందులో ధరణి సంబంధిత దరఖాస్తులను స్థానిక మండల రెవెన్యూ కార్యాలయానికి పంపిస్తారు. వాటన్నింటినీ పరిశీలించి సమస్యల వారీగా విచారణ చేపడతారు. ఇందులో ధరణి దరఖాస్తుల విచారణ పూర్తి చేసి కలెక్టర్‌కి పంపిస్తారు. అక్కడి నుంచి తెలంగాణ భూపరిపాలన అధికారి, హైదరాబాద్ వారికి పంపుతారు, వారిదే తుది నిర్ణయంగా పరిగణించబడుతుంది. గత కొన్ని దశాబ్దాలుగా ఎనభై శాతం పనులు తహశీల్దారు కార్యాలయంలో, మిగతా పనులు ఆ పై అధికారి వద్ద నిర్ణయాలు జరిగేవి. గతంలో వికేంద్రీకరించబడిన అధికారాలన్నీ తిరిగి కేంద్రీకృతమయ్యాయి. ఇది ప్రజలకు జవాబుదారీతనం నుంచి దూరంగా ఉంటూ, పారదర్శకత లేని పరిపాలనగా మారింది.

లక్షలాది దరఖాస్తులు ఒక రాష్ట్ర స్థాయి అధికారి నిర్ణయం కోసం ఎదురుచూడటం చాలా సమయం తీసుకునే ప్రక్రియ. ఈలోగా రైతులు ఆందోళనకు గురి అవుతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచిపోతున్నాయి. కానీ వారి పనులు కావడం లేదు ఇది గ్రామీణ ప్రజల ప్రయోజనాలకు ఏ మాత్రం శ్రేయస్కరం కాదు.

గతంలో ఉన్న ధరణి పోర్టల్ టీఎం 33 వరకు మాడ్యూల్స్ ప్రతి సమస్యకు సంబంధించి ఒక మాడ్యూల్, వాటి ద్వారా సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అయ్యేలా కొన్ని సాఫ్ట్‌వేర్లను ధరణి పోర్టల్‌తో లింక్ చేసారు. కానీ, ఏ తహసిల్దార్ కార్యాలయానికీ ఇంతవరకు ఏ రకమైన లాగిన్లు (ప్రవేశం) ఇవ్వలేదు. పెద్ద సమస్యకు పరిష్కార గది సి.సి.ఎల్.ఏ. కార్యాలయం. అంటే రైతులు ఏ దశలో ఏ అధికారిని కలవాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. చివరాఖరికి అన్నింటికీ రాష్ట్ర రెవెన్యూ అత్యున్నత స్థాయి అధికారిని బాధ్యుడిగా చేసింది. ఇందులో పాత ప్రభుత్వానికి, కొత్త ప్రభుత్వానికి ఏ రకమైన తేడా కనిపించడం లేదు.

ప్రస్తుతానికైతే ధరణి పోర్టల్‌తో మ్యుటేషన్లు, సక్సెషన్స్ (ఫౌతీ) మాత్రమే జరుగుతున్నాయి. మిగతా పనులన్నీ స్తబ్దుగానే ఉన్నాయి. ధరణి పోర్టల్‌తో నిమిత్తం లేని పనులు కూడా పూర్తికావడం లేదు. పాత, కొత్త ప్రభుత్వాల మధ్య సాధారణ రైతు నలిగిపోతున్నాడు. త్వరలో అన్ని సమస్యలకు ఒక దారి దొరుకుతుందని పత్రికల్లో వస్తోంది. నిజంగానే ధరణిలో తప్పులను సరిదిద్దాలి, కొత్త సూచనలు చేయాలి, కొత్త వ్యవస్థను రూపొందించాలి అంటే అందుకు కొంత సమయం పడుతుంది. ధరణిలో మార్పుల కొరకు ఏర్పాటు చేసిన కమిటీ పనులు కొనసాగుతున్నా ఈ కింది సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటే బాగుంటుంది.

ముందుగా 'సాదా బైనామా' దరఖాస్తులు మొత్తం తొమ్మిది లక్షల పైచిలుకు ఉన్నాయి. అందులో చర్యలు తీసుకున్నవి ఆరున్నర లక్షల వరకు ఉన్నాయి. మరో రెండున్నర లక్షల దరఖాస్తులపై చర్యలు తీసుకోవలసి ఉంది. వీటి పరిష్కారానికి చట్టంలో చిన్న మార్పులు అవసరం... అందుకు నిబద్ధత కావాలి. ఇది ఏ మాత్రం ఖర్చు లేని పని. కేవలం తెలంగాణ ప్రభుత్వ అసెంబ్లీ నిర్ణయం మీదనే ఆధారపడింది. భూమి సమస్యల ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి ల్యాండ్ ట్రిబ్యునల్ ఖచ్చితంగా అవసరం. ట్రిబ్యునల్స్ జిల్లాల వారీగా ఉంటే బాగుంటుందని వేరే రాష్ట్రాల అనుభవాలు చెబుతున్నాయి.

అరవై శాతం జీవనాధారంగా ఉన్న వ్యవసాయ భూములు వాటి పరిరక్షణ బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉంటుంది. కాబట్టి, అధికారికంగా వేసిన కమిటీ పాత పద్ధతులకు భిన్నంగా, పారదర్శకంగా ప్రతి రైతుకు అందుబాటులో ఉంటూ, సులభంగా అర్థమయ్యేలా ఉండే సూచనలు చేయాలి. ఆ దిశగా ప్రభుత్వానికి సిఫారసులు ఉండాలి, ఆ సిఫార్సులను తక్షణమే అమలులోకి తీసుకురావాలి.



వీఆర్వోల వ్యవస్థను రద్దు చేశారు. ఒక మారుమూల గ్రామంలో ఉన్న నిరుపేదలకు, ఒక సాధారణ పౌరుడికి తన అవసరాలకు సంబంధించిన సర్టిఫికెట్లు – కులం, ఆదాయం, నివాసం, పుట్టిన లేదా చనిపోయిన ధ్రువీకరణలు, సలహాలు, సూచనలు చేయటానికి ఒక ప్రభుత్వ అధికారి అంటూ ఎవరూ లేరు. ఈ విషయంలో ధరణి సమస్యల కొరకు వేసిన కమిటీ సూచన చేయాలి. ఒక్కసారైనా 2018వ సంవత్సరం పహాణీని గ్రామంలో చదివించాలి. దీనివల్ల పేరు, తండ్రి పేరు, మతం, కులం, భూమి స్వభావం వంటి చాలా సమస్యలకు గ్రామస్తుల సమక్షంలో నిజాలు తెలుస్తాయి. తహశీల్దారు, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, హోదాను కలిగివుండాలి. ఆయనకు అదనంగా ఇచ్చిన జాయింట్ రిజిస్ట్రార్ బాధ్యతలను తొలగించాలి. భూముల రిజిస్ట్రేషన్ పనులను తిరిగి సబ్ రిజిస్ట్రార్‌కి దఖలుపరచాలి. ధరణి స్థానంలో 'భూమాత / భూ భారతి' అని నామకరణం చేయడానికి నిర్ణయం తీసుకున్నారని తెలుస్తున్నది. పేరు ఏదైనా చిన్న రైతు సులభంగా పలికేలా ఉంటే బాగుంటుంది. మరి పాత పుస్తకాన్ని మారుస్తారా అనే విషయం కమిటీ స్పష్టం చేయాలి.

ప్రతి ఇంచ్ భూమిని కొలవాలి. రెవెన్యూ తాలూకు ఫిర్యాదులు, నూటికి అరవై శాతం రైతులు కొలతలతోనే ఇబ్బందులు పడుతున్నారు. 1930 తర్వాత ఒక్కసారి కూడా కొలతలు చేపట్టలేదు. ముఖ్యంగా సరిహద్దు సమస్యలు పట్టాదారుకు–పట్టాదారుకు మధ్య ఉన్న విస్తీర్ణం, గట్టు పంచాయతీలు అటవీ విస్తీర్ణాలు, చెరువులు, శికం, సీలింగ్, పోరంబోకు, ముఖ్యంగా లావణీపట్టాల బౌండరీలు, ప్రతి పట్టాదారుకు తన పొలం చుట్టూ హద్దుబందు రాళ్ళు వేసి, ఫిక్స్ చేయాలనేది ప్రధాన డిమాండ్. 620 మండలాలు, ప్రతి మండలానికి భూములు కొలవడానికి ఒక సర్వేయర్ ఉండేలా చూడాలి. కమిటీ చేస్తున్న సూచనలలో ఇది ఎక్కడా కనిపించడం లేదు. భూమి కొలతల కోసం ఈ సిఫార్సులను చేయమని మరోసారి గుర్తు చేద్దాం.

ప్రతి సంవత్సరం చేతిరాత పహాణి తప్పనిసరిగా ఉండవలసిన అవసరం ఉంది. ఒక గ్రామం పూర్తి భూమి విస్తీర్ణాన్ని స్థిరీకరించి చెప్పగలిగే పారామీటర్ (యార్డ్ స్టిక్)ను కనుమరుగు చేశారు. గతంలో 'జమాబందీ' పేరున ప్రతి ఇంచ్ భూమికి లెక్క ఉండేది. ఇప్పుడు అది తిరిగి ప్రవేశపెట్టమని కమిటీ సూచన చేయాలి. మానవ వనరులు లేకుండా పరిపాలన ఎలా చేస్తారు. ప్రజల సమస్యలు తీరేదెలా, దాదాపు 53 రకాల విధులు నిర్వహించవలసిన రెవెన్యూ సిబ్బంది ఈరోజు లేరు. దీని విషయమై కమిటీ తరఫున ఖచ్చితమైన సూచన ఉండాలి.

గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణికి ఎలాంటి చట్టపరమైన నిబంధనలు లేవు. అందుకు అవసరమైన చట్టబద్ధత కల్పించాలి. ప్రస్తుత సర్వీస్ ప్రొవైడర్‌కు ఎలాంటి బాధ్యత లేదు, వెంటనే ఆ స్థానంలో మన ఎన్ఐసి లేదా ఇన్ఫోసిస్, టాటా, విప్రో వంటి పేరున్న సర్వీస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు అప్పజెప్పాలి. మండల కార్యాలయాల్లో ఉన్న ధరణి ఆపరేటర్లు అవుట్‌సోర్సింగ్ ద్వారా ఉన్నారు. అన్ని ప్రభుత్వ నిబంధనలతో పర్మనెంట్ సిబ్బందిని నియమించాలి.

అరవై శాతం జీవనాధారంగా ఉన్న వ్యవసాయ భూములు వాటి పరిరక్షణ బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉంటుంది. కాబట్టి, అధికారికంగా వేసిన కమిటీ పాత పద్ధతులకు భిన్నంగా, పారదర్శకంగా ప్రతి రైతుకు అందుబాటులో ఉంటూ, సులభంగా అర్థమయ్యేలా ఉండే సూచనలు చేయాలి. ఆ దిశగా ప్రభుత్వానికి సిఫారసులు ఉండాలి, ఆ సిఫార్సులను తక్షణమే అమలులోకి తీసుకురావాలి.

• వి. బాలరాజు
రిటైర్డు తహశీల్దారు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
గురువారం 1 ఆగస్టు 2024


గోదావరి వద్ద దేవాదుల ప్రాజెక్టు ఇన్ టెక్‌వెల్ (ఫైల్)

ఎత్తిపోతలు ఎలా?!

దేవాదుల ప్రాజెక్టును వేధిస్తున్న నిధుల కొరత

- ఈ ఏడాది ఖరీఫ్‌కు ఓరుగల్లు రైతాంగానికి దేవాదుల నీళ్లు కష్టమే..
- ఏటా 60 టీఎంసీల నీటిని 6.21లక్షల ఎకరాలకు అందేలా ప్రణాళిక
- ఇప్పటివరకు అత్యధికంగా 16.41 టీఎంసీల నీరే లిఫ్ట్
- 20 ఏళ్లలో రూ.13,911.88కోట్లు ఖర్చు చేసినా అందని గోదావరి జలాలు
- పాలెం వాగు ప్రాజెక్టు, ఎస్సారెస్పీ-2, మోడీకుంట ప్రాజెక్టుల పరిస్థితీ ఇంతే..
- వానలు అంతంతే.. ప్రాజెక్టుల నీళ్లపైనే రైతుల ఆశలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

దేవాదుల ప్రాజెక్టును నిధులు కొరత వేధిస్తోంది. 20ఏళ్లుగా దేవాదుల ప్రాజెక్టు పనులు పూర్తి కావటం లేదు. ఏటా 60టీఎంసీల నీటిని ఎత్తిపోసి 6.21లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన దేవాదుల ప్రాజెక్టు పనులు అసంపూర్తిగానే మిగిలి పోతున్నాయి. ఇప్పటివరకు ఏ ఏడాది కూడా కనీసం 16.41టీఎంసీలకు పైగా నీటిని ఎత్తిపోయలేదు. పైగా ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.13,911.88కోట్లు ఖర్చు చేయగా, ఇంకా రూ.3,588కోట్లు అవసరంగా ఇంజనీర్లు గుర్తించారు. అయితే మూడో దశ నుంచి నీటిని లిఫ్టు చేసేందుకు రూ.650కోట్ల చాలని ప్రభుత్వం సూచన ప్రాయంగా అంచనా వేసింది. కానీ బడ్జెట్‌లో దేవాదులకు నిధులు కేటాయించకపోవటంతో ఈ ఏడాది ఖరీఫ్‌కు కూడా గోదావరి జలాల ఎత్తిపోతలు లేనట్టేనా..? అనే ఆందోళన రైతుల్లో వ్యక్తం అవుతోంది.

60టీఎంసీలు.. 6.25లక్షల ఎకరాలకు నీళ్లు

ఉమ్మడి వరంగల్‌కు వరప్రదాయనిగా చెప్పుకునే దేవాదుల ప్రాజెక్టు (జె.చొక్కారావు ఎత్తిపోతల పథకం)కు టీడీపీ హయాంలో అప్పటి ఏటూరునాగారం మండలం దేవాదుల, గంగారం గ్రామల వద్ద 2003 జూన్ 16న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాన చేశారు. ఈపీసీ పద్ధతిలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. అయితే 2005లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి, రెండో దశల పనులకు శ్రీకారం చుట్టారు. దేవాదుల ప్రాజెక్టు నుంచి ఏటా 38.182 టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో వరంగల్ మహా నగరంతోపాటు ఇతర ప్రాంతాలకు 2.842టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించారు. మిగిలిన 35.34టీఎంసీలనే 4.75లక్షల ఎకరాల సాగుకు వినియోగించాలని నిర్ణయించారు. అయితే తెలంగాణ ఏర్పడిన తరువాత దేవాదులు ప్రాజెక్టును ప్రభుత్వం పునఃసమీక్షించింది. తుపాకులగూడెం వద్ద రూ.2,121కోట్ల వ్యయంతో సమ్మక్క బ్యారేజీని నిర్మించారు. ఈ బ్యారేజీలో నిల్వ ఉన్న నీటితో 60టీఎంసీలను ఎత్తిపోసేలా డిజైన్ చేశారు. ఏడాదిపాటు గోదావరి జలాలు అందుబాటులో ఉన్న సమయంలో దేవాదుల నుంచి ఎత్తి 6.21లక్షల ఎకరాలకు సాగునీరు, ఎస్సారెస్పీ ద్వారా మరో 7.50లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించే విధంగా గత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే మూడు దశల్లో చేపట్టిన పైపులైన్లు, గ్రావిటీ కెనాళ్లు, రిజర్వాయర్లు, లిఫ్టుల పనులు దాదాపు పూర్తి అయినప్పటికీ పూర్తిస్థాయిలో నీటిని ఎత్తిపోయలేని స్థితి నెలకొంది. మొదటి దశ, రెండో దశ పనులు పూర్తి కాగా, మూడోదశ పనుల్లోనే జాప్యం జరిగింది.

అతిపెద్ద సొరంగాన్ని ములుగు జిల్లా జాకారం నుంచి హనుమకొండ జిల్లా దేవన్నపేట వరకు 49.6కిలోమీటర్లు నిర్మించారు. సొరంగం నుంచి గోదావరి జలాలను తరలించే పనులు పూర్తి చేశారు. దేవన్నపేట రిజర్వాయర్ వద్ద నిర్మించిన అతిపెద్ద సర్జ్‌పూల్‌ను 25మీటర్ల డయాతో 135మీటర్ల లోతున్న వెల్ టైప్‌లో నిర్మించగా, 141 మీటర్ల లోతులో పంపుహౌస్ ఏర్పాటు చేశారు.


దేవాదుల లిఫ్ట్ ద్వారా ధర్మసాగర్ చెరువులోకి పంపింగ్ అవుతున్న గోదావరి జలాలు


నీళ్లున్నా.. ఎత్తి పోసుడేట్లా..?

20 ఏళ్ల కాలంలో దేవాదుల ప్రాజెక్టు నుంచి ఆశించిన స్థాయిలో నీటి ఎత్తిపోతలు లేవు. తొలుత 2009-10లో దేవాదుల నుంచి 0.976 టీఎంసీల నీటినే లిఫ్టు చేయగా, 2010-11లో 1.053 టీఎంసీలు ఎత్తిపోశారు. 2013-14 వరకు కూడా మూడు టీఎంసీల నీటిని ఎప్పుడు ఎత్తిపోసిన సందర్భాలు లేవు. తెలంగాణ ఏర్పడిన తరువాత ప్రభుత్వం పెద్దగా నిధులు కేటాయింపులు చేయకపోవటంతో దేవాదుల ఎత్తిపోతలు నత్తనడకనే సాగాయి. 2014-15లో ఖరీఫ్, యాసంగిలో కలిపి 4.981 టీఎంసీలను లిఫ్టు చేయగా, 2015-16లో 5.6టీఎంసీలు, 2016-17లో 5.53టీఎంసీలే ఎత్తిపోశారు. ఈ పదేళ్ల కాలంలో అత్యధికంగా 2018-19లో మాత్రమే 16.4టీఎంసీలను లిఫ్టు చేయగా, 2023-24లో 14.466టీఎంసీలు, 2019-20లో 13.36టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కూడా ఏ ఏడాది కూడా 20టీఎంసీల నీటిని ఎత్తిపోయలేదు. ప్రస్తుతం మూడో దశ పనులు పూర్తి అయ్యాయి. ఈ దశ నుంచి 50టీఎంసీల నీటిని ఎత్తి పోసుకునేందుకు అవకాశం ఉంది. గోదావరిలో కూడా నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. దేవాదుల నుంచి మూడో దశలో దేవన్నపేట రిజర్వాయర్‌కు నీళ్లు చేరిన తరువాత వాటిని జనగామ జిల్లాలోని స్టేషన్‌ఘనపూర్, జనగామ, పాలకుర్తితోపాటు వర్ధన్నపేట, పరకాల, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో సుమారు 2లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే నిధుల కొరతతో డిస్ట్రిబ్యూటరీ పనులు, దేవాదుల నీటి కోసం తవ్విన కాలువల లైనింగ్ దెబ్బతిన్న పనులు పూర్తి కావటం లేదు. వీటితోపాటు పాలకుర్తి, నష్కల్, చెన్నూరు తదితర రిజర్వాయర్లు ఇంకా పూర్తిస్థాయిలో పనులు కాలేదు. అలాగే నర్మెటట మండలం గండిరామారం (మల్లన్న గండి) జలాశయం నుంచి తరిగొప్పుల మండలం బొత్తలపర్రె గ్రామం వరకు ఒక లిఫ్టు, గుండ్లసాగర్ నుంచి వేలేరు చెరువుకు రెండో లిఫ్టు, నష్కల్

మిగతా 7వ పేజీలో..

2014 నుంచి దేవాదుల నుంచి ఎత్తిపోతలు (టీఎంసీలు) ఇలా..

సంవత్సరం	ఖరీఫ్	యాసంగి	మొత్తం
2014-15	00	4.981	4.981
2015-16	2.4	5.6	8.00
2016-17	2.38	5.53	7.91
2017-18	2.457	4.563	7.02
2018-19	5.578	10.831	16.41
2019-20	4.008	9.352	13.36
2020-21	4.457	5.447	9.904
2021-22	00	9.138	9.138
2022-23	00	9.406	9.406
2023-24	4.778	9.688	14.466
2024-25	00	00	000


గోదావరి వద్ద దేవాదుల ప్రాజెక్టు ఇన్‌టేక్ వెల్

జిల్లా రిజిస్ట్రార్ రవి బదిలీ
- ఉమ్మడి జిల్లాలో 12 మంది సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం
- జిల్లాకు 15 మంది రాక
7

నేటి నుంచి తల్లి పాల వారోత్సవాలు

- జిల్లాలో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు
- నవజాత శిశువు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన
- అంగన్వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీ స్థాయిలో ఇంటింటి సందర్శనలు



హనుమకొండ సిటీ, జూలై 31: మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7 వరకు జిల్లాలో తల్లి పాల వారోత్సవాలు జరుగనున్నా యి. ముర్రుపాల ప్రాముఖ్యత, బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లి పాల అవసరం, 2 ఏళ్ల వరకు శిశువుకు కావాల్సిన పౌష్టికాహారం, తల్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య పరిరక్షణ, నవజాత శిశువుకు తల్లి పాల అందించడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాల వివరింపుతోపాటు పాలు అందించే ప్రత్యామ్నాయ విధానాల వల్ల కలిగే అనర్థాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించడంలో భాగంగా వారోత్సవాల నిర్వహణ జరుగనుంది.

788 అంగన్వాడీ కేంద్రాల్లో..

హనుమకొండ జిల్లాలోని 788 అంగన్వాడీ కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవాలకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాలు బుధవారం జరుగనున్నాయి. 'అంతరాలను తొలగించి తల్లిపాల ప్రాముఖ్యతను చాటుదాం' అనే నినాదంతో వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహించనుంది. వారోత్సవాల ప్రారంభానికి ముందే ప్రభుత్వం జిల్లా కలెక్టర్లు, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో విరివిరిగా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి కార్యక్రమానికి సంబంధించి దిశా, నిర్దేశం చేసింది.

7వ తేదీ వరకు..

తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా వైద్య, ఆరోగ్య శా ఖలు సంయు క్తంగా విస్తృత ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహించను న్నాయి. 1వ తేదీన జిల్లాలోని 788 అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పోస్టర్ల విడు దల, ర్యాలీలు ఇతర ప్రచార కార్యక్రమాల నిర్వహణ ఉంటుంది. ఆగస్టు 2న ఆస్పత్రుల సందర్శన, బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలు అందించాల్సిన ప్రాముఖ్యతను తెలియ చేయడం చేస్తారు. అలాగే నవజాత శిశువులకు పాలు పట్టించడంపై తల్లులు, కుటుంబ సభ్యులకు సలహాలు, సూచనలు చేస్తారు. శిశువుకు పాటు పట్టించే విధానం, రెస్పాన్సివ్ ఫీడింగ్ టెక్నిక్స్, శిశు పాల ప్రత్యమ్నాయాలు, ఫార్ములా ఫీడింగ్‌ను నివారించడంపై అవగాహన కల్పిస్తారు. ఆగస్టు 3న అంగన్వాడీ కేంద్రాల్లో సరైన సమయానికి అనుబంధ ఆహారం అందించే కార్యక్రమ నిర్వహణ ఈ మేరకు అంగన్వాడీలు చేపట్టాల్సిన చర్యలు, శిశువుకు 2 ఏళ్ల వయస్సు వరకు తల్లి పాలు కొనసాగించేలా అవగాహన కల్పిస్తారు. ఆగస్టు 5న ఇంటింటి సందర్శన, తల్లులకు పౌష్టికాహారం అందచేయడం, నిత్య పర్యవేక్షణ తదితర కార్యక్రమాల నిర్వహణ ఉంటుంది. ఆగస్టు 6న పిల్లల బరువుపై తల్లులకు అవగాహన కల్పించడం, తల్లి, శిశువు ఆరోగ్య పరిరక్షణకు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన పెంపొందించడం, శిశువుకు పాలు పట్టించే ముందు చేతులను శుభ్రపరుచుకోవడం తదితర జాగ్రత్తలపై తల్లులకు అవగాహన కల్పిస్తారు. ఆగస్టు 7న మహిళా సంఘాలతో అంగన్వాడీ అధికారులు, సిబ్బంది సమావేశాల నిర్వహణ. పిల్లలు, మహిళా శ్రేయస్సు కోసం చేపట్టే అంశాలపై విస్తృత చర్చ, అవగాహన కార్యక్రమాల నిర్వహణ ఉంటుంది.

వారోత్సవాలను జయప్రదం చేయాలి

- జిల్లా సంక్షేమ అధికారిణి మధురిమ

సుబేదారి: మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను జయప్రదం చేయాలని హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారిణి కె. మధురిమ కోరారు. బుధవారం సుబేదారిలోని అసుంత భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అమృతం కన్నా విలువైనది అమ్మపాలు అని, చంటి బిడ్డకు ఆరోగ్యంతోపాటు పోషణను అందించి ఆరోగ్య సమాజాన్ని నిర్మించే ఉద్దేశంతో ఈ యేడు అంతరాలను తొలగించి తల్లి పాల ప్రాముఖ్యతను చాటుదాం అనే నినాదాంతో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముర్రు పాల ప్రాముఖ్యత, బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరునెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. ఆరు నెలల నుంచి రెండేళ్లవరకు బిడ్డకు అందించే అదనపు ఆహారంపై అవగాహన కల్పించేందు కోసం కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.


శ్మశాన వాటిక పనులను పరిశీలిస్తున్న కమిషనర్

సమీకృత మార్కెట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జూలై 31: సమీకృత మార్కెట్ (ఐవీఎన్ఎం) నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిష నర్ అశ్విని తానాజీ వాకడే ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. బుధవారం వరంగల్ లక్ష్మీపురం మార్కెట్ ఆవరణలో నిర్మితమ వుతున్న సమీకృత ఇంటిగ్రేటెడ్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులను సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మార్కెట్ నిర్మాణ పనులు నిర్ధేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం వరంగల్ బస్‌స్టాండ్ పనులతో పాటు తిలక్‌నగర్ పోతనరోడ్డు ప్రాంతంలో నిర్మితమవుతున్న స్మశానవాటిక పనులను కమిషనర్ పరిశీలించారు. ఈఈ శ్రీనివాస్, డీఈ రంగారావు, ఏఈలు శ్రీకాంత్, సతీష్, హబీబ్‌లు పాల్గొన్నారు.

పరకాలకు త్వరలో వంద పడకల ఆస్పత్రి

- కలెక్టర్ పి.ప్రావీణ్య
- అధికారులతో కలిసి నిర్మాణ పనుల పరిశీలన


ఆస్పత్రి భవన నిర్మాణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

పరకాల, జూలై 31: పరకాల మునిసిపల్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి భవనాన్ని నాలుగైదు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొ స్తామని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం పరకాల పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ.. ఆస్పత్రి భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. గ్రౌండ్‌ఫ్లోర్ ఒక్కటే కాకుండా భవనం మొత్తం ఒకే సారి పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. ఆస్పత్రి భవన నిర్మాణ పనులను రూ.35కోట్లతో చేపడుతున్నట్లు తెలిపారు.

అదే విధంగా ఎంపీడీవో కార్యాలయం, మునిసిపల్ కార్యాలయాల్లో కొనసాగుతున్న ప్రజాపాలన సేవా కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని, ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నెంబర్ లింక్ వంటివి చేసుకోకుండా ఉన్న వారు వెంటనే చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఉన్న అధికారులతో మాట్లాడుతూ.. ఎవరైనా దరఖాస్తుదారులు వస్తే వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా గృహజ్యోతి పథకం దరఖాస్తు సరిచేయాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా పరకాల ప్రాథ మిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సింగిల్‌విండో)లో రైతులకు జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నారాయణ, మునిసిపల్ కమిషనర్ నర్సింహా, తహసీల్దార్ ఎవి. భాస్కర్, ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, ఏసీపీ కిశోర్ కుమార్, సీఐ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


వనమహోత్సవంలో భాగంగా మొక్క నాటుతున్న కలెక్టర్

నడికూడ: నడికూడ మండల కేంద్రంలో, కంఠాత్మకూర్ గ్రామంలో కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం పర్యటించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం 'పర్యావరణ పరిరక్షణ - విద్యార్థుల పాత్ర' అనే అంశం పై వ్యాసరచన పోటీలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే, ఇందిరా క్రాంతి పథకం ద్వారా లబ్ధిపొందిన వారితో మాట్లాడి ప్రభుత్వం అందించిన ఆర్థికసాయం ఎందుకోసం ఉపయోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మొక్కలను నాటి వదిలేయకుండా, అవి ఎదిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ హేమనాయక్, డీటీ సత్యనారాయణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీఎం రమాదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పేద ప్రజలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పేదలకు ఇళ్ల స్థలాలపై సీఎం ప్రకటన చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- కలెక్టరేట్ ఎదుట సీపీఐ నాయకుల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, జూలై 31: పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. అర్హులైన పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు, డబుల్‌బెడ్ రూమ్‌లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల నిర్మాణం కోసం ఏళ్ల తరబడి పేద ప్రజలు పోరాటం చేస్తూనే ఉన్నారని, అయినప్పటికీ న్యాయం జరగడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలను ఎన్నికల సమయంలో మాత్రమే పట్టించుకుని ఎన్నికలు అయిపోయాక పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేయాలన్నారు.

అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డికి సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, నాయకులు వేల్పుల సారంగపాణి, అశోక్ స్టాలిన్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, కొట్టెపాక రవి, భాషబోయిన సంతోష్‌పాటు సీపీఐ జిల్లా నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


వెహికిల్ షెడ్డులో అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వాహనాల మరమ్మతు త్వరగా చేయాలి

- మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 31: బల్దియా వాహనాల మరమ్మతులు ఆలస్యం జరుగుతున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, రిపేరుకు వచ్చిన వాహనాలను త్వరితగతిన మరమ్మతు చేసి పంపించాలని మేయర్ గుండు సుధారాణి సిబ్బందికి సూచించారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని వెహికిల్ రిపేరు షెడ్డును అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నపాటి రిపేరు కూడా నెలల తరబడి ఎందుకు నిలిచిపోతోందని సిబ్బందిని ప్రశ్నించి మండిపడ్డారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బల్దియా పరిధిలో పని చేసే వాహనాల మరమ్మతుల్లో జాప్యం చేయకుండా సకాలంలో అందిస్తే పనులు సైతం వేగంగా జరుగుతాయన్నారు. మేయర్ వెంట ఇన్‌చార్జి ఎస్ఈ రాజయ్య, ఈఈ సంజయ్, డీఈ సంతోష్‌బాబు, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శాంరాజు, అనిల్‌కుమార్‌లతో పాటు పీఆర్‌వో అయూబ్‌ఖాన్ ఉన్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి..

- హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల రిలే నిరాహార దీక్షలు ప్రారంభం
- పాల్గొన్న అంబేద్కర్‌నగర్, జితేంద్రనగర్ వాసులు

హనుమకొండ టౌన్, జూలై 31: సర్వే నెంబర్ 1066లో గుడిసెవాసులకు కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చూస్తూ లబ్ధిదారులైన అంబేద్కర్‌నగర్, జితేంద్రనగర్ వాసులు బుధవా రం హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఐదు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు బుధవారం దీక్షను ఎస్సీఆర్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు సినపెల్లి కొంరయ్య, కార్యదర్శి మనోహర్, పరంజ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సాధన కమిటీ అధ్యక్షుడు ఎర్ర చంద్రమౌళి మాట్లాడుతూ.. 50 ఏళ్ల కిందట ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నిరుపేదలు బతుకుదెరువు కోసం హనుమకొండకు వచ్చి బాలసముద్రంలో అంబేద్కర్‌నగర్, జితేంద్రనగర్ కాలనీల పేరుతో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారన్నారు. 2012లో కేంద్రప్రభుత్వం రాజీవ్‌ఆవాస్ యోజన పథకం తీసుకొచ్చి వరంగల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సర్వే చేసి లబ్ధిదారుల జాబితాను తయారు చేశారన్నారు. పథకాన్ని అమలుచేసే సమయంలో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతుండగా, అప్పటి టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ వస్తే పేదలకు ఉచితంగా డబుల్ రూమ్ ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. 2015లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అప్పటి కలెక్టర్ రెండు ప్రాంతా లను ఖాళీ చేసి ప్రభుత్వానికి అప్పగించారన్నారు. 2018లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసినప్పటికీ ఇప్పటికీ పేదలకు ఇళ్లు అప్పగించలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 8 నెలలైనా ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఇళ్లు కేటాయించేం తవరకు వివిధ రూపాల్లో ఉద్యమిస్తామన్నారు. ఈ దీక్షలో కొయ్యడ కృష్ణ, ఒరుగంటి స్వామి, సొరం రఘు, దరిగి రాజేశ్, ఎర్ర రూప, బొచ్చు సరోజన, శిల్ప, చిలుక శోభ, మామిడిపెల్లి సుధాకర్, గడ్డపాటి సాయి కుమార్, హుస్సేన్‌బీ, రజినీ, లవకుమార్, నర్సింగం, పొన్నాల సునిత, వంగాల సాయికృష్ణ పాల్గొన్నారు.

రేపే బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70ఎంఎం - నారాయణగూడ 11.00,6.00

రేపే బ్రహ్మాండమైన విడుదల



మహాలక్ష్మి 70ఎంఎం - కొత్తపేట 2.30,9.45
ఏషియన్ సినిమార్ట్ - ఆర్.సి.పురం 1.35,7.35
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 4.50,7.45
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 11.00,10.45
జె.పి.సినిమాస్ - చందానగర్ 4.55,10.35
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల 12.10pm
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన పోలీసులతో సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూలై 31: పోలీసుశాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన వారిని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సత్కరించారు. బుధవారం హనుమకొండలోని కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన అదనపు డీసీపీ రాగ్యానాయక్, ఇన్స్‌పెక్టర్ దామోదర్, ఎస్సైలు గాలిబ్ షరీఫ్, కుమారస్వామి, ఏఎస్‌ఐలు సుధాకర్, మక్బూల్, మోహినొద్దిన్, ప్రేమ్‌సాగర్, ముసలయ్య, జైపాల్‌రావు, వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ అంజయ్యలను కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు శ్రీనివాస్, స్పర్జన్‌రాజ్, సతీష్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌కుమార్ పాల్గొన్నారు.

రేపే బ్రహ్మాండమైన విడుదల




SKML MOTION PICTURES THRO GANESH BHARI 9299992173, 9296509333

రేపే బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00am
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
మహాలక్ష్మి 70 - కొత్తపేట 11.15,6.15
ప్రశాంత్ 70 - సికింద్రాబాద్ 11.00am
SUCHIN CINEMAS THRO NTR CINEMAS 9030161717

SUPER HIT నేడే చూడండి




సుదర్శన్ 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.15
తారకరామ 70ఎంఎం - కాచిగూడ 11.15,6.00
GLOBAL CINEMAS RELEASE

నేడే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

రేపే బ్రహ్మాండమైన విడుదల



PVR INOX PICTURES RELEASE: 9963883444

రేపే బ్రహ్మాండమైన విడుదల



సప్తగిరి 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ | శ్రీకృష్ణ 70ఎంఎం ఎ/సి - ఉప్పల్ | అలంకార్ (ప్రతాప్) - లింగోజిగూడ | సూపర్ 70 ఎ/సి - బాలాపూర్
మల్లికార్జున 70 - కూకట్‌పల్లి | వైజయంతి 70 ఎ/సి - నాచారం | BR హైటెక్ - మాదాపూర్ | శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట
భుజంగ 70ఎంఎం - జీడిమెట్ల | సాయిరంగ 70 - మియాపూర్ | విజేత 70 ఎ/సి - బోరబండ | లక్ష్మి 70 ఎంఎం - శంషాబాద్
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

రేపే బ్రహ్మాండమైన విడుదల



దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
లక్ష్మీకళ సినీప్లెక్స్ ఎ/సి - మూసాపేట్ 11.30,2.30
SURAKSHA ENTERTAINMENT MEDIA

మల్టీప్లెక్స్: 150/-, సింగల్ స్క్రీన్: 110/- 80/- 50/-



సప్తగిరి 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ | లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట | అంజలి 70 ఎ/సి - సికింద్రాబాద్ | తాళ్ళూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

వరంగల్ అదనపు డీఎంహెచ్ఓగా డాక్టర్ సాంబశివరావు


▸ హనుమకొండకు అప్పయ్య వచ్చే అవకాశాలు

వరంగల్ మెడికల్, జూలై 31: వరంగల్ జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ప్రస్తుతం వర్క్ఆర్డర్‌పై హనుమకొండ డీఎంహెచ్ఓగా కొనసాగుతున్న డాక్టర్ బి.సాంబశివరావు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో కొనసాగిన డాక్టర్ జాటోత్ సుధార్‌సింగ్ హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్టీ నెంబర్ 415 విడుదల చేసింది. అదే విధంగా ఎంజీఎం ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బి.హరీష్‌రాజ్ మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బదిలీ అయ్యారు.

అప్పయ్య..

హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ అప్పయ్య గతంలో పదోన్నతి పొందారు. అయినప్పటికీ వర్క్ ఆర్డర్‌పై ములుగు జిల్లా డీఎంహెచ్‌గానే కొనసాగుతున్నారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా డీఎంహెచ్‌వోగా కొనసాగుతున్న డాక్టర్ బి.సాంబశివరావు వర్క్ ఆర్డర్‌పై ఇంతకాలం హనుమకొండ డీఎంహెచ్‌వోగా కొనసాగారు. అయితే డాక్టర్ సాంబశివరావు వరంగల్ వైద్య, ఆరోగ్యశాఖకు మారడంతో డాక్టర్ అప్పయ్య హనుమకొండకు వచ్చే అవకాశాలున్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. అయితే డాక్టర్ అప్పయ్య హనుమకొండకు వచ్చేందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది. అదే విధంగా వరంగల్ డీఎంహెచ్ఓగా కొనసాగుతున్న డాక్టర్ కె.వెంకటరమణ కరీంనగర్‌లో విధులు నిర్వర్తించాల్సి ఉన్నప్పటికీ వర్క్ ఆర్డర్‌పై వరంగల్‌లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం సాధారణ బదిలీలతో అసలు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఎవరనే అయోమయం వైద్య వర్గాల్లో కొనసాగుతోంది. ఎంజీఎం ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్ఎంవో పోస్టు ప్రస్తుతం ఖాళీగా ఉంది.





భారీగా రిజిస్ట్రార్ల బదిలీలు

▸ ఉమ్మడి జిల్లాలోని 12 మంది సబ్ రిజిస్ట్రార్ల స్థాన చలనం

▸ జిల్లాకు 15 మంది రిజిస్ట్రార్ల రాక

▸ జిల్లా రిజిస్ట్రార్ రవి హైదరాబాద్‌కు బదిలీ



రాంనగర్, జూలై 31: వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. శాఖ డీఐజీ సుభాషిణికి జిల్లా రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జిల్లాల రిజిస్ట్రార్‌లతో పాటు సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు 12మంది సబ్ రిజిస్ట్రార్‌లు పొరుగు జిల్లాలకు బదిలీ అయ్యారు. వరంగల్ జిల్లాకు ఒక జిల్లా రిజిస్ట్రార్ స్థాయి అధికారితో పాటు 14 మంది సబ్ రిజిస్ట్రార్‌లు బదిలీపై వస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి జిల్లా రిజిస్ట్రార్ స్థాయి అధికారి ఫణిందర్ బదిలీపై వరంగల్‌కు వస్తున్నప్పటికీ ఆయనను ఆడిట్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా రిజిస్ట్రార్ రవి హైదరాబాద్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎవరినీ కేటాయించలేదు. డీఐజీ సుభాషిణికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

వరంగల్ నుంచి బదిలీ అయిన సబ్ రిజిస్ట్రార్‌లు

పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రదేశం
డి.సుజాత	వరంగల్ (డీఐజీ కార్యాలయం)	జగిత్యాల
టి.సంపత్‌కుమార్	జనగామ	ఖమ్మం
ఆర్.రాజు	వరంగల్ జిల్లా కార్యాలయం	మధిర
కె.మోసెస్ భాస్కర్	ఆడిట్ వరంగల్	సత్తుపల్లి
వి.వేణుమాధవ్	ఏఆర్‌సీ వరంగల్	కొత్తగూడెం
ఎ.కార్తీక్	ఖిలా వరంగల్	ఖమ్మం
టి.భాగ్యలక్ష్మీ	భీమదేవరపల్లి	ఖమ్మం (ఆడిట్)
ఎస్.రాంకిషోర్	నర్సంపేట	ఖమ్మం
మసియొద్దిన్	వరంగల్ రూరల్	కొల్లూరు
జి.అరుణ	వర్ధన్నపేట	ఖమ్మం రూరల్
ఎ.క్రిష్ణయ్య	చేర్యాల	కామారెడ్డి
అమ్జద్	వరంగల్	స్టేషన్‌ఘన్‌పూర్

వరంగల్‌కు వస్తున్న సబ్ రిజిస్ట్రార్‌లు

పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రదేశం
ఎ.రవీంద్రబాబు	ఖమ్మం	మహబూబాబాద్
జె.రాంనర్సింహరావు	కుసుమంచి (ఖమ్మం)	వరంగల్ జిల్లా కార్యాలయం
జె.కిషన్‌నాయక్	జగిత్యాల	భీమదేవరపల్లి
ఎ.తిరమల్‌రావు	ఐజీ కార్యాలయం	ఆడిట్ వరంగల్
ఆర్.రాము	మంచిర్యాల	భూపాలపల్లి
ఎం.దిలీప్‌చంద్ర గోపాల్	ఐజీ కార్యాలయం	ములుగు
జి.రాంకుమార్	కొత్తగూడెం	వరంగల్ (డీఐజీ కార్యాలయం)
బి.సైదులు	ఇల్లందు	వరంగల్ రూరల్
డి.సుజన్‌కుమార్	ఖమ్మం	పరకాల
పి.యామిని	ఖమ్మం	ఏఆర్‌సీ వరంగల్
ఎ.గిరిధర్	మధిర	నర్సంపేట
జి.నరేంద్ర	ఖమ్మం	ఖిలా వరంగల్
డి.ఆనంద్	కొల్లూరు	వరంగల్ జిల్లా కార్యాలయం
వి.ప్రభాకర్‌రావు	సత్తుపల్లి	వర్ధన్నపేట

మార్కెటింగ్ శాఖలో...

వరంగల్ వ్యవసాయం, జూలై 31: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా మార్కెటింగ్ శాఖలో ఇద్దరు డీఎంవోలకు, ఇద్దరు అకౌంటెంట్లకు, 10మంది గ్రేడ్-2 కార్యదర్శులకు స్థాన చనలం కలిగింది. ఈ మేరకు బుధవారం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల వివరాలిలా ఉన్నాయి.

ఇద్దరు డీఎంవోలు

మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న అనురాధను వరంగల్ డీఎంవో(డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ ఆఫీసర్)గా బదిలీ చేశారు. అలాగే నల్గొండ డీఎంవోగా పనిచేస్తున్న ఎంఏ అలీంను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎంవోగా బదిలీ చేశారు.

ఇద్దరు అకౌంటెంట్లు

ఇద్దరు అకౌంటెంట్లకు స్థాన చలనం కలిగింది. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న జి.సుకన్యను వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదిలీ అయ్యారు. అదేవిధంగా వరంగల్ మార్కెట్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న రాజ్‌కుమార్‌ను గడ్డి అన్నారం మార్కెట్ కమిటీకి బదిలీ చేశారు.

10 మంది గ్రేడ్-2 కార్యదర్శులు..

ఖమ్మం మార్కెట్ గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న బి.బజరును ఎక్‌నూర్ మార్కెట్‌కు, గడ్డిఅన్నారం మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న సి.వెంకటలక్ష్మిని వలిగొండ మార్కెట్‌కు బదిలీ చేశారు. పరిగి మార్కెట్ కమిటీలో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న ఆర్.సుదర్శన్‌రావును భువనగిరి మార్కెట్‌కు, భువనగిరి మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న డి.అజిత్ రావును వరంగల్ మార్కెట్‌కు, హుజూర్‌నగర్ మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న డి.ప్రభాకర్‌ను హుస్నాబాద్ మార్కెట్‌కు, నిజామాబాద్ మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పని చేస్తున్న విజయ్‌కిషోర్‌ను పరిగి మార్కెట్‌కు, ఏక్‌నూర్ మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న ఎన్.శ్రీనివాస్‌రావును నూగూరు(చర్ల) మార్కెట్‌కు, వలిగొండ మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న ఎండి.వహీద్‌ను గడ్డిఅన్నారం మార్కెట్‌కు, హుస్నాబాద్ మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న వి.స్వజన్‌బాబును ఖమ్మం మార్కెట్‌కు, నూగూరు(చర్ల) మార్కెట్‌లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న ఎంఏ గనీని హుజూర్‌నగర్ మార్కెట్‌కు బదిలీ చేశారు.

బల్దియాలో బదిలీల పర్వం

▸ 4 ఏఈలు 26 మంది పీహెచ్ వర్కర్లకు స్థానచలనం

వరంగల్ కార్పొరేషన్, జూలై 31: గ్రేటర్ వరంగల్ పరిధిలో సాధారణ బదిలీలలో భాగంగా 4 గురు ఏఈలను 26 మంది పీహెచ్ (పబ్లిక్ హెల్త్) వర్కర్లను బదిలీ చేస్తూ బుధవారం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉత్తర్వులు జారీ చేశారు. ఏఈలలో అరవింద, రమ్యకృష్ణ, రోజారాణి, రాజేశ్వరీలను వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. అదే విధంగా 4వ తరగతి ఉద్యోగుల విభాగంలో 3 శానిటరీ జవాన్లు, 6 అటెండర్లు, 1 లైన్‌మెన్, 1 వాచ్‌మెన్, 2 పంప్‌ఆపరేటర్లు, 13 మంది పబ్లిక్ హెల్త్ (పీహెచ్) వర్కర్లులకు పరకాల మున్సిపాలిటీకి స్థానచలనం కలిగించారు. వీరిస్థానంలో ఇంకా ఎవరినీ భర్తీ చేయలేదు. అదే విధంగా ఇటీవల బల్దియా నుంచి బదిలీపై వెళుతున్న సీపీ వెంకన్న, అకౌంట్స్ అధికారి వెంకటేశ్వర్లు, ఈఈ బీఎల్ శ్రీనివాస్, డీఈలు సంజయ్, ఇర్షద్ జహాన్‌లకు బదిలీ ఆర్డర్లు అందించారు. బుధవారం బదిలీ ఐన సిబ్బంది ఒకటి, రెండు రోజుల్లో రిలీవ్ ఆర్డర్లను తీసుకుని బదిలీ స్థానాల్లో రిపోర్టు చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

ఎంజీఎం హెడ్ నర్సులు..

వరంగల్ మెడికల్, జూలై 31: ఎంజీఎం ఆస్పత్రిలో పని చేస్తున్న హెడ్ నర్సులు బదిలీపై ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. హెడ్ నర్సులు మల్టీజోన్ కావడంతో ఎక్కువ మంది ఆదిలాబాద్ రిమ్స్‌కు బదిలీ అయ్యారు. బుధవారం సాయంత్రం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఆదిలాబాద్ నుంచి హెడ్ నర్సులు ఎంజీఎంకు బదిలీపై వచ్చారు. ఇప్పటికే ఎంజీఎంలో ప్రొఫెసర్ల నుంచి మొదలుకొని స్టాఫ్‌నర్సుల వరకు భారీ సంఖ్యలో బదిలీలు జరిగాయి. కాగా, ఆగస్టు ఒకటి నుంచి బదిలీలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబరు 87ను బుధవారం విడుదల చేసింది.

తహసీల్దార్లకు స్థానచలనం

హనుమకొండ కలెక్టరేట్, జూలై31: హనుమకొండ జిల్లాలో పని చేస్తున్న పలువురు తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లాలో పని చేస్తున్న గౌరీశంకర్ బదిలీపై హనుమకొండ కలెక్టర్‌లో తహసీల్దార్‌గా నియామకం అయ్యారు. కలెక్టరేట్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తున్న సురేష్ కమలాపూర్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. హనుమకొండ జిల్లాలో పనిచేస్తున్న ఐదుగురు డిప్యూటీ తహసీల్దార్‌లను, ముగ్గురు సీనియర్ అసిస్టెంట్‌లను పాలనాదృష్ట్యా బదిలీ చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుల బదిలీ

▸ ఉమ్మడి వరంగల్‌లో దాదాపు 200 స్థాన చలనం

కేయూ క్యాంపస్, జూలై 31: ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా దాదాపు 200 డిగ్రీ కళాశాల అధ్యాపకుల బదిలీ జరిగాయి. ప్రస్తుతం పనిచేస్తున్న కళాశాలల నుంచి బదిలీ పొందిన అధ్యాపకులందరూ బుధవారం రిలీవ్ ఆర్డర్లు పొందారు. అత్యధికంగా హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 51 మంది, పింగళి మహిళ డిగ్రీకళాశాల నుంచి 27 మంది, నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 27 మంది, రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబాబాద్, వర్ధన్నపేట, తొర్రూరు, మర్రిపెడ బంగ్లా, ఏటూరునాగారం, ములుగు, పరకాల, జనగామ, ములుగు ప్రభుత్వ డిగ్రీకళాశాల నుంచి దాదాపు 200 మంది అధ్యాపకులు బదిలీ అయ్యారు. హనుమకొండ నుంచి ఎక్కువ మంది అధ్యాపకులు జమ్మికుంట, సిద్ధి పేట, గజ్వేల్, గోదావరిఖని, తొర్రూరు, మహబూబాబాద్, వర్ధన్నపేట కళాశాలకు బదిలీపై వెళ్లారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని చాలామంది అధ్యాపకులు పింగళి, కేడీసీ, రంగశాయిపేట, నర్సంపేట, పరకాల, ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీపై వచ్చారు. వీరంతా గురువారం కొత్తగా పోస్టింగ్ పొందిన కళాశాలల్లో జాయిన్ కానున్నారు. బదిలీలు పొందిన వారిలో మహబూబాబాద్, మర్రిపెడ బంగ్లా, జనగామ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు కూడా ఉన్నట్లు సమాచారం. ఇటీవల కాంట్రాక్టు అధ్యాపకులుగా ఉండి రెగ్యులరైన అధ్యాపకులకు బదిలీల్లో అవకాశం కల్పించలేదు.

ఆర్టీసీ కండక్టర్‌పై ప్రయాణికురాలి దాడి

▸ బానెట్‌పై కూర్చోవద్దన్నందుకు ఆగ్రహం

▸ ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



కండక్టర్ కమలాకర్‌రెడ్డిపై దాడి చేస్తున్న మహిళ, ఆమె కుమారుడు



బస్సు కండక్టర్ కమలాకర్

ములుగు, జూలై 31: బానెట్‌పై కూర్చోవద్దన్నందుకు ఆగ్రహించిన ఓ మహిళ తన కుమారుడితో కలిసి ఆర్టీసీ కండక్టర్‌పై దాడిచేసింది. ములుగు జిల్లా మల్లంపల్లి వద్ద బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. కండక్టర్ సి.హెచ్.కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్-2 డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు (టీజీ03టీ 0459) హైదరాబాద్ నుంచి ఏటూరునాగారం వెళ్తున్న క్రమంలో హనుమకొండ జిల్లా ఆత్మకూరులో ఓ మహిళ ఎక్కింది. బస్సులో సుమారు 70మంది ప్రయాణికులు ఉండగా, సీట్లు లేకపోవడంతో డ్రైవర్ పక్కన ఉన్న బానెట్‌పై కూర్చుంది. అక్కడ కూర్చోవడం ప్రమాదకరమని, బస్సులోపలికి వెళ్లాలని డ్రైవర్ కా ర్తీక్, కండక్టర్ సీహెచ్.కమలాకర్ సదరు మహిళకు సూచించారు. దీంతో ఆగ్రహానికి గురైన ఆమె కండక్టర్‌ను దుర్భాషలాడింది. దీంతో బస్సును నిలిపిన డ్రైవర్, కండక్టర్ ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఆ మహిళను అక్కడే దించి బయల్దేరారు. అయితే తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై బస్సును వెంబడించి ములుగు మండలం మల్లంపల్లి వద్ద ఆపారు. ఆ మహిళ కండక్టర్‌పై చెప్పులేపగా వెంట వచ్చిన ఆమె కుమారుడు చేయి చేసుకున్నాడు. ఈ దాడి దృశ్యాలను డ్రైవర్ తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేశారు. అనంతరం ములుగుకు వచ్చి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్టీసీ కండక్టర్‌పై దాడిచేసిన ఘటనలో ప్రయాణికురాలు సుక్క లలిత, ఆమె కుమారుడు దినేష్‌పై ములుగు పోలీసులు కేసు నమోదు చేశారు. కండక్టర్ కమలాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై-2 రామకృష్ణ తెలిపారు. కండక్టర్‌పై దాడిచేసిన మహిళ స్వగ్రామం ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురమని తెలుస్తోంది.


ఎత్తిపోతలు ఎలా?!

5వ పేజీ తరువాయి

నుంచి వంగాలపల్లి, మల్లక్కపల్లి, ధర్మారం వరకు మూడో లిఫ్టు పనులు పూర్తి చేయాల్సి ఉంది. వీటితో ఇంకా 3వేల ఎకరాలకు పైగా భూసేకరణ చేయాల్సి ఉంది. పైవీటన్నింటికీ మరో రూ.3,588కోట్ల నిధులు అవసరంగా అధికారులు గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటంతో ఈ ఏడాది కూడా పూర్తిస్థాయిలో దేవాదుల ఎత్తిపోతలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

బడ్జెట్‌లో ప్రాధాన్యత ఏదీ?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కీలకమైన ప్రాజెక్టుల్లో దేవాదుల మొదటిది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 5లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. అయితే 20ఏళ్లుగా ఏ ప్రభుత్వం కూడా ఆశించిన స్థాయిలో నిధులు కేటాయింపులు ఉండటం లేదు. దీంతో దేవాదుల ప్రాజెక్టు అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే రూ.13,911.88కోట్ల నిధులను ఖర్చు చేయగా, 2023లో ప్రాజెక్టు అంచనా బడ్జెట్‌ను రూ.17వేల కోట్లకు పెంచారు. కాగా, ఇంజనీర్లు పంపించిన నివేదికపై ఇటీవల భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో సమీక్ష నిర్వహించారు. నగర ప్రాంతంలో భూసేకరణతో పాటు మరికొన్ని పనులను మినహాయించి రూ.625కోట్లతో దేవాదుల మూడోదశ నీటిని ఎత్తిపోసేలా ప్రణాళిక రూపొందించారు. రూ.1,000కోట్ల లోపు బడ్జెట్‌తో పూర్తి అయ్యే ప్రాజెక్టులను గుర్తించి 2025 మార్చిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని భావించినప్పటికీ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులే లేకపోవటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. కేవలం రూ.78.04కోట్లు దేవాదుల ప్రాజెక్టు నిర్వహణ, ఇతర ఖర్చుల కోసం కేటాయింపులు చేసింది. అలాగే సమ్మక్క బ్యారేజీ కోసం రూ.30.05కోట్లు మంజూరు చేసింది. దీంతో దేవాదుల పనులకు ఈ ఏడాది కూడా నిధుల కొరత తప్పదనే చర్చ జరుగుతోంది. ఫలితంగా మూడో దశ దేవాదుల పనులు పూర్తి అయినప్పటికీ 6లక్షల ఎకరాలకు సాగునీరు అందించటం సాధ్యం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఒక్క ప్రాజెక్టుకు కూడా ప్రాధాన్యత ఇవ్వకపోవటంపై ఓరుగల్లు నేతల తీరుపై రైతుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. పొరుగున ఉన్న ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు భారీగా ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు జరిగితే, ఉమ్మడి వరంగల్‌కు మాత్రం సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కొరత ఉండటంపై ఆందోళన వ్యక్తం అవుతోంది.





ఆధునిక సాగు పద్ధతులతో రైతులకు మేలు

వరంగల్ చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి • మార్కెట్‌లో వ్యవసాయ పరికరాల ప్రదర్శన



సబ్సిడీపై పవర్ టిల్లర్ కొనుగోలు చేసిన రైతుకు బిల్లు అందిస్తున్న రవిందర్‌రెడ్డి, నిర్మల

వరంగల్ వ్యవసాయం, జూలై 31: వ్యవసాయ రంగంలో మ్యాన్ పవర్ తగ్గిన నేపథ్యంలో ఆధునిక సాగు పద్ధతుల ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశాలున్నాయని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని మన అగ్రిటెక్‌లో లబ్ధి అర్జున్ సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాల ప్రదర్శన, రైతులకు సబ్సిడీపై విక్రయించగా, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా బొమ్మినేని రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. రవీందర్‌రెడ్డి, నిర్మలకు మన అగ్రిటెక్ సంస్థ నిర్వాహకుడు రమేష్ వ్యవసాయ సాగు విధానంలో ఆధునిక పరికరాల గురించి వివరించగా వాటిని పరిశీలించి రైతులకు మంచిగా పనికి వస్తాయని సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి, నిర్మల మాట్లాడుతూ.. వ్యవసాయం పట్ల ఆసక్తి తగ్గుతున్న యువతతో సాగు చేయించేందుకు కంపెనీలు ఆధునిక పరికరాలను రూపొందిస్తున్నాయన్నారు. పది మంది చేయాల్సిన పనిని ఒక యంత్రం గంటలో చేసే విధంగా రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏనుమాముల సీఐ పులి రమేష్, గ్రేడ్-2 కార్యదర్శి రామోజు రాము, మార్కెట్ అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బంజారా బాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలి

▸ సంత్ సేవాలాల్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పె ఏర్పాటు చేయాలి

▸ మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ డిమాండ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సీతారాం నాయక్

హనుమకొండ, జులై 31, (ఆంధ్రజ్యోతి): బంజారా లంబాడీల భాషను రాజ్యంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రశాంత్ నగర్‌లోని తన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో 12కోట్ల మంది బంజారాలు మాట్లాడే భాషకు తగిన గుర్తింపు లేదని విచారం వ్యక్తం చేశారు. భాషకు లిపి లేకబంజారాలు చరిత్రలో వెనుబడి పోయారని, వారి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు గ్రంథస్థం కాలేక క్రమంగా కనుమరగయ్యే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. బంజారాల భాషకు లిపి లేకపోవడం వల్లనే బంజారాల విశిష్టత ప్రపంచానికి తెలియకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. మిగతా ప్రజల్లాగా కాకుండా బంజారాలు ఎక్కడ ఉన్నా ఒకే భాషను ఒకే రీతిన మాట్లాడుతారన్నారు. తక్కువ జనాభా వున్న ఇతర ప్రజల భాషకు తగిన గుర్తింపు ఉండీ.. బంజారా భాషకు లేకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా బంజారాల భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా తగిన గుర్తింపు ఇవ్వాలని ఆయన కోరారు. బంజార లంబాడీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన తీజ్ పండుగ ప్రాముఖ్యత కోల్పోయే పరిస్థితి ఉందని ప్రొఫెసర్ సీతారాం విచారం వ్యక్తం చేశారు. ఆర్థికభారం, అవగాహనలోపంతో తీజ్ పండుగ జరుపుకోలేని తండాలు ఎన్నో ఉన్నాయన్నారు. బంజారాల పెద్దదైన తీజ్ పండుగను కాంగ్రెస్ ప్రభుత్వమైనా గుర్తించి, తగిన ప్రాధాన్యత ఇచ్చి కాపాడాలని కోరారు.

తీజ్‌ను ట్యాంక్ బండ్‌లో నిమజ్జనానికి ప్రభుత్వం అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బంజరాల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని గత ప్రభుత్వంలో తాను మాట్లాడినందుకు రాజకీయంగా తనను భ్రష్టుపట్టించారని, గిరిజన హక్కుల గురించి ప్రశ్నించినందుకు తొక్కిపెట్టారన్నారు. బంజారాల ఆరాధ్యదైవమైన సంత్‌సేవాలాల్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అంతేకాకుండా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను దేశవ్యాప్తంగా నిర్వహించాలన్నారు. తీజ్ నిమజ్జనం, భాషను 8వ షెడ్యూల్‌లో ఉంచడం, సంత్‌సేవాల్ విగ్రహం ట్యాంక్ బండ్‌పై పెట్టడపై అసెంబ్లీలో ఏకవ్యాక్య తీర్మానం చేయాలని సీతారాం నాయక్ డిమాండ్ చేశారు.

మాతా శిశు ఆరోగ్యం దృష్టి పెట్టాలి



పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, జూలై 31: మాతా, శిశు ఆరోగ్యం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ అధ్యక్షుడు శారు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో పౌష్టిక ఆహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార కిట్లు, పండ్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అత్యంత బలహీనవర్గాలకు అండగా నిలిచేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కాకులమర్రి ప్రవీణ్ కుమార్, కోశాధికారి అంచూరి విజయ్ కుమార్, వంగ రాజిరెడ్డి, బేతి రవీందర్‌రెడ్డి, గంగోజుల నరేశ్, రొండ్ల నరేందర్‌రెడ్డి, ద్రాక్షపల్లి రమేశ్, చిదర రాజశేఖర్, మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై ఘనంగా పవిత్రోత్సవాలు



మెట్టుగుట్టపై సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, భక్తులు

మడికొండ, జూలై 31: మడికొండలోని మెట్టుగుట్టపై కొలువైన సీతారామచంద్రస్వామి ఆలయంలో రెండురోజుల పాటు జరుగనునున్న పవిత్రోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం భగవత్ప్రార్థన, విశ్వక్సేన ఆరాధన, పంచగవ్య ఆరాధన, ప్రాశన, వాస్తు పూజ, హోమం, అకల్మశ హోమం, రక్షాబంధనం, దీక్షారాధన, నీరాజనం కార్యక్రమాలు న్విహించారు. సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, పుణ్యావహచనం మేదినీపూజ, అంకురార్పణ తదితర పూజా క్యార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన ఈవో శేషభారతి ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, అభిలాష్‌శర్మ, పారుపెల్లి సత్యనారాయణశర్మ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలకు అధ్యాపకులు కావాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 31: ప్రభుత్వ డైట్ కళాశాలలో అధ్యాపకులు లేకపోవడంతో తరగతులు కాక విద్యార్థులు నష్టపోతున్నారని, డైట్‌కు వెంటనే అధ్యాపకులను కేటాయించాలని డైట్ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డైట్ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ డి.వాసంతి హనుమకొండలోని డీఈవో కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ఎఫ్ఏసీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆమె కళాశాలలో అడుగుకూడా పెట్టలేదన్నారు. కనీసం కళాశాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్నారు. పూర్తిస్థాయి అధ్యాపకులు లేకపోవడంతో కళాశాలలో విద్యావ్యవస్థ కుంటుపడిందన్నారు. సెప్టెంబర్‌లో విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు ఉన్నాయని, ఇప్పటివరకు సిలబస్ పూర్తి కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ డైట్ కళాశాలకు వెంటనే అధ్యాపకులను కేటాయించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విక్రమ్, సృజన, సదీప్, ప్రదీప్‌లతో పాటు విద్యార్థులంతా పాల్గొన్నారు.

నేటి నుంచి డీసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 31: డీసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థుల కు ఆగస్టు 1 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభం అవుతుందని, డైట్ ప్రిన్సి పాల్ డి.వాసంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని ప్రభు త్వ డైట్ కళాశాలలో ఈ నెల 6 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు అన్ని తీసుకొని డైట్ కళాశాలలో నిర్వహించే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రావాలని తెలిపారు.

18వరకు అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ అడ్మిషన్ల ప్రక్రియ

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 31: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనిర్సిటీ లో డిగ్రీ, పీజీ ప్రవేశాల కోసం ఈ నెల 18 వరకు గడువు ఉందని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వరంగల్ ప్రాంతీయ సంచాలకులు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ కోర్సులతో పాటు వివిధ రకాలైన సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు పొందగోరే విద్యార్థులు ఈ నెల 18 వరకు ప్రవేశాల కోసం స్టడీ సెంటర్లలో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

ఉద్యోగ విరమణ చేసిన వారు ప్రశాంత జీవనం గడపాలి

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జూలై31: ఉద్యోగ విరమణ చేసిన వారు ఆయురారోగ్యాలతో ఉండి ప్రశాంతజీవనం గడపాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కోరారు. కలెక్టరేట్‌కు చెందిన ఉద్యోగులు దేచరాజు వెంకట మనోహర్‌రావు, మహ్మద్ యాకూబ్ బాషా, ఆవుల బాలయ్యల ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం బుధవారం రాత్రి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో వైవీ గణేష్, కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ, జిల్లా అధికారుల సంఘం నాయకులు, టీఎన్‌జీఓస్ నాయకులు కలెక్టరేట్ సిబ్బంది, ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యపై మక్కువ కనబర్చాలి

వడ్డెపల్లి, జూలై 31: విద్యార్థులు విద్యపై మక్కువ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేయాలని సీనియర్ సిటిజన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్రయ్య అన్నా రు. తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ ఫెడరేషన్ సంస్థ నుంచి ఉచితంగా సరఫరా చేసిన నోట్ పుస్తకాలను బుధ వారం గోపాల్‌పూర్ పాఠశాలలోని పేద విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పొ రేటర్ సిరంగి సునిల్‌కుమార్, ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటె క్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు దామోదర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు నర్సయ్య, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూలై 31: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామాలయం ఫీడర్ పరిధిలో ఎక్సైజ్ కాలనీ, సుబేదారి పోలీస్‌స్టేషన్ ఏరియా, కేఎల్ఎన్‌రెడ్డి కాలనీ, రెవెన్యూ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఐనవోలు, జూలై 31: మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ ఖాదీర్ అనే బాలుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాలుడు తండ్రి గౌస్‌పాషా స్నేహితులైన పూర్వవిద్యార్థులు స్నేహితులు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు నల్లబెల్లి చిన్నరాజు, మజ్జిగ రాజు, మదూరి రఘు, కూస రవి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో వడ్డెపల్లి శ్మశాన వాటిక



వడ్డెపల్లి మోడల్ శ్మశానవాటిక పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు దాస్యం అభినవ్ భాస్కర్, ఇమ్మడి లోహిత రాజు, సిరంగి సునిల్‌కుమార్

వడ్డెపల్లి, జూలై 31: హనుమకొండ వడ్డెపల్లిలో రూ.కోటితో మోడల్ శ్మశాన వాటికను ఆధునిక హంగులతో నిర్మించినట్లు 60వ డివిజన్ కార్పొరేటర్, బీజేపీ రాష్ట్ర నేత దాస్యం అభినవ్ భాస్కర్ అన్నారు. వడ్డెపల్లి చెరువు ప్రాంతంలో నిర్మించిన మోడల్ శ్మశాన వాటికను బుధవారం 56, 58 డివిజన్ల కార్పొరేటర్లు సిరంగి సునిల్‌కుమార్, ఇమ్మడి లోహిత రాజులతో కలసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అభినవ్ భాస్కర్ మాట్లాడుతూ.. మోడల్ శ్మశాన వాటిక నిర్మాణంతో వడ్డెపల్లితో పాటు వివిధ డివిజన్లు, కాలనీల ప్రజల చిరకాల వాంఛ తీరనుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ నాగపురి అశోక్, బీజేపీ శ్రేణులు మట్టెపల్లి రాంరాజ్, రాజిరెడ్డి, శ్రీకాంత్, నరేష్, మల్లేశం, శ్యామ్, అడుప రామ్, శివ, విద్యాసాగర్, శ్రీధర్, కిరణ్, రాజు, వాసు, కటకం బాబి, రమేష్‌తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కాపాడేందుకు ఆమరణ నిరాహార దీక్ష చేస్తా..

కాజీపేట, జూలై 31: కాజీపేట మండలం కడిపికొండ రెవెన్యూ పరిధిలోని 46 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై కబ్జాచేసేందుకు సిద్ధమయ్యారని, ఆ ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందు కు ఆమరణ నిరాహార దీక్ష చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం అన్నారు. కాజీపేటలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 46 సర్వేనంబర్‌లోని స్థలంలో కొంతభాగాన్ని గతంలో మీడియాపాయింట్‌కు ప్రతిపాదించారన్నారు. వీరికే కాకుండా మరికొంత భాగాన్ని కడిపికొండ ఎస్సీలకు సైతం పట్టాలిచ్చారన్నారు. ఈ స్థలాన్ని కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తప్పుడు కాగితాలు సృష్టించి ప్లాట్‌లు చేసి విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గతంలో కూడా ఆ స్థలాన్ని కాపాడే విషయంలో కొందరు తనపై హత్యాయత్నం చేశారని చెప్పారు. ఈవిషయమై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులే వ్యాధుల నిర్మూలన ప్రచారకర్తలు



మాట్లాడుతున్న బల్దియా బయాలజిస్ట్ మాధవరెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూలై 31: విద్యార్థులే వ్యాధుల నిర్మూలన ప్రచారకర్తలని, విద్యార్థులు సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బల్దియా బయాలజిస్ట్ జి.మాధవ రెడ్డి అన్నారు. వరంగల్ నగర పాలక సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖల సంయుక్తాధ్వర్యంలో బుధవారం హనుమకొండ మర్కజీ స్కూల్‌లో సీజన్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. బల్దియా కమిషనర్ ఆదేశాల మేరకు వ్యాధుల పట్ల విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. వర్షాకాలం సీజన్‌లో వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశాలు చాలా వరకు ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా ఇళ్లలో కొబ్బరి చిప్పలు, కూలర్లలో నీరు, టైర్లలో నీరు, పూల కుండీలలో నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వైద్యురాలు డాక్టర్ గీత, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోలెపాక అనిల్‌కుమార్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ రవి, ప్రధానోపాధ్యాయులు జీవీ రామారావు, ఏఎల్‌వో డాక్టర్ వాసు, హెల్త్ అసిస్టెంట్ చీకటి ప్రకాశ్ పాల్గొన్నారు.

శైలజకు మద్రాస్ ఐఐటీ ప్రశంసాపత్రం

కేయూ క్యాంపస్, జూలై 31: కేయూ కో ఎడ్యుకేషన్ ఈసీఈ విభాగం కాంట్రాక్టు అధ్యాపకురాలు ఐఐటీ మద్రాస్, మానవ వనరుల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఇన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు విజయవంతంగా పూర్తి చూసినందుకుగాను ప్రశంసాపత్రాన్ని ప్రకటించారు. ఈ ప్రశంసాపత్రాన్ని బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి తన చాంబర్‌లో శైలజకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మహేందర్‌లతో కలిసి అందచేసి అభినందించారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ కె.భిక్షాలు, బోధన, బోధనేతర సిబ్బంది శైలజను అభినందించారు.

నేడు కేయూలో ఇంగ్లీష్ కోచింగ్ ప్రారంభం

కేయూ క్యాంపస్, జూలై 31: కేయూ సెంటర్‌ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్(సెల్ట్) ఆధ్వర్యంలో విద్యార్థులకు 40రోజుల స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ పర్సనాలిటీ డెవలప్ మెంట్ తరగతులు ఆగస్టు 1న సాయంత్రం 4 గంటలకు కేయూ గణిత శాస్త్ర విభాగం సెమినార్‌హాల్‌లో ప్రారంభించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షతన జరిగే ప్రారంభ సమావేశంలో కేయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వాకాటి కరుణ, గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ బి. దీపాజ్యోతి హాజరుకానున్నారు. తరగ తులకు ఎంపిక చేసిన 23 మంది వర్సిటీ ఉద్యోగులకు కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాంను నిర్వ హించనున్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో యువత భాగస్వామ్యం కావాలి

హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం, జూలై 31: డ్రగ్స్ నిర్మూలనలో యువత భాగస్వామ్యం కావాలని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని ఏసీపీ కార్యాలయంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన డ్రగ్స్ వద్దు.. ఆరోగ్యం ముద్దు.. అనే పోస్టర్‌ను ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయసులోనే యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటోందని తెలిపారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, ఉపాధ్యక్షుడు చందర్, జిల్లా కమిటీ సభ్యులు అనిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

స్మితా సభర్వాల్ క్షమాపణ చెప్పాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కంప వినోద్‌కుమార్

వడ్డెపల్లి, జూలై 31 : దివ్యాంగులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ దివ్యాంగ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ నేత కంప వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మితా సభర్వాల్ రాజ్యాంగస్ఫూర్తిని దెబ్బతీసే విధంగా ప్రభుత్వ విధానాలను అవహేళన చేసినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్మితాసభర్వాల్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోని పక్షంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో దివ్యాంగుల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో దివ్యాంగుల సంఘం జిల్లా నేతలు ఎం.డి ఖాజా అలీ, సమ్మెట వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కళాకారులు

వడ్డెపల్లి, జూలై 31: తెలంగాణ సాంస్కృతిక సారథి, పౌర సంబంధాల శాఖలో భాగమై పనిచేస్తున్న కళాకారులకు గౌరవ వేతనం రూ.24,514ను పీఆర్‌సీతో కలుపుకొని రూ.31,868కి పెంచడాన్ని పురస్కరించుకొని హర్షం వ్యక్తం చేశారు. బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహ వద్ద తెలంగాణ సాంస్కృతిక సారథి హనుమకొండ జిల్లా కళాకారుల ప్రతినిధులు షేక్ వాజిద్ హుస్సేన్, జీడీ సుధాకర్, దారా దేవేందర్, డాక్టర్ వెన్నెల శ్రీనాథ్, కొండా సారంగపాణిల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ప్రభుత్వ పథకాలకు సంబంధించిన గేయాలను ఆలాపించి అలరించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి హనుమకొండ జిల్లా కళాకారులు బూడిద సురేందర్, ఇనుగుర్తి మధు, వాంకుడోత్ రమేష్, మహ్మద్ రజియా, గడ్డం కళావతి, అంబాల జయ, బొంకూరి రాణి, పులిమారి వేదవతి, పాల్వాయి సంధ్య, షైదం జోత్స్న, దేవి, పుట్ట జానకీ, మహ్మద్ రహీమా, కొయ్యడ సంధ్య, పుల్ల వెంకటస్వామి, ఎండి రహీం, పిట్టల చైతన్య, వడ్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ఉద్యోగులకు సన్మానం

కేయూ క్యాంపస్, జూలై 31: కాకతీయ యూనివర్సిటీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఇంజనీర్ భవానీప్రసాద్, సయ్యద్ తాజోద్దీన్‌లను బుధవారం కేయూ సెనెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ఎఫ్‌వో తోట రాజయ్య ఘనంగా సన్మానించారు. వర్సిటీ జ్ఞాపిక, శాలువా అందచేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. నైపుణ్యం కలిగిన ఉద్యోగులకు ఉద్యోగ విరమణ ఉండదని చెప్పారు. వర్సిటీలో ఉద్యోగుల సంఖ్య తగ్గుతోందని అన్నారు. ఈకార్యక్రమంలో వర్సిటీ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి, ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, పీఆర్‌వో వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు సత్కారం



అవార్డ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సత్కారాన్ని స్వీకరిస్తున్న క్రాఫ్ట్ టీచర్ కరుణ కుమారి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 31: సమాజానికి చేస్తున్న సేవలకు సంస్థలు అందజేస్తున్న సత్కారాలు గుర్తుగా నిలుస్తాయని అడిషనల్ డీసీపీ ఎస్. రవికుమార్ అన్నారు. ప్రపంచ మానవ, బాలల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి హనుమకొండలోని అనుంత భవన్‌లో ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఆధ్వర్యంలో అవార్డ్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (బెకానే ఆఫ్ ఎంపవర్‌మెంట్ అవార్డు-2024) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవికుమార్ మాట్లాడుతూ.. బాలల రక్షణ, సంరక్షణ కోసం చేస్తున్న సేవలకుగాను ఇలాంటి అవార్డులు అందజేయడం అభినందనీయమన్నారు. ఖిలావరంగల్ మండలంలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్‌గా పనిచేస్తున్న ఎ.కరుణకుమారి, నర్సంపేట పట్టణానికి చెందిన స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్‌లకు అవార్డ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంఎం సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, ప్రాజెక్టు ఆఫీసర్ ఎ. శ్రీకాంత్, కోఆర్డినేటర్ బి. కరుణ, వరంగల్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వసుధ, హనుమకొండ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అనిల్ చందర్‌రావు, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా మోహన్‌రావు



మోహన్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

రెడ్డికాలనీ, జూలై 31: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా దొడ్డ మోహన్‌రావు ఎన్నికయ్యారు. బుధవారం జిల్లాలోని 14 మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావును జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య సమగ్ర కుటుంబ సర్వే చేపట్టాలని, ఐక్యంగా ఉండాలని సమావేశంలో తీర్మానించారు. సూర్యదేవర సదానందం అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్, ఉపాధ్యక్షుడు గౌరవి శంకర్, జిల్లా నాయకులు దుబ్బ శ్రీనివాస్, గార్లపాటి శ్రీనివాస్, ఇమ్మడి శ్యామ్, సురేందర్, నాగబండి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన దొడ్డ మోహన్‌రావును ఘనంగా సన్మానించారు.


ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాల గడువును పొడిగించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై31: ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాల గడువును పొడిగించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హనుమకొండలోని డీఐఈవో కార్యాలయంలో డీఐఈవో ఎ. గోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నరేష్ మాట్లాడుతూ... మరో నెల పాటు ప్రవేశాలకు అవకాశం కల్పించాలన్నారు. ఒక కాలేజి నుంచి మరో కాలేజీకి మారుతున్న విద్యార్థులకు ఎడిట్ ఆప్షన్‌లో అనేక రకాల అవాంతరాలు ఎదురవుతున్నాయన్నారు. గడువు పొడిగించకపోతే విద్యార్థులకు అన్యాయం జరిగే ప్రమాదముందన్నారు. ప్రతీ ఏడాది ఆగస్టు 31న ప్రవేశాలకు చివరి గడువుగా ఉంటే ఈ ఏడాది జూలై 31కే గడవు ముగించడం సబబు కాదన్నారు. ప్రభుత్వం ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం గడువును పొడిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ప్రశాంత్ భూషన్, రాజు, కృష్ణాకర్, చరణ్, ప్రమోద్, కార్తిక్, రఘు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల గడువు పొడిగింపు

ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాల గడువును ఈ నెల 20 వరకు పొడిగిస్తున్నట్లు బోర్డు కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసినట్లు వరంగల్, హనుమకొండ డీఐఈవోలు కె. మాధవరావు, ఎ.గోపాల్ బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూలై 31తో గడువు ముగియడంతో గడువును మరో 20 రోజులు పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

ఇప్పటివరకు ప్రవేశాలు పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



WANTED

★ Wanted Teacher & Telecallers Math's to teach up to 8th Class. Part Time/Full Time/Residential. Near KUC, HNK. Cont : 9849157076

AJW-188384

WANTED

★ School Syllabus చెప్పడానికి పార్ట్ టైం/ఫుల్ టైం ఫ్యాకల్టీ కావలెను. మంచి సాలరీ, Physice, Chemistry, Maths, Social Studies, Science, Telugu, English. సం.ప్ర॥ 7659099000

AJW-14259

WANTED

★ హాస్పిటల్‌లో పని చేయుటకు ఆయాలు కావలెను. 3షిఫ్టు కలవు. బేటీస్ లైఫ్ హాస్పిటల్ రోడ్ నెం.1, కాకాజీకాలని, హన్మకొండ. సం.ప్ర॥ 9989510003

AJW-188447

WANTED

★ హనుమకొండలో ప్రముఖ లోన్స్ ఆఫీస్ నందు పని చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సం.ప్ర॥ 9703913251

AJW-188382

WANTED

★ [illegible] HNKలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్-1 మహిళ అభ్యర్థి కావలెను. 10th PASS అయి [illegible] అనుభవం. సెక్యూరిటీ గార్డ్‌గా గవర్నమెంట్ లేదా ఏదైనా సంస్థలో అర్హత పొందినవారు కావలెను. Email : syongo@gmail.com. Cont : 9948412093

AJW-199051

WANTED

★ Wanted Sales Executives for RUDRA SCIENTIFIC LAB INSTRUMENTS, Hanamkonda. Qlf : Degree/Diploma/ 10+2, Freshers or 1-2 Years Exp. Attractive Salary + Incentives. Contact : 6303671845, 9902945663. Email : rudrascientificlab@gmail.com

AJW-188383

సెక్యూరిటి గార్డ్స్ కావలెను

★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటిగార్డ్స్ అర్జెంటుగా కావలెను. 8గం॥ - 12గం॥ల డ్యూటీలు కలవు. జీతం : 10000 - 13500. సం.ప్ర॥ 9000463426

AJW-188449

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

PLOTS FOR SALE

★ ఒగ్లాపూర్-తక్కళ్లపహాడ్ 80ft మెయిన్‌రోడ్డుకు అనుకొని East ఫేస్‌తో 500 గజాల to 1500 గజాల వరకు స్థలం అమ్మబడును. గజం కేవలం 4500/- మాత్రమే. సం.ప్ర॥ 9281131001

AJW-3925

TO-LET

★ Div Centre [illegible]లో Stn.Road లో MedPlus పక్కన 3+3 గదులు G+1 బిల్డింగ్ రెంటుకు ఇవ్వబడును. Bank, Finance, Govt., Pvt. ఆఫీసులు, Any ShowRoom, Medical Shope, [illegible] Etc., సం.ప్ర॥ 7702103341, 9553938599

AJW-5721

TO-LET

★ REC పెట్రోల్ పంప్ (తారా గార్డెన్ ఎదురుగా) మెయిన్ రోడ్‌లో 1780 చ॥అ॥ విస్తీర్ణములో గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్ మరియు 3000 చ॥అ॥ విస్తీర్ణములో గల వర్క్‌షాప్ పూర్తి కవరేజ్ షెడ్‌తో టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ షోరూంలకు, బ్యాంకులకు, వ్యాపార సంస్థలకు కిరాయకు ఇవ్వబడును. సం.ప్ర॥ 9704445770, 8897678810

AJW-188445

అంజనీ వాటర్ ప్రూఫింగ్

★ రూఫ్, స్లాబ్, టెర్రస్, సైడ్ గోడ, బాత్రూమ్, వాటర్ ట్యాంక్ లీకేజీలను అత్యాధునిక కెమికల్స్ టెక్నాలజీ ద్వారా అనుభవం గల టెక్నీషియన్స్‌తో 10 సం॥ గ్యారంటీతో అరికట్టబడును. ఫోన్.9391324850

AJH-434

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ 9985400013, 8978510273

వరంగల్ 9985406150, 9985408173

జనగామ 9866431354

మహబూబాబాద్ 9985418040

తొర్రూర్ 9985418040

నర్సంపేట 9985418040

భూపాలపల్లి 9985401232

పరకాల 9985401232

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

3+2 స్కీం కలదు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 1 ఆగస్టు 2024

కౌన్సెలింగ్

నా వయస్సు 35 ఏళ్లు. ఈ మధ్యకాలంలో చాలా విషయాలు మర్చిపోతున్నాను. దీనికి కారణాలేమిటి? నాకు ఏదైనా వ్యాధి వచ్చిందా?

Q A

మర్చిపోతున్నారా?

మీ వయస్సులో మతిమరపు రావటానికి నిద్రలేమి, ఒత్తిడి, సరైన ఆహారం తీసుకోకపోవటం వంటివి ప్రధాన కారణాలని చెప్పవచ్చు. ఈ కింది సూచనలు పాటిస్తే- మతిమరుపు తగ్గుతుంది.

మెదడుకు పదను పెట్టాలి: మెదడు ఎప్పుడూ పనిచేస్తూ ఉండాలి. దానికి పదును పెట్టినప్పుడే అది మరింత చురుకుగా పనిచేస్తుంది. అందువల్ల సమయం దొరికినప్పుడు పజిల్స్, క్రాస్ వర్డ్స్ వంటివి చేస్తూ ఉంటే మెదడు చురుకుగా పనిచేస్తుంది.

వ్యాయామం అవసరం: చాలా మంది మెదడుకు శరీరానికి మధ్య సంబంధం ఉండదనుకుంటారు. కానీ శారీరకంగా చురుకుగా ఉంటే రక్తప్రసరణ బాగా జరుగుతుంది. రక్తప్రసరణ బాగా జరిగితే మెదడు చురుకుగా పనిచేస్తుంది. అంతే కాకుండా వ్యాయామం చేస్తే కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. ఇవి మెదడులో న్యూరాన్ల విడుదలకు సాయం చేస్తాయి.



ఆరోగ్యకరమైన ఆహారం: మెదడు చురుకుగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహారం, పళ్లు, కూరలు ఎక్కువగా తినటం వల్ల మతిమరుపు తొలగిపోతుంది. చిన్నప్పటి నుంచి ఆరోగ్యకరమైన ఆహారం తినేవారిలో మెదడు చురుకుగా పనిచేస్తుందని నిపుణుల పరిశోధనల్లో తేలింది.

నిద్ర కూడా: మతిమరుపునకు నిద్ర లేమి కూడా ఒక కారణం. మనం నిద్రపోయినప్పుడు మెదడు జ్ఞాపకాలను ఒక క్రమపద్ధతిలో పెట్టుకుంటుంది. అవి అవసరమయినప్పుడు బయటకు వస్తూ ఉంటాయి. సరిగ్గా నిద్రపోకపోతే మెదడు పనితీరు అస్తవ్యస్తమవుతుంది. ఎక్కువ విషయాలు గుర్తుకురావు. అందువల్ల రోజుకు కనీసం 7 నుంచి 9 గంటల నిద్ర అవసరం.

ఒత్తిడి: మానసిక ఒత్తిడి వల్ల కూడా మతిమరుపు వస్తుంది. ఈ ఒత్తిడిని తొలగించుకోవటానికి యోగా, ధ్యానం వంటివి చేయాలి. దానితో పాటుగా వ్యక్తిగత క్రమశిక్షణ కూడా అవసరమే!

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ybKzlMeలో చదవండి.



ఉక్రెయిన్ యుద్ధంలో పోరాడిన ఒక సైనికురాలు శివభక్తురాలిగా మారి, పురాతన బ్రహ్మసూత్ర శివలింగాల కోసం అన్వేషణ ప్రారంభిస్తే? ఆ అన్వేషణలో భాగంగా- థాయ్‌లాండ్‌లోని కొన్ని పురాతన గుళ్లను పునరుద్ధరిస్తే? ఇదంతా చదువుతుంటే సినిమా కథలా అనిపిస్తోంది కదా.. కానీ ఇది **లిదియా లక్ష్మీ** కథ. కొన్ని వేల ఏళ్ల క్రితం అగస్త్య మహాముని ప్రతిష్ఠించాడని భావించే బ్రహ్మసూత్ర శివలింగాల వెతుకులాట గురించి ఆమె మాటల్లోనే..

నా అన్వేషణ



"ఈ ప్రపంచంలో అత్యంత పురాతనమైనది సనాతన ధర్మమని నేను నమ్ముతాను. దీన్ని అనుసరిస్తే ఈ ప్రపంచమంతా సుఖశాంతులతో ఉంటుందనేది నా భావన. ఈ ధర్మ ప్రచారం కోసం అనేకమంది గొప్పవారు భారత దేశం నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణించారు. అక్కడ మన ధర్మాన్ని ప్రవచించారు. రెండేళ్ల క్రితం- 'శివపురాణం' చదువుతున్న సమయంలో కొన్ని విషయాలు నా దృష్టిని ఆకర్షించాయి. సుమారు రెండువేల ఏళ్ల క్రితం దక్షిణ భారత దేశానికి చెందిన కొందరు బ్రాహ్మణులు- శివ మత ప్రతిష్ఠాపన కోసం ఇప్పటి థాయ్‌లాండ్, వియత్నాం వంటి ప్రాంతాలకు ప్రయాణం సాగించారు. వీరు ఈ ప్రాంతాలకు వెళ్లటానికి ఒక కారణం ఉంది. కొన్ని వేల ఏళ్ల క్రితం అగస్త్య మహాముని- భారత దేశం నుంచి ఈ ప్రాంతాలకు వెళ్లాడు. అక్కడ అనేక ఆలయాలను నిర్మించాడు. వాటిలో బ్రహ్మసూత్ర శివలింగాలను ప్రతిష్ఠించాడని మన పురాణాలలో ఉంది. ఆ మహాముని ద్వారా స్ఫూర్తి పొందిన కొందరు- ఆయన బాటలో ప్రయాణించారు. అనేక ఆలయాలను నిర్మించారు. వాటిలో కేవలం శివాలయాలు మాత్రమే కాదు... వేంకటేశ్వర స్వామి, అమ్మవారు, ఆదిపరాశక్తి, అఘోర గణపతి తదితర ఆలయాలు కూడా ఉన్నాయి. ఇక్కడ ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. పురాణాలు అనగానే చాలామంది- చారిత్రక ఆధారం లేదని అనుకుంటారు. కానీ ఈ విషయంలో మాత్రం అనేక చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇప్పటికీ పురాణాల్లో పేర్కొన్న ప్రాంతాల్లో వివిధ ఆలయాలు, కొన్ని చోట్ల బ్రహ్మసూత్ర శివలింగాలు ఉన్నాయి. ఆ ఆలయాలను గుర్తించి... వాటి విశిష్టతను, చరిత్రను ప్రపంచానికి తెలియజేయాలనే సంకల్పంతో యాత్రను ప్రారంభించాను. అయితే మార్గమధ్యంలో మా యాత్ర మరో మలుపు తిరిగింది. దీనికి కారణం- తామ్ర లింగం. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన లింగం అది. సూర్య భగవానుడు- సూర్యవంశస్థులకు దాన్ని ఇచ్చాడని, దానికి వారు నిత్యం పూజ చేసేవారని, వారి పూజలకు భంగం కలిగే పరిస్థితులు రావటంతో... దాన్ని వారు ఇతర దేశాలకు పంపేశారనే కథలు వినిపిస్తూ ఉంటాయి. ఈ కథల విషయం పక్కన పెడితే- అత్యంత పురాతనమైన ఈ లింగం చాలాకాలం థాయ్‌లాండ్‌లోని దక్షిణ భాగంలో ఉండేది. ఆ తర్వాత దాన్ని కొందరు వియత్నాంకు తరలించారు. ప్రస్తుతం అది వియత్నాంలోనే ఉంది. దాన్ని ఎలాగైనా గుర్తించి, ఆలయం కట్టించాలనే సంకల్పమే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది.

> **బ్రహ్మసూత్ర లింగమంటే..**
> సాధారణంగా శివలింగాలు నున్నగా ఉంటాయి. కానీ కొన్ని శివలింగాలపై కొన్ని ప్రత్యేకమైన ఆకృతులు చెక్కబడి ఉంటాయి. వీటినే బ్రహ్మసూత్ర లింగాలంటారు. వీటిని శక్తిమంతమైన లింగాలుగా భావిస్తారు.

తొలి అడుగులు..

పురాణాల ఆధారంగా చరిత్రను పునర్నిర్మించే దిశగా నా తొలి అడుగు పడింది థాయ్‌లాండ్‌లోని నకోన్ సి తామ్‌రాత్‌లో. దక్షిణ థాయ్‌లాండ్‌లోని ఈ ప్రాంతానికి 'తామర్లింగ్' అనే పేరు కూడా ఉంది. ఇక్కడకు సమ్రాట్ అశోకుడు కూడా వచ్చాడని, శివలింగ పూజ చేశాడని ఇక్కడివారు చెబుతూ ఉంటారు. ఈ ప్రాంతంలో అనేకచోట్ల శివలింగాలు లభ్యమయ్యాయి. అవన్నీ బ్రహ్మసూత్ర శివలింగాలు కావటం విశేషమనే చెప్పాలి. థాయ్‌లాండ్ ప్రభుత్వానికి చెందిన పురావస్తుశాఖ ఆ ప్రాంతంలో అనేక తవ్వకాలు జరిపి... అశోకుడి కాలంనాటి అనేక శివలింగాలను వెలికితీసింది. వీటిలో ఒక అతి శక్తిమంతమైన బ్రహ్మసూత్ర శివలింగం కూడా ఉంది. 2018లో ప్రభుత్వాలు, స్థానికుల సహకారంతో ఒక గుడిని నిర్మించి, దానిలో ఆ లింగాన్ని ప్రతిష్ఠించాం. కొన్ని వేల ఏళ్ల తర్వాత మళ్లీ ఈ శివలింగం పూజలు అందుకోవటం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని పాలకొల్లుకు చెందిన కొందరు పండితులతో పాటు భారత, థాయ్ ప్రభుత్వ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఆ తరువాత... అక్కడ నుంచి మన పూర్వీకులు ప్రయాణించిన ప్రాంతాలను పేర్ల ఆధారంగా గుర్తిస్తున్నాం. దక్షిణ థాయ్‌లాండ్‌లో అనేక ప్రాంతాల్లో మనకు బ్రహ్మసూత్ర శివలింగాలు కనిపిస్తాయి. వీటి వెనక ఉన్న చరిత్రకు కూడా ఆధారాలు ఉన్నాయి. ఉదాహరణకు ఇటీవలే ఈ ప్రాంతంలో కొన్ని శాసనాలను గుర్తించాను. థాయ్ పరిశోధకులు వీటిని చోళుల కాలానికి చెందినవిగా భావిస్తూ వచ్చారు. కానీ ఈ శాసనలు బ్రహ్మీ లిపిలో ఉన్నాయి. వాటి ఫొటోలను, వీడియోలను హైదరాబాద్‌లోని 'ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా' (ఏఎస్‌ఐ) సిబ్బందికి పంపితే- ఇవి 6 నుంచి 8వ శతాబ్దం నాటివిగా నిర్ధారించారు. అంటే ఆ సమయానికి థాయ్‌లాండ్‌లో మన హైందవ మతం వ్యాప్తి చెంది, పరిఢవిల్లుతోందని చెప్పవచ్చు.

> **అనుభవాలెన్నో...**
> తామర్లింగ్ ప్రాంతంలో ఒక గొప్ప బ్రహ్మసూత్ర శివలింగం ఉంది. 2016లో దాన్ని అక్కడి స్మగర్లు విదేశాలకు తరలించటానికి ప్రయత్నిస్తుంటే అధికారులు పట్టుకొన్నారు. తిరిగి తామర్లింగ్ ప్రాంతానికి చేర్చారు. దానికి అక్కడే గుడి కట్టాం. అయితే ఈ క్రమంలో ఆశ్చర్యకరమైన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఆ లింగాన్ని తరలించటంలో 35 మంది పాత్ర ఉందని పోలీసులు నిర్ధారించారు. వారిలో స్మగ్లర్లు, కస్టమ్స్ అధికారులు, పోలీసులు- ఇలా అనేకమంది ఉన్నారు. వీరందరూ ఏడాది తిరిగే లోపు రకరకాల కారణాల వల్ల మరణించారు. శివలింగాన్ని తరలించటానికి వారు చేసిన ప్రయత్నాలే చావులకు కారణమయ్యాయని స్థానికులు భావిస్తూ ఉంటారు.

తుది లక్ష్యం..

అగస్త్య మహాముని పూజించిన తామ్రలింగాన్ని గుర్తించి దాన్ని భారతదేశానికి తిరిగి తీసుకురావటమే నా లక్ష్యం. ఈ ప్రయాణంలో నాకు మరచిపోలేని అనేక అనుభవాలు ఎదురవుతున్నాయి. అగస్త్య మహాముని రకరకాల లోహాలతో చేసిన లింగాలను అనేక ప్రాంతాల్లో ప్రతిష్ఠించాడని కూడా చెబుతారు. అలాంటి లింగాలను ఇప్పుడు మనం వియత్నాం పురావస్తు ప్రదర్శనశాలల్లో చూడవచ్చు. ఇదే విధంగా తామ్రలింగం కూడా వియత్నాంలోనే ఉందనటానికి అనేక ఆధారాలున్నాయి. వీటిని వెతుకుతూ త్వరలోనే వియత్నాం చేరుకుంటాను. ఈ ప్రయత్నంలో నాకు సహకరిస్తున్న సహచరులందరికీ కృతజ్ఞతలు చెప్పాలి. నాకు శృంగేరీ పీఠం ఇస్తున్న నైతిక మద్దతు వెలకట్టలేనిది. అలాగే అనేక రకాలుగా సహకరిస్తున్న థాయ్, భారత ప్రభుత్వాలకు కూడా ధన్యవాదాలు చెప్పితీరాలి. మన పురాణాలలో ఉన్నదంతా కల్పన కాదు. దానిలో చరిత్ర కూడా ఉంది. దాన్ని వెలికితీస్తే మన దేశం మరోసారి విశ్వగురువుగా మారుతుంది.



• సీవీఎల్ఎన్ ప్రసాద్

బిజినెస్

అమెరికాలో వడ్డీ రేట్లు యథాతథం

వాషింగ్టన్: స్వల్పకాలిక వడ్డీ రేట్లను యథాతథంగా 5.25-5.5 శాతం వద్ద కొనసాగించాలని అమెరికా కేంద్ర బ్యాంక్ 'ఫెడరల్ రిజర్వ్' నిర్ణయించింది. బుధవారం ఛైర్మన్ జెరోమ్ పోవెల్ అధ్యక్షతన జరిగిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఓఎంసీ) సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గత ఏడాది కాలంగా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఇదే స్థాయిలో కొనసాగిస్తోంది. అయితే రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం దిగువకు వస్తే సెప్టెంబరులో జరిగే భేటీలో వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉందని పోవెల్ స్పష్టమైన సంకేతం ఇచ్చారు.

ఇన్ఫోసిస్‌కు 32,403 కోట్ల జీఎస్‌టీ నోటీస్

న్యూఢిల్లీ: దేశంలోని రెండో పెద్ద ఐటీ సర్వీసుల కంపెనీ ఇన్ఫోసిస్‌కి రూ.32,403 కోట్ల జీఎస్‌టీ ఎగవేతకు సంబంధించి ప్రీ షోకాజ్ నోటీసు జారీ అయింది. బీఎస్ఈకి పంపిన సందేశంలో ఇన్ఫోసిస్ ఈ విషయం వెల్లడించింది. 2017 జూలై నుంచి 2022 మార్చి నెలల మధ్య కాలానికి కర్ణాటక రాష్ట్ర జీఎస్‌టీ అధికారులు ఈ నోటీసు జారీ చేశారని, ఆ నోటీసుకు తమ స్పందన కూడా తెలియచేశామని పేర్కొంది. ఇన్ఫోసిస్‌కు చెందిన విదేశీ కార్యాలయాలు చేసిన ఖర్చులపై జీఎస్‌టీ చెల్లించలేదన్నది ఆ నోటీసు సారాంశమని, కాని అలాంటి వ్యయాలపై జీఎస్‌టీ వర్తించదని తాము విశ్వసిస్తున్నామని కంపెనీ తెలిపింది. చెల్లించాల్సిన జీఎస్‌టీ బకాయిలన్నింటినీ ఇన్ఫోసిస్ కట్టేసిందని, తాము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలన్నీ తాము పాటిస్తున్నామని కంపెనీ స్పష్టం చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,820 ▲	64,000 ▲	91,000 ▲
ముంబై	69,309 ▲	63,487 ▲	82,974 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	440
చిత్తూరు	513	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	94	విజయవాడ	97
వరంగల్	94	గుంటూరు	103
కరీంనగర్	94	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	94	చిత్తూరు	103
కర్నూలు	94	నెల్లూరు	103
విశాఖపట్నం	86	అనంతపురం	97
గోదావరి	97		

ఓరియంట్ రేసులో జేఎస్‌డబ్ల్యూ సిమెంట్!

ప్రమోటర్లకు చెందిన 63.9% వాటా కొనుగోలుకు చర్చలు

అదానీ, అల్ట్రాటెక్‌లతో పోటీ పడే యోచన

న్యూఢిల్లీ: దేశ సిమెంట్ రంగంలో పోటీ తీవ్రమవుతోంది. పెద్ద కంపెనీలు చిన్న కంపెనీలను టేకోవర్ చేసే ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. తాజాగా సజ్జన్ జిందాల్ నాయకత్వంలోని జేఎస్‌డబ్ల్యూ సిమెంట్.. సీకే బిర్లా గ్రూప్‌నకు చెందిన ఓరియంట్ సిమెంట్‌ను టేకోవర్ చేసేందుకు చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఇందుకోసం సీకే బిర్లా, ఆయన కుటుంబ సభ్యుల చేతిలో ఉన్న 63.9 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఇందుకోసం రూ.4,546 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే రెండు కంపెనీలు ఈ వార్తలపై నోరు మెదపడం లేదు.

ఎందుకంటే ?

ఓరియంట్ సిమెంట్‌కు తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దేవాపూర్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో 85 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న సిమెంట్ ప్లాంట్లు ఉన్నాయి. దీనికి తోడు పెద్దమొత్తంలో నాణ్యమైన సున్నపురాయి నిక్షేపాల గనులు ఉన్నాయి. ఈ గనుల నుంచి ఏటా 80 లక్షల టన్నుల సున్నపు రాయిని వెలికి తీయవచ్చు. ఈ నిక్షేపాలతో కంపెనీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 1.6 కోట్ల టన్నులకు విస్తరించే అవకాశం ఉంది. దీంతో జేఎస్‌డబ్ల్యూ సిమెంట్.. ఓరియంట్ సిమెంట్‌పై ఆసక్తి చూపిస్తోంది. ఈ టేకోవర్ ద్వారా సిమెంట్ మార్కెట్లో అదానీ, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలతో గట్టిగా పోటీపడవచ్చని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ భావిస్తోంది. ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ, ఇండియా సిమెంట్స్‌ను టేకోవర్ చేస్తున్న సమయంలోనే జేఎస్‌డబ్ల్యూ సిమెంట్.. ఓరియంట్ సిమెంట్ టేకోవర్ కోసం చర్చలు జరుపుతున్నట్టు వార్తలు రావడం విశేషం.



> **వాల్యుయేషన్ దగ్గరే పీటముడి**
> నిజానికి ఓరియంట్ సిమెంట్ ఈక్విటీలో ప్రమోటర్లకు ఉన్న మెజారిటీ వాటా కొనుగోలు కోసం అల్ట్రాటెక్ కంపెనీ కూడా చర్చలు జరుపుతోంది. అయితే వాల్యుయేషన్ దగ్గరకి వచ్చేసరికి ఈ చర్చలు ముందుకు సాగడం లేదు. ప్రమోటర్ సీకే బిర్లా, ఆయన కుటుంబ సభ్యులు.. కంపెనీ ఆస్తులు, అప్పులతో కలిపి టన్నుకు 110 నుంచి 112 డాలర్లు (సుమారు రూ.9,209-రూ.9,376) అడుగుతున్నట్టు తెలుస్తోంది. ఇందుకు అంగీకరిస్తే ఓరియంట్ సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ పరమవుతుందని భావిస్తున్నారు. మొత్తం మీద సిమెంట్ రంగంలో మరో భారీ టేకోవర్‌కు రంగం సిద్ధమవుతోంది.

మార్కెట్..అదే జోరు కొత్త శిఖరాలపై సూచీలు

ముంబై: చారిత్రక గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలని ఎన్ని హెచ్చరికలు వెలువడుతున్నా ఈక్విటీ మార్కెట్లో జోరు యథాతథంగా కొనసాగుతూనే ఉంది. వరుసగా నాలుగో రోజు కూడా సూచీలు రికార్డు ప్రయాణం కొనసాగించాయి. మెటల్, పవర్, కొన్ని ఆటో రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో బుధవారం సెన్సెక్స్ 285.94 పాయింట్లు లాభపడి 81,741.34 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 372.64 పాయింట్ల మేరకు దూసుకుపోయి 81,828.04 పాయింట్లను తాకింది. అలాగే నిఫ్టీ 24,969.35 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని తాకి చివరికి 93.85 పాయింట్ల లాభంతో 24,951.15 వద్ద ముగిసింది. రెండు సూచీలు ఇంట్రాడేలోను, ముగింపులోనూ చారిత్రక గరిష్ఠ స్థాయిలే నమోదు చేశాయి. సెన్సెక్స్ షేర్లలో 20 లాభపడగా 10 నష్టాలతో ముగిశాయి.

మరో కొత్త శిఖరంపై మార్కెట్ విలువ: బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ మరో కొత్త శిఖరాన్ని అధిరోహించింది. వరుసగా నాలుగో రోజు కూడా ఏర్పడిన ర్యాలీతో ఇది జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.462.38 లక్షల కోట్లకు (5.52 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

ఆగస్టు 6న రెండు ఐపీఓలు: ఈ నెల 6వ తేదీన రెండు ఐపీఓలు మార్కెట్లోకి రానున్నాయి. వాటిలో ఒకటి ఫస్ట్‌క్రై మాతృసంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ ఇష్యూ కాగా రెండోది యునికామర్స్ ఈ-సొల్యూషన్స్ ఇష్యూ. రెండూ ఆగస్టు 8వ తేదీనే ముగుస్తాయి. బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ రూ.1,666 కోట్ల విలువ గల తాజా ఈక్విటీ షేర్లు మార్కెట్లో జారీ చేయనుంది.

మారుతి లాభంలో 47% వృద్ధి

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) నికర లాభం ఏకంగా 47 శాతం వృద్ధి చెంది రూ.3,650 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.2,485 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ నికర విక్రయాలు కూడా రూ.30,845 కోట్ల నుంచి రూ.33,875 కోట్లకు పెరిగాయి. కమోడిటీ ధరల్లో సానుకూలత, వ్యయాల తగ్గింపుపై దృష్టి పెట్టడంతో పాటు విదేశీ మారక లాభాలతో ప్రోత్సాహకర పనితీరును కనబరిచినట్లు మారుతి సుజుకీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ భారతి తెలిపారు. జూన్ త్రైమాసికంలో కంపెనీ విక్రయాలు 5 శాతం వృద్ధితో 5,21,868 యూనిట్లుగా నమోదయ్యాయని ఆయన చెప్పారు.

జనవరిలో తొలి ఈవీ కారు ప్రదర్శన: వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న భారత్ మొబిలిటీ షోలో మారుతి తొలి ఎలక్ట్రిక్ వాహనాన్ని (ఈవీ) ప్రదర్శించనుందని రాహుల్ తెలిపారు. 2031 నాటికి ఆరు ఈవీ మోడల్స్‌ను మార్కెట్లోకి తీసుకురావాలని చూస్తున్నట్లు చెప్పారు.

ఎం అండ్ ఎం లాభం రూ.3,283 కోట్లు

ముంబై: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం).. జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో రూ.37,218 కోట్ల కన్సాలిడేటెడ్ రెవెన్యూపై రూ.3,283 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.2,745 కోట్లు)తో పోల్చితే లాభం 20 శాతం, రెవెన్యూ (రూ.33,892 కోట్లు) 10 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీకి చెందిన అన్ని విభాగాలు పటిష్ఠమైన పనితీరును కనబరచటం కలిసి వచ్చిందని ఎం అండ్ ఎం ఎండీ, సీఈఓ అనీష్ షా పేర్కొన్నారు. జూన్ త్రైమాసికంలో కంపెనీ మొత్తం 2.12 లక్షల వాహనాలను విక్రయించింది. యుటిలిటీ వాహన విభాగ విక్రయాలు 14 శాతం వృద్ధితో 1.24 లక్షల యూనిట్లుగా నమోదు కాగా ఎస్‌యూవీ పోర్టుఫోలియో వాహన విక్రయాలు 18,000 యూనిట్ల నుంచి 49,000 యూనిట్లకు పెరిగాయని మహీంద్రా తెలిపింది.

వియత్నాంలో ఎస్ఎంఎస్ ఫార్మా జేవీ

500 హెక్టార్లలో ఫార్మా పార్క్ అభివృద్ధి

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఎస్ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ తన కార్యకలాపాలను వియత్నాంకు విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఆ దేశంలోని తన్ హోవా రాష్ట్రంలోని నఘి సోన్ ప్రత్యేక ఆర్థిక మండలిలో 500 హెక్టార్లలో జాయింట్ వెంచర్ (జేవీ) రూపంలో ఫార్మా పార్క్ ఏర్పాటుకు సిద్ధమైంది. వియత్నాంకు చెందిన ఒక స్థానిక సంస్థతో పాటు హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే శ్రీ అవంతిక కాంట్రాక్టర్స్ అనే సంస్థతో కలిసి ఎస్ఎంఎస్ ఫార్మా ఈ ఫార్మా పార్క్ ఏర్పాటు చేయనుంది. ఎస్ఎంఎస్ ఫార్మా సీఎండీ రమేశ్ బాబు, శ్రీ అవంతిక కాంట్రాక్టర్స్ ఎండీ నరేంద్ర రెడ్డి ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న వియత్నాం ప్రధాని ఫామ్ మిన్హ్ చిన్‌కు ఈ ప్రాజెక్టు గురించి వివరించారు. అవసరమైన అనుమతులు ఇస్తే 70 నుంచి 100 కోట్ల డాలర్లతో ఈ ఫార్మా పార్క్ తొలి దశ పూర్తి చేయాలని ఎస్ఎంఎస్ ఫార్మా, శ్రీ అవంతిక కాంట్రాకర్స్ భావిస్తున్నాయి. వచ్చే 10-12 సంవత్సరాల్లో ఈ పార్క్ కోసం 400-500 కోట్ల డాలర్లు ఖర్చు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని సహాయ సహకాలు అందిస్తామని వియత్నాం ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఐటీ రిటర్న్‌లు @7కోట్లు

న్యూఢిల్లీ: అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం బుధవారం రాత్రి 7 గంటల సమయానికి దాఖలైన ఆదాయ పన్ను (ఐటీ) రిటర్న్‌ల సంఖ్య 7 కోట్లు దాటింది. ఖాతాలు ఆడిట్ చేయాల్సిన అవసరం లేని అసెసీలు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఐటీ రిటర్న్‌లు దాఖలు చేయడానికి బుధవారం చివరి రోజు కావడంతో ఈ ఒక్క రోజే 50 లక్షలకు పైగా రిటర్న్‌లు దాఖలయ్యాయయని ఐటీ శాఖ ఎక్స్ పోస్టులో తెలిపింది. గత ఏడాది (2022-23 ఆర్థిక సంవత్సరం) దాఖలైన ఐటీ రిటర్న్‌ల సంఖ్య 6.77 కోట్లు. కాగా చివరి రోజు జూలై 31న 64.33 లక్షల రిటర్న్‌లు దాఖలయ్యాయి.

మౌలికం 20 నెలల కనిష్ఠం

న్యూఢిల్లీ: దేశంలో పారిశ్రామికాభివృద్ధికి కీలకమైన 8మౌలిక వసతుల రంగాల వృద్ధి రేటు జూన్‌లో 20 నెలల కనిష్ఠ స్థాయి 4 శాతానికి పడిపోయింది. క్రూడాయిల్, రిఫైనరీ ఉత్పత్తుల తయారీలో తగ్గుదల ఇందుకు దోహదపడింది. ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఇన్‌ఫ్రా రంగం గతంలో నమోదు చేసిన కనిష్ఠ స్థాయి 0.7%. 2022 అక్టోబరులో ఇది నమోదైంది. ఈ ఏడాది మే నెలలో ఇన్‌ఫ్రా రంగం వృద్ధి రేటు 6.4 శాతం ఉండగా గత ఏడాది జూన్‌లో 8.4 శాతం ఉంది. ఇదిలా ఉండగా ఏప్రిల్-జూన్ నెలల మధ్య కాలంలో అంటే మొదటి త్రైమాసికంలో కీలక రంగాల వృద్ధిరేటు 5.7 శాతం ఉంది.

విత్తలోటు 8.1 శాతం: తొలి త్రైమాసికం ముగిసే నాటికి ప్రభుత్వ విత్తలోటు పూర్తి సంవత్సర లక్ష్యంలో 8.1 శాతంగా నమోదైంది. నగదు పరిమాణంలో చూసినట్టయితే జూన్ చివరి నాటికి ఇది రూ.1,35,712 కోట్లుంది. గత ఏడాది ఇదే కాలంలో విత్తలోటు బడ్జెట్ అంచనాల్లో 25.3 శాతం ఉంది.

టాటా స్టీల్ లాభంలో 75 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన టాటా స్టీల్ నికర లాభం ఏకంగా 75% వృద్ధి చెంది రూ.918.57 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.424.85 కోట్లుగా ఉంది. త్రైమాసిక కాలంలో వ్యయాలను గణనీయంగా తగ్గించుకోవటం ఎంతగానో కలిసి వచ్చిందని తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.60,666.48 కోట్ల నుంచి రూ.55,031.30 కోట్లకు పడిపోయింది. ఈ కాలంలో వ్యయాలు రూ.58,553.25 కోట్ల నుంచి రూ.52,389.06 కోట్లకు తగ్గాయి.

10% పెరిగిన బీఓబీ లాభం

ముంబై: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ).. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.4,458 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.4,070 కోట్లు)తో పోల్చితే లాభం 10 శాతం పెరిగింది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.29,878 కోట్ల నుంచి రూ.32,116 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ.26,556 కోట్ల నుంచి రూ.29,629 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 3.51 శాతం నుంచి 2.88 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.78 శాతం నుంచి 0.69 శాతానికి తగ్గాయి.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
గురువారం • 1 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



నా దగ్గర ఆధారాలు ఉన్నాయి..
లీగల్‌గానే వెళతా

హీరో రాజ్‌తరుణ్, లావణ్యల వివాదం బుధవారం కొత్త మలుపు తిరిగింది. రాజ్‌తరుణ్ హీరోగా నటించిన 'తిరగబడరా సామీ' చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ బుధవారం జరిగితే అక్కడికి లావణ్య వచ్చారు. ఆ చిత్ర కథనాయిక, ఈ వివాదానికి కేంద్ర బిందువు అయిన మాల్వీ మల్హోత్రా కూడా వచ్చారు. రాజ్‌తరుణ్, మాల్వీ ఇద్దరూ వైట్ డ్రస్‌లో ఉండడం గమనార్హం. రాజ్‌తరుణ్ వస్తున్నాడని తెలియగానే మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. 'నా సినిమా హిట్ అయినప్పుడు కూడా ఇంత మంది మీడియా సభ్యులు రాలేదు' అంటూ రాజ్‌తరుణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తనపై వచ్చిన వివాదం గురించి ఆ మీడియా సమావేశంలో రాజ్‌తరుణ్ చెప్పిన మాటలు ఇవి.

- నాలో ఉన్న అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుంటున్నారు. నేను ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడడం లేదు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. అందుకే లీగల్‌గా వెళుతున్నాను.
- నా వల్ల గర్భం వచ్చిందనీ, అబార్షన్ చేయించానని ఆరోపిస్తున్నారు. మరి ఆ విషయాన్ని పోలీసులకు ఇచ్చిన కంప్లయింట్‌లో ఎందుకు చేర్చలేదు? ఎందుకంటే అవి నిజాలు కావు కనుక. అందుకే ఈ విషయం గురించి నేను మాట్లాడను. మా లాయర్ ద్వారా ప్రొసీడ్ అవుతున్నా.
- నాకు ఇప్పుడు 32 ఏళ్లు. ఇన్నేళ్ల జీవితంలో ఎందరో పరిచయం అయి ఉంటారు. ఎంతో మందితో సాన్నిహిత్యం ఉంది. వాళ్లలో ఎవరైనా నేను మంచి వాడిని కాదు అని చెబితే పరిశ్రమ నుంచి తప్పుకొంటా.
- నేనూ మనిషినే. బాధలు ఉండవా! ఆ బాధ వల్లే 'పురుషోత్తముడు' చిత్రం ఫంక్షన్‌కు కూడా రాలేదు. ఆ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు.
- నాకు పెళ్లి మీద ఆసక్తి లేదు. అది ఇప్పుడు చెబుతున్న మాట కాదు. నా పాత ఇంటర్వ్యూలు చూస్తే అది మీకు తెలుస్తుంది.
- 'తిరగబడరా సామి' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఫ్యామిలీ అంతా చూడదగ్గ సినిమా ఇదనీ, మాల్వీ మల్హోత్రా మంచి నటి అనీ, ఆమెకు ఇదే తొలి సినిమా కనుక ఆదరించండి.

లావణ్య ప్రత్యక్షం



తనకు కనిపించకుండా తిరుగుతున్న రాజ్‌తరుణ్ ప్రసాద్ ల్యాబ్‌లో ఉన్నారని తెలియగానే లావణ్య అక్కడ ప్రత్యక్షమయ్యారు. రాజ్‌తరుణ్ కలుసుకోవాలని ఆమె చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కొంతమంది మీడియా ప్రతినిధులు ఆమెతో మాట్లాడాలని ప్రయత్నించినా అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు లావణ్యను అక్కడ నుంచి పంపించేశారు. ఆ తర్వాత ఆమె మాదాపూర్‌లోని రాజ్‌తరుణ్ ఇంటికి చేరుకొని అక్కడ కూడా అందోళనకు దిగారు. తలుపు తీసే వరకూ అక్కడ నుంచి వెళ్లనని అన్నారు. రాజ్‌తరుణ్ అడిగిన ఆధారాలు తెచ్చినట్లు చెప్పారు.

కట్టి పడేసే కియారా



రామ్‌చరణ్ హీరోగా తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కియారా అద్వానీ కథానాయిక. బుధవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా లుక్ పోస్టర్ విడుదల చేశారు. చూపు తిప్పుకోవడం కష్టం అనేంతగా ఉన్న కియారా గ్లామర్ లుక్ అభిమానుల్ని కట్టి పడేస్తోంది.

బడ్డీనే హీరో



అల్లు శిరీష్ హీరోగా నటించిన 'బడ్డీ' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. జ్ఞానవేల్ రాజా, అధన నిర్మాతలు. శామ్ ఆంటోన్ దర్శకుడు. బుధవారం జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో అల్లు శిరీష్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను సెకండ్ హీరో. టెడ్డీ బేర్ ఫస్ట్ హీరో. టెడ్డీ చేసే యాక్షన్ సీన్లు అలరిస్తాయి' అని చెప్పారు. ఈ సినిమా విషయంలో నిర్మాత హ్యాపీగా ఉన్నారనీ, టీమ్ కూడా సంతోషంగా ఉందని దర్శకుడు చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో



నా గత చిత్రాలకు మల్లే 'శివం భజే' సినిమాలోనూ ఓ కొత్త థ్రిల్లింగ్ అంశాన్ని చూపించబోతున్నాం అని హీరో అశ్విన్ బాబు అన్నారు. ఆయన హీరోగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. నేడు విడుదలవుతున్న సందర్భంగా అశ్విన్‌బాబు మీడియాతో ముచ్చటించారు. 'ఇందులో కుటుంబ అనుబంధాలతో పాటు ఆధ్యాత్మిక అంశాలను స్పృశించాం. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అని బలంగా నమ్మే పాత్ర నాది. ఇందులో యాక్షన్ స్టైలిష్‌గా ఉంటుంది' అని ఆయన చెప్పారు.

కీర్తి కామెడీ



కీర్తిసురేశ్ లీడ్‌రోల్ పోషిస్తున్న మహిళా ప్రాధాన్య చిత్రం 'రఘుతాత'. సుమన్ కుమార్ దర్శకుడు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. గడుసైన యువతి పాత్రలో కీర్తి కామెడీ పండించిన తీరు ఆకట్టుకుంది. హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది.

'గద్దర్ అవార్డ్స్'పై కమిటీ ఏర్పాటు

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫిల్మ్ అవార్డ్స్ ను ఇకపై 'గద్దర్' అవార్డ్స్ పేరుతో ఇవ్వడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడంపై తెలుగు చిత్ర పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'నటుడిగా, గాయకుడిగా ఎంతో ప్రతిభ కలిగిన వ్యక్తి గద్దర్. ఆయన పేరు మీద అవార్డులు ఇవ్వాలనుకోవడం సముచిత నిర్ణయం. ఈ అవార్డుల విధివిధానాలు ఎలా ఉండాలో తయారు చేయడానికి తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలుగు నిర్మాతల మండలి ఓ కమిటీని నియమిస్తాయి. ఆ విధి విధానాలను ఎఫ్.డి.సి. ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారికి త్వరలో అందజేస్తాం' అని తెలుగు చిత్ర పరిశ్రమ ఒక ప్రకటనలో తెలిపింది.

ఫ్యామిలీ డ్రామా



కృష్ణవంశీ, మోక్ష జంటగా నటించిన 'అలనాటి రామచంద్రుడు' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. చిలుకూరి ఆకాశ్‌రెడ్డి దర్శకుడు. హైమవతి, శ్రీరామ్ జడపోలు నిర్మాతలు. ఈ సినిమా నచ్చడంతో దిల్ రాజు విడుదల చేస్తున్నారు. ఫీల్‌గుడ్ ఫ్యామిలీ డ్రామా ఇదనీ, కథ అనుకున్నప్పుడే కొత్త వాళ్లతో తీయాలని అనుకున్నామనీ దర్శకుడు చెప్పారు. ఈ జనరేషన్‌కు కావాల్సిన స్వచ్ఛమైన ప్రేమను చిత్రంలో చూపించామనీ, కొత్త టాలెంట్‌తో సినిమా తీశామని నిర్మాతలు చెప్పారు.

తుపాన్ లాంటి యాక్షన్



విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'తుపాన్' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్ బోరా, లలిత, ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోని మాట్లాడుతూ "బిచ్చగాడు' తర్వాత నా మనసుకు దగ్గరైన కథ ఇది. ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకుంటాయి. తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం యూనిట్ చాలా కష్టపడింది. విజయ్ ఆంటోని ఇందులో సరికొత్తగా కనిపిస్తారు. వినోదం,యాక్షన్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.











పారిస్ ఒలింపిక్స్

(జూలై 26 - ఆగస్టు 11)



ఒలింపిక్స్ ఐదో రోజును భారత అథ్లెట్లు ఆశావహంగా ముగించారు. పతకం లేకపోయినా.. బరిలో నిలిచిన ఆటగాళ్లలో చాలామంది విజయాలతో ముందంజ వేశారు. 50 మీ. రైఫిల్ 3 పొజిషన్స్‌లో ఫైనల్ చేరిన తొలి భారత షూటర్‌గా స్వప్నిల్ కుశాలె రికార్డులకెక్కగా.. బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ పతకానికి గెలుపు దూరంలో నిలిచింది. సింధు, లక్ష్యసేన్ నాకౌట్‌కు దూసుకెళ్లగా.. ఆర్చర్ దీపికా కుమారి వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి రౌండ్-16లో అడుగుపెట్టింది. తెలుగు టీటీ ప్లేయర్ ఆకుల శ్రీజ ప్రీక్వార్టర్స్‌కు చేరడం ద్వారా తన బర్త్‌డేను చిరస్మరణీయం చేసుకొంది.

అన్నీ మంచి శకునములే!

ప్రీక్వార్టర్స్‌కు సింధు, లక్ష్య



లక్ష్యసేన్



సింధు

● రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్లో స్వప్నిల్

● శ్రీజ, లవ్లీనా, దీపిక ముందంజ

పారిస్: ఒలింపిక్స్‌లో ఐదోరోజు భారత అథ్లెట్లు మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకొన్నారు. 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో స్వప్నిల్ కుశాలె ఫైనల్‌కు చేరుకొన్నాడు. విశ్వక్రీడల్లో ఈ విభాగంలో పతక రౌండ్‌కు చేరుకొన్న తొలి భారత షూటర్‌గా నిలిచాడు. బుధవారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో స్వప్నిల్ మొత్తం 590 పాయింట్లతో ఏడో స్థానంలో నిలవగా.. అతడి సహచరుడు ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ 589 పాయింట్లతో 11వ స్థానం దక్కించుకొన్నాడు. 44 మంది తలపడిన అర్హత రౌండ్‌లో టాప్-8లో నిలిచిన షూటర్లు ఫైనల్‌కు అర్హత సాధించారు. దీంతో స్వప్నిల్ ముందంజ వేయగా.. మెడల్ రౌండ్ నుంచి ఐశ్వరీ అవుటయ్యాడు. గురువారం ఫైనల్స్ జరగనున్నాయి. మహిళల ట్రాప్‌లో రాజేశ్వరీ కుమారి, శ్రేయాసి సింగ్ ఫైనల్‌కు చేరుకోలేక పోయారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో వీరిద్దరూ చెరి 113 పాయింట్లు స్కోరు చేసి 22, 23 స్థానాల్లో నిలిచి, పతక రౌండ్ నుంచి అవుటయ్యారు.



స్వప్నిల్ కుశాలె

టోక్యో కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ క్వార్టర్స్‌కు చేరుకొంది. బాక్సింగ్ మహిళల 75 కిలోల రౌండ్-16 బౌట్‌లో లవ్లీనా 5-0తో సునీవా హాఫ్‌స్టాడ్ (నార్వే)ను మట్టికరిపించింది. అయితే, క్వార్టర్స్ పోరులో టాప్‌సీడ్ లి కియాన్ (చైనా)తో బొర్గొహైన్ రూపంలో కఠిన సవాల్‌ను ఎదుర్కోనుంది. ఈ బౌట్‌లో నెగ్గి సెమీస్ చేరితే లవ్లీనాకు రెండో ఒలింపిక్ పతకం ఖాయమవుతుంది. 54 కిలోల ప్రీక్వార్టర్స్‌లో ప్రీతి పవార్ 2-3తో యనీ మార్సెలా (కొలంబియా) చేతిలో పోరాడి ఓడింది.

పతకానికి అడుగు దూరంలో



లవ్లీనా

ధోనీ స్ఫూర్తిగా..

షూటర్ స్వప్నిల్‌కు క్రికెటర్ ధోనీ అంటే ఎంతో అభిమానం. కెరీర్ ఆరంభంలో రైల్వే టీటీగా మహీ చేసిన తరహాలోనే ఇతడు కూడా టీటీగా పనిచేస్తున్నాడు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లోని కంబల్వాడి గ్రామానికి చెందిన 29 ఏళ్ల కుశాలె 2012 నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొంటున్నాడు. కానీ, ఒలింపిక్స్ అవకాశం కోసం పన్నెండేళ్లపాటు ఎదురుచూశాడు. అయితే, ఆడుతున్న తొలి మెగా ఈవెంట్‌లోనే తనదైన ముద్ర వేశాడు. 50 మీ. రైఫిల్ 3 పొజిషన్స్‌లో ఫైనల్ చేరిన తొలి భారత షూటర్‌గా నిలిచాడు. షూటర్‌గా ఎంతో ప్రశాతంగా, కూల్‌గా ఉండాలి. ఈ విషయంలో ధోనీ తనకు ఆదర్శమని చెప్పాడు. మహీ బయోపిక్‌ను ఎన్నోసార్లు చూశానన్నాడు.

సేన్ సంచలనం

ఏస్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్య సేన్ ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. గ్రూప్ స్టేజ్ చివరి మ్యాచ్‌లో సింధు అలవోకగా నెగ్గగా.. ఆల్ ఇంగ్లండ్ చాంపియన్, వరల్డ్ నెం:4 జొనాథన్ క్రిస్టీపై సేన్ సంచలన విజయం నమోదు చేశాడు. గ్రూప్-ఎంలో జరిగిన ఆఖరి, రెండో మ్యాచ్‌లో సింధు 21-5, 21-10 క్రిస్టిన్ కూబా (ఎస్తోనియా)ను చిత్తు చేసింది. 33 నిమిషాల్లోనే సింధు మ్యాచ్‌ను ముగించడం విశేషం. పురుషుల సింగిల్స్ గ్రూప్-ఎల్‌లో చివరి మ్యాచ్‌లో లక్ష్య సేన్ 21-18, 21-12 క్రిస్టీ (ఇండోనేసియా)పై గెలిచాడు. ఈ మ్యాచ్‌కు ముందు జొనాథన్‌తో ఐదుసార్లు జరిగిన ముఖాముఖి పోరులో 4 మ్యాచ్‌ల్లో ఓడిన సేన్.. మెగా ఈవెంట్‌లో మాత్రం ఆకట్టుకొనే ప్రదర్శన చేశాడు.

శ్రీజ.. స్పెషల్ విన్



ఆకట్టుకొనే ప్రదర్శన చేస్తున్న తెలుగమ్మాయి శ్రీజ ప్రీక్వార్టర్స్‌కు చేరుకొంది. మహిళల సింగిల్స్ రౌండ్-32లో శ్రీజ 4-2తో జియాంగ్ జెన్ (సింగపూర్)పై గెలిచింది. తొలి గేమ్‌లో 9-11తో ఓడినా.. ఆ తర్వాత గొప్పగా పోరాడిన శ్రీజ.. తన 26వ పుట్టిన రోజును చిరస్మరణీయం చేసుకొంది. ప్రీ క్వార్టర్స్‌లో వరల్డ్ నెం:1 సన్ యింగ్‌షా (చైనా)తో శ్రీజ తలపడనుంది. కాగా, సింగిల్స్‌లో మనికా పోరాటం ముగిసింది. రౌండ్-16లో బాత్రా 1-4తో హినానో మ్యూ (జపాన్) చేతిలో ఓడింది.

పారిస్‌లో నేటి భారతం



అథ్లెటిక్స్: పురుషుల 20 కి.మీ రేస్ వాక్ - పరమ్‌జీత్, వికాస్, ఆకాశ్ (ఉ. 11), మహిళల 20 కి.మీ రేస్ వాక్ - ప్రియాంక గోస్వామి (మ. 12.50)
గోల్ఫ్: పురుషుల వ్యక్తిగత ఫైనల్స్ - గగన్‌జీత్ భుల్లార్, శుభాంకర్ శర్మ (మ. 12.30);
షూటింగ్: పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్స్ - స్వప్నిల్ కుశాలె (మ. 1); మహిళల 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్ క్వాలిఫికేషన్స్- సిఫ్త్ కౌర్, అంజుమ్ మోద్గిల్ (మ. 3.30);
హాకీ గ్రూప్ దశ: భారత్ x బెల్జియం (మ. 1.30);
బాక్సింగ్: మహిళల 50 కిలోల ప్రీక్వార్టర్స్ - నిఖత్ జరీన్ x యూ వూ (చైనా) (మ. 2.30);
ఆర్చరీ: పురుషుల వ్యక్తిగత విభాగం ఎలిమినేషన్ (1/32 రౌండ్) - ప్రవీణ్ జాధవ్ x కావో వెన్‌చావో (చైనా) (మ. 2.30);
టేబుల్ టెన్నిస్: మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్స్ (మ. 1.30);
సెయిలింగ్: పురుషుల డింగీ రేస్ 1, 2 - విష్ణు శవరణన్ (మ. 3.45); మహిళల డింగీ రేస్ 1, 2 - నేత్ర కుమనన్ (రా. 7.05).

ఆ బాక్సులో ఏముందంటే!



పారిస్ ఒలింపిక్స్ విజేతలకు స్వర్ణ, రజత, కాంస్య పతకాలతోపాటు ఓ పొడవాటి బాక్సును కూడా అందజేస్తున్నారు. ఆ బాక్సులో ఏదో ఖరీదైన గిఫ్ట్ ఉందని అనుకుంటే పొరపాటే. 40 సెంటీమీటర్ల ఆ కార్డ్‌బోర్డ్ బాక్స్‌లో పారిస్ ఒలింపిక్స్ అధికారిక పోస్టర్ మాత్రమే ఉందట. ఆ పోస్టర్‌ను ఫ్రాన్స్‌కు చెందిన ఆర్ట్ డైరెక్టర్ ఉగో గటోనీ రూపొందించాడు.

గోల్డ్ మెడల్ ఖరీదు ఎంతంటే..

ఒలింపిక్స్‌లో గెలుపొందిన క్రీడాకారులకు ఇచ్చే పతకాలకు ఒక ప్రత్యేకత, విశిష్టత ఉంది. అనాది నుంచి వాటి తయారీలోనూ నిర్వాహకులు చాలా శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇక.. ఈ పారిస్ ఒలింపిక్స్‌లో ప్రదానం చేస్తున్న పసిడి పతకం తయారు చేసేందుకు భారత కరెన్సీలో సుమారు రూ.86 వేలు ఖర్చు అవుతుంది. 1912 స్టాక్‌హోమ్ ఒలింపిక్స్ వరకు పసిడి పతకాలంటే పూర్తిగా బంగారంతోనే చేసేవారు. అయితే, మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఒలింపిక్స్ నిర్వహణ వ్యయాలను తగ్గించే క్రమంలో స్వర్ణ పతకం తయారీలో మార్పులు చేశారు. పసిడి పతకాన్ని స్వచ్ఛమైన వెండితో చేసి, పైన బంగారు తాపడం చేయడం ఆరంభించారు. ప్రస్తుతం స్వర్ణ పతకం బరువు 529 గ్రాములుండగా, అందులో బంగారం ఆరు గ్రాములే. అంటే గోల్డ్ మెడల్‌లో గోల్డ్ ఉండేది 1.3 శాతమే. అయితే రజత పతకాన్ని మాత్రం పేరుకి తగ్గట్టే వెండితో చేస్తున్నారు. కాంస్య పతకాన్ని కాపర్, టిన్, జింక్ వంటి ఖనిజాల మిశ్రమంతో తయారు చేస్తున్నారు.

పతకం దిశగా జొకోవిచ్

టెన్నిస్ సింగిల్స్‌లో క్వార్టర్స్‌కు

ప్రపంచ టెన్నిస్ స్టార్ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ పారిస్ ఒలింపిక్స్‌లో పతకం దిశగా దూసుకెళుతున్నాడు. ఈ సెర్బియా కింగ్ పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్ చేరాడు. బుధవారం జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్స్ పోరులో జొకోవిచ్ 7-5, 6-3తో జర్మనీకి చెందిన డొమినిక్ కోఫెర్‌ను వరుససెట్లలో ఓడించాడు. ఇప్పటికే 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో పాటు పలుమార్లు వరల్డ్ నెంబర్‌వన్ ర్యాంక్‌ను కూడా అందుకున్న 37 ఏళ్ల జొకోవిచ్ ఖాతాలో ఒలింపిక్స్ స్వర్ణ పతకం మాత్రం లేదు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో అతను కాంస్యం గెలిచాడు. కాగా, ఒలింపిక్స్‌లో క్వార్టర్స్ చేరడం జొకోవిచ్‌కు ఇది నాలుగోసారి. దీంతో విశ్వక్రీడల్లో టెన్నిస్‌ను తిరిగి ప్రవేశపెట్టిన (1988) తర్వాత అత్యధికసార్లు క్వార్టర్స్ చేరిన ఆటగాడిగా జొకో రికార్డుకెక్కాడు.

ఆసీస్ చేపకే చిక్కింది

» 100 మీ. బ్యాక్‌స్ట్రోక్ టైటిల్ నిలబెట్టుకున్న కేలీ

» రెగాన్ స్మిత్‌కు రజతం



రెగాన్ స్మిత్

కేలీ మెక్యూయెన్

స్విమ్మింగ్ సంచలనం కేలీ మెక్యూయెన్ మళ్లీ కొట్టేసింది. ఆస్ట్రేలియాకు చెందిన ఈ క్వీన్.. మహిళల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో ఒలింపిక్స్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. టోక్యోలో టైటిల్ నెగ్గిన 23 ఏళ్ల కేలీ.. పారిస్‌లోనూ సత్తాచాటుతూ చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్ రేసును కేలీ 57.33 సెకన్లలో ముగించి వరుసగా రెండోసారి పసిడి పట్టేసింది. ఇక, గతనెల యూఎస్ ట్రయల్స్‌లో 57.13 సెకన్ల టైమింగ్‌తో కేలీ పేరిటనున్న ప్రపంచ రికార్డు (57.33 సె)ను బద్దలుకొట్టి ఫేవరెట్‌గా పారిస్‌లో అడుగుపెట్టిన అమెరికా స్టార్ రేగన్ స్మిత్.. అసలు పోటీకొచ్చేసరికి తేలిపోయింది. రేగన్ స్మిత్ ఫైనల్ రేసులో 57.66 సెకన్లతో రజత పతకానికి పరిమితమైంది. కాగా, టోక్యో క్రీడల్లో కాంస్యంతోనే సరిపెట్టుకున్న 22 ఏళ్ల స్మిత్ ఈసారి మాత్రం పతక ప్రదర్శనను మెరుగుపరచుకోవడం విశేషం. అమెరికాకే చెందిన కేథరిన్ బెర్కాఫ్ (57.98 సె)కు కాంస్యం దక్కింది.


అన్షుమన్ గైక్వాడ్ కన్నుమూత





న్యూఢిల్లీ: టీమిండియా మాజీ క్రికెటర్, చీఫ్ కోచ్ అన్షుమన్ గైక్వాడ్ కన్నుమూశాడు. కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 71 ఏళ్ల అన్షుమన్ బుధవారం రాత్రి బరోడాలో తుదిశ్వాస విడిచాడు. లండన్ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న గైక్వాడ్ గతనెలలోనే స్వదేశం తిరిగొచ్చాడు. కాగా, ఇటీవల గైక్వాడ్ చికిత్సకు ఆర్థిక సాయం చేయాలంటూ టీమిండియా మాజీ కెప్టెన్లు కపిల్ దేవ్, గవాస్కర్ విన్నపం చేయడంతో.. భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) కోటి రూపాయలు విడుదలజేసిన సంగతి తెలిసిందే. బరోడాకు చెందిన గైక్వాడ్ 1975-87 మధ్యకాలంలో భారత్ తరఫున 40 టెస్టులు, 15 వన్డేల్లో ప్రాతినిధ్యం వహించాడు. టెస్టుల్లో 1985 పరుగులు చేసిన గైక్వాడ్.. పాకిస్థాన్‌పై మ్యాచ్‌లో డబుల్ (201) సెంచరీతో అదరగొట్టాడు. ఈ మ్యాచ్‌లో 11 గంటలపాటు క్రీజులో నిలిచిన గైక్వాడ్.. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యంత నెమ్మదిగా ద్విశతకం సాధించిన క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు. అలాగే జమైకా వేదికగా వెస్టిండీస్‌తో టెస్టు మ్యాచ్‌లో మైకేల్ హోల్డింగ్‌లాంటి అరివీర భయంకర పేసర్లను హెల్మెట్ లేకుండా ఎదుర్కొనడం గైక్వాడ్ కెరీర్‌లో ప్రత్యేకమైనది. గైక్వాడ్ రిటైర్మెంట్ అనంతరం టీమిండియా ప్రధాన కోచ్‌గానూ వ్యవహరించాడు. గైక్వాడ్ శిక్షణలో భారత జట్టు 2000 సంవత్సరంలో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో రన్నరప్‌గా నిలిచింది. గైక్వాడ్ మృతిపట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీసీసీఐ కార్యదర్శి జైషా, మాజీ క్రికెటర్లు సంతాపం ప్రకటించారు.

100 మీ. రేసు నుంచి వైదొలగిన షెరికా జాక్సన్



జమైకా స్టార్ అథ్లెట్ షెరికా జాక్సన్ పారిస్ ఒలింపిక్స్‌లో 100 మీటర్ల రేసు నుంచి వైదొలగుతున్నట్టు బుధవారం ప్రకటించింది. కారణమేంటన్నది వెల్లడించని ఆమె.. 200 మీటర్ల రేసులో మాత్రం పోటీపడతానని స్పష్టం చేసింది. 30 ఏళ్ల షెరికా.. గత టోక్యో క్రీడల్లో వంద మీటర్లలో కాంస్య పతకం సాధించింది. షెరికా వైదొలగడంతో ఆమెకు గట్టిపోటీదారుగా భావిస్తున్న అమెరికా స్టార్, ప్రపంచ విజేత షా కారి రిచర్డ్‌సన్‌కు మార్గం సులువయ్యే చాన్సుంది. ఇక, ఈ రేసులో డిఫెండింగ్ చాంపియన్ అయిన ఎలాని థాంప్సన్ హెరా గాయం కారణంగా పారిస్ పోటీలకు దూరమైంది. జమైకాకు చెందిన వెటరన్ స్టార్, రెండుసార్లు ఒలింపిక్ విజేత (2008, 2012) షెల్లీ అన్‌ఫ్రేజర్ కూడా 100 మీటర్ల రేసు బరిలో ఉంది.

ప్రీక్వార్టర్స్‌కు దీపిక

ఫామ్ కోసం తంటాలు పడుతున్న సీనియర్ ఆర్చర్ దీపిక కుమారి ప్రీక్వార్టర్స్‌కు చేరుకొంది. రెండో రౌండ్‌లో దీపిక 6-2తో క్వింటీ రోఫెన్ (నెదర్లాండ్స్)పై సునాయాసంగా నెగ్గి రౌండ్-16కు చేరుకొంది. శనివారం జరిగే ప్రీక్వార్టర్స్‌లో మిషెల్లీ క్రోపన్ (జర్మనీ)తో దీపిక తలపడనుంది. పురుషుల వ్యక్తిగత విభాగం తొలి రౌండ్‌లోనే తరుణ్‌దీప్ రాయ్ వెనుదిరిగాడు. రౌండ్-64లో రాయ్ 4-6తో టామ్ హాల్ (బ్రిటన్) చేతిలో ఓడాడు.

అనూష్ అవుట్..

ఈక్వెస్ట్రియన్‌లో బరిలోకి దిగిన తొలి భారత రైడర్ అనూష్ అగర్వాల ఫైనల్‌కు చేరుకోలేక పోయాడు. ఆసియాడ్ పతక విజేత అనూష్.. డ్రెస్సేజ్ ఈవెంట్ గ్రూప్-ఈ క్వాలిఫయర్స్‌లో 66.444 స్కోరు మాత్రమే చేసి తొమ్మిదో స్థానంలో నిలిచి పతక రౌండ్‌కు అర్హత సాధించలేక పోయాడు. అయితే, ఒలింపిక్స్ డ్రెస్సేజ్ ఈవెంట్‌లో బరిలోకి దిగిన మొదటి భారత ఈక్వెస్ట్రియన్‌గా మాత్రం అనూష్ రికార్డులకెక్కాడు.

పన్వర్‌కు ఆరో స్థానం

పతకం రౌండ్ నుంచి అవుటైన రోయర్ బల్‌రాజ్ పన్వర్.. సింగిల్స్ స్కల్స్‌లో ఆరోస్థానంతో ఫైనల్ 'డి'కి చేరుకొన్నాడు. ఫైనల్ 'డి' అనేది 19-24 స్థానాల వర్గీకరణ ఈవెంట్.



'సూపర్ ఉమన్'

పారిస్ ఒలింపిక్స్ మహిళల రగ్బీ మ్యాచ్‌లో అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. బ్రిటన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ స్టార్ ఎరిన్ కింగ్ 'సూపర్ హ్యూమన్' తరహాలో తన శక్తియుక్తులను ప్రదర్శించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. మరో ఐదు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా.. ప్రత్యర్థి బ్రిటన్ జట్టు క్రీడాకారిణులు బంతిని ఐర్లాండ్ జట్టు సభ్యురాలైన ఎమిలీ లేన్ లక్ష్యంగా విసిరేశారు. దీన్ని పసిగట్టిన ఎరిన్.. లిప్తపాటులో ఎమిలీని అమాంతం పైకి ఎత్తేయడం.. ఆమె బంతిని అందుకోవడం క్షణాల్లో జరిగిపోయాయి. అంతేకాదు, ఎంతబలంగా పైకి ఎత్తుకుందో అంతే చాకచక్యంగా ఎమిలీని గాయాలపాలవకుండా కిందకు దించిన ఎరిన్ 'సూపర్ ఉమన్'ను అనిపించుకుంది. కాగా, ఈ మ్యాచ్‌లో బ్రిటన్ 28 -12తో ఐర్లాండ్‌పై గెలిచింది.

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కా	మొ
చైనా	8	7	3	18
జపాన్	8	3	4	15
ఫ్రాన్స్	7	9	8	24
ఆస్ట్రేలియా	7	4	3	14
బ్రిటన్	6	6	5	17
కొరియా	5	3	3	11
అమెరికా	4	13	12	29
ఇటలీ	3	6	4	13
కెనడా	2	2	3	7
జర్మనీ	2	2	1	5
భారత్	0	0	2	2

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.



అసలంకకే వన్డే పగ్గాలు

కొలంబో: శ్రీలంక జట్టు కొత్త వన్డే కెప్టెన్‌గా చరిత్ అసలంక నియమితుడయ్యాడు. ఆగస్టు 2 నుంచి భారత్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు లంక జట్టును సెలెక్టర్లు బుధవారం ప్రకటించారు. కుశాల్ మెండిస్ స్థానంలో అసలంకకు జట్టు పగ్గాలు అప్పగించారు. హసరంగ తప్పుకోవడంతో.. భారత్‌తో జరిగిన టీ20 సిరీస్‌కు చరిత్ సారథిగా వ్యవహరించాడు. ఇప్పుడు వన్డే కెప్టెన్సీ కూడా అప్పగించారు.

ఉత్సాహం.. ఉద్వేగం.. ఉత్కంఠ !



ఆశలన్నీ చోప్రాపైనే..

నేటినుంచి ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలు

పారిస్: చిరుతల్లా దూసుకుపోయే రన్నర్లు..కిలోమీటర్ల కొద్దీ అలవోకగా నడిచే అథ్లెట్లు..అడ్డంకులను సునాయాసంగా దాటేసే హర్డ్‌లర్లు..ఫ్యాన్స్‌లో ఉత్సాహం, ఉద్వేగం అంతకుమించి ఉత్కంఠ కలిగించే పోటీలు ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లు. ఒలింపిక్స్‌కే తలమానికమైన ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలకు గురువారం తెరలేవనుంది. విశ్వక్రీడల్లో మొత్తం 32 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నా..ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లకు ఉండే క్రేజే వేరు. పురుషులు, మహిళల విభాగాల్లో 23 అంశాల చొప్పున, రెండు మిక్స్‌డ్ ఈవెంట్లు (4x400మీ. మిక్స్‌డ్ రిలే, 35 కి.మీ. మిక్స్‌డ్ రేస్ వాక్) కలిపి మొత్తం 48 అంశాల్లో అథ్లెట్లు ఈసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

వీటికి మరింత క్రేజ్: ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీల్లో 100 మీ. స్ప్రింట్‌కు ఉన్న క్రేజే వేరు. అమెరికన్ ద్వయం నోవా లైల్స్, షా కారీ రిచర్డ్‌సన్ ఈ సారి పురుషులు, మహిళల 100 మీ. పరుగులో హాట్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. పురుషుల విభాగంలో ఇటలీకి చెందిన ఒలింపిక్ చాంపియన్ మార్సెల్ జాకబ్ నుంచి నోవాకు తీవ్ర పోటీ ఎదురయ్యే అవకాశముంది. అమెరికాకే చెంది న ఇరియాన్ నైటన్, లెసిలీ టెబాగో (బోట్స్వానా) కూడా గట్టి పోటీ ఇచ్చే చాన్సుంది. ఇక మహిళల 100 మీ.లలో రెండుసార్లు డిఫెండింగ్ చాంపియన్ ఎలానీ థాంప్సన్ (జమైకా) లేకపోవడం టైటిల్ రేసులో రిచర్డ్‌సన్‌కు కలిసి రానుంది. అలాగే జమైకా స్ప్రింటర్ షెరికా జాక్సన్ ఈసారి 100 మీ.లకు దూరంగా ఉన్నట్టు ప్రకటించడంతో రిచర్డ్‌సన్‌కు మరింత సానుకూలం కానుంది. అయితే ఐదో, ఆఖరి ఒలింపిక్స్‌లో తలపడుతున్న జమైకా క్వీన్ షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్..రిచర్డ్‌సన్‌కు సవాలు విసురుతోంది. ప్రస్తుత ఒలింపిక్ చాంపియన్ అర్మాండ్ డుప్లాంటిస్ పురుషుల పోల్‌వాల్ట్‌లో వరల్డ్ రికార్డుకు గురిపెట్టాడు. మహిళల 400 మీ హర్డిల్స్‌లో సిడ్నీ మెక్‌లాలిన్ ప్రపంచ రికార్డును బద్దలుగొట్టాలని పట్టుదలగా ఉంది. కెన్యా సూపర్ స్టార్ ఫెయిత్ కిపోయేగన్ మహిళల 1500 మీ. పరుగులో చారిత్రక హ్యాట్రిక్ పసిడి పతకమే లక్ష్యంగా నిర్దేశించుకుంది. మహిళల హైజంప్‌లో యరోస్లావా మహూచిక్ గతనెలలో తాను నెలకొల్పిన వరల్డ్ రికార్డును మరోసారి తిరగరాయాలని భావిస్తోంది. చిరకాల ప్రత్యర్థులు ఎలుద్ కిప్చోగే (కెన్యా), కెనీనిసా బెకెలే (ఇథియోపియా) పురుషుల మారథాన్‌లో స్వర్ణం కోసం అమీతుమీ తేల్చుకోనున్నారు.

మొత్తం 29 మంది భారత అథ్లెట్లు ట్రాక్ అండ్ ఫీల్డ్ బరిలో దిగుతున్నారు. 16 పతక విభాగాల్లో మనోళ్లు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నా..జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపైనే అందరి దృష్టి నిలిచింది. టోక్యో ఒలింపిక్స్‌లో చారిత్రక స్వర్ణ పతకం సొంతం చేసుకున్న 26 ఏళ్ల నీరజ్ మళ్లీ ఆ ఫీట్‌తో ఇంకోసారి చరిత్ర తిరగ రాస్తాడని బలంగా విశ్వసిస్తున్నారు. తెలుగు అథ్లెట్లు యర్రాజీ జ్యోతి (100 మీ. హర్డిల్స్), జ్యోతికశ్రీ దండి (4x400మీ. రిలే) తొలి ఒలింపిక్స్‌లో ఎలా రాణిస్తారో చూడాలి.

నేడు బరిలో ప్రియాంక, ఆకాశ్, వికాస్, బిస్త్

ట్రాక్ అండ్ ఫీల్డ్ తొలిరోజు పోటీలలో భారత్ తరఫున ప్రియాంక గోస్వామి మహిళల 20 కి.మీ రేస్ వాక్‌లో, పరమ్‌జీత్‌సింగ్ బిస్త్, ఆకాశ్‌దీప్, వికాస్ సింగ్ పురుషుల 20 కి.మీ. రేస్ వాక్‌లో పోటీపడనున్నారు.

రైతులకిచ్చిన మాట నిలబెట్టుకున్నాం

» రుణమాఫీతో ఉపశమనం కల్పించాం: రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు రుణమాఫీ విషయంలో తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. తమ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండో విడత రుణమాఫీ నిధులను విడుదల చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 6.4 లక్షల మంది రైతు కుటంబాలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రూ.1.5 లక్షల వరకు రుణాలను మాఫీ చేసి.. వారికి ఉపశమనం కల్పిస్తోందన్నారు. రైతులకు రూ.1.5 లక్షల వరకు రుణాలను సీఎం రేవంత్‌రెడ్డి మాఫీ చేసిన నేపథ్యంలో రాహుల్‌గాంధీ బుధవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. రేవంత్ ట్వీట్‌ను రీట్వీట్ చేసి.. రైతులకు అభినందనలు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పంటలకు చట్టబద్ధ మద్దతు ధర కల్పించాలన్న రైతుల డిమాండ్‌ను నిరాకరిస్తూ.. వారిని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోందని, కానీ.. కాంగ్రెస్ మాత్రం దేశంలోని రైతులను ఆదుకునేందుకు సాధ్యమైన ప్రతిచోటా సహాయం అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలకు రండి

» సీఎం రేవంత్‌కు మంత్రాలయం పీఠాధిపతి ఆహ్వానం



హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలకు హాజరు కావాలని మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామిజీ సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎంను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆగస్టు 20, 21, 22 తేదీల్లో ఆరాధనోత్సవాలు జరగనున్నాయని తెలిపారు.

సీఎంను కలిసిన సుభాష్ పాలేకర్

ప్రకృతి వ్యవసాయ నిపుణుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సుభాష్ పాలేకర్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సహజ వ్యవసాయ విధానాలు, రైతులకు అవగాహన కార్యక్రమాల గురించి రేవంత్... పాలేకర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గో ఆధారిత, సహజ వ్యవసాయ విధానాలపై తాను రాసిన పుస్తకాన్ని సుభాష్.. సీఎంకు అందించారు. కాగా పాలేకర్... వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

5 నుంచి స్వచ్ఛదనం.. పచ్చదనం:సీఎం

గ్రామ పంచాయతీల పరిధిలో ఈనెల 5వ తేదీ నుంచి వారం రోజుల పాటు స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, దీంతోపాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన రోజువారి కార్యక్రమాల షెడ్యూల్‌ను రూపొందించాలని బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కను ఆదేశించారు. ఇందుకుగాను రాష్ట్రస్థాయి అధికారులతోపాటు జిల్లా పంచాయతీ అధికారులు, డీఆర్‌డీవో (జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు)లతో మంత్రి సీతక్క గురువారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.

ఆటో, రవాణా కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

» మంత్రి పొన్నంను కలిసిన ఆటో సంఘాల ప్రతినిధులు

హైదరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల కోసం సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ మహాసంఘ్ (ఆటో) ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కలిసి వినతిపత్రం ఇచ్చారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ఖరారు చేసే అధ్యయన కమిటీలో ఆటో సంఘాల ప్రతినిధులకు అవకాశం కల్పించాలని విన్నవించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను సవరించాలని, ఆటో పర్మిట్ నియంత్రణను తొలగించి రాష్ట్రవ్యాప్తంగా పర్మిట్లను జారీ చేయాలని విన్నవించారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆటో సంఘాలతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు.



జస్టిస్ సాంబశివరావు నాయుడును సన్మానిస్తున్న హైకోర్టు బార్ అసోసియేషన్

జస్టిస్ సాంబశివరావు నాయుడుకు వీడ్కోలు

హైకోర్టు జడ్జి జస్టిస్ సాంబశివరావు నాయుడు పదవీ విరమణ నేపథ్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. మొదటి కోర్టు హాలులో నిర్వహించిన ఫుల్ బెంచ్ సమావేశంలో చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ జస్టిస్ నాయుడు న్యాయ వ్యవస్థకు 33 ఏళ్లుగా సేవలందించారని కొనియాడారు. మున్సిఫ్ కోర్టు నుంచి హైకోర్టు వరకు ఆయన ప్రయాణం సాగిందన్నారు. హైకోర్టు జడ్జిగా రెండేళ్ల నాలుగు నెలల వ్యవధిలోనే 3,334 ప్రధాన కేసులు, 3,488 దరఖాస్తులు పరిష్కరించినట్లు తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్‌లో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ నాయుడు దంపతులను సన్మానించారు.

మహబూబాబాద్ ఏడీపీహెచ్‌వోగా గడల

మాజీ ప్రజారోగ్య సంచాలకుడు (డీహెచ్) డాక్టర్ గడల శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. మొన్నటి సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా ఆయన్ను సర్కారు బదిలీ చేసింది. ప్రజారోగ్య విభాగంలో జాయింట్ డైరెక్టర్ క్యాడర్‌లో ఉన్న ఆయనను, ప్రభుత్వం మహబూబాబాద్ అడిషనల్ డిస్ట్రిక్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్(ఏడీపీహెచ్‌వో) గా నియమించింది. ఆయనతోపాటు మరో ముగ్గురు అధికారులు కూడా బదిలీ అయ్యారు. డాక్టర్ సీహెచ్ ధన్‌రాజ్ (ఏడీపీహెచ్‌వో) జనగామ నుంచి సిద్దిపేటకు, డాక్టర్ మనోహర్ సిద్దిపేట నుంచి యాదాద్రి భువనగిరి, డాక్టర్ మల్లికార్జున రావు నిర్మల్ నుంచి జనగామకు బదిలీ అయ్యారు. కాగా, గడల శ్రీనివాసరావు ప్రస్తుతం లాంగ్ లీవ్‌లో ఉన్నారు. ఆయన ఇప్పటికే రెండు సార్లు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేశారు. దానిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.

వారు బదిలీ మినహాయింపునకు అర్హులు కారు

» ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీ డాక్టర్స్ అసోసియేషన్ ఫిర్యాదు

సాధారణ బదిలీల నుంచి కొంత మంది వైద్యులు నిబంధనలకు విరుద్ధంగా మినహాయింపు పొందారని ఎస్సీ, ఎస్టీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ బి.బాబురావు సర్కారుకు ఫిర్యాదు చేశారు. డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ బొంగు రమేశ్, డాక్టర్ లాలు ప్రసాద్ తదితరులు తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లమంటూ లేఖలిచ్చి బదిలీల నుంచి మినహాయింపు పొందారని, ప్రభుత్వం ఇచ్చిన బదిలీల జీవో ప్రకారం ఆ వైద్యులు మినహాయింపులకు అర్హులు కారని బాబురావు పేర్కొన్నారు. పల్లం ప్రవీణ్ 19 ఏళ్లుగా, బొంగు రమేశ్ 17 ఏళ్ల, డాక్టర్ లాలు ప్రసాద్ 12 ఏళ్లుగా హైదరాబాద్‌లోనే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఆరేళ్లకు పైబడి ఒకే జిల్లాలో పనిచేస్తున్న వారిని బదిలీ చేయాల్సి ఉన్నా, అధికారులు వీరిని బదిలీ చేయలేదని తెలిపారు. ఈ అంశంపై మంత్రి దామోదర, సీఎం రేవంత్ స్పందిచాలని ఆయన డిమాండ్ చేశారు. సర్కారుకు స్పందించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వెల్లడించారు.

అభయ హస్తం కాదు భస్మాసుర హస్తం

420 హామీలతో ప్రజలను మోసం చేశారు.. ఉద్యోగాలపై ఓయూకు వెళ్లి నిరుద్యోగుల్ని అడుగుదామా?

» ఒక్క కొలువిచ్చినట్లు వారు చెప్పినా రిజైన్ చేస్తా!
» అంక్షలు, కొర్రీలతో రుణమాఫీలో కోతలు పెడుతున్నారు
» రీకాల్ లేనందున మరో 4 ఏళ్లు వీళ్లను భరించక తప్పదు
» సబితక్క సునీతక్కపై సీఎం నోరుపారేసుకున్నారు: కేటీఆర్
» సీఎం వ్యాఖ్యలపై నేడు నిరసనలు



అసెంబ్లీ వెలుపల సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కేటీఆర్, చిత్రంలో సబిత, సునీత తదితరులు

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో తీయ్యటి, పుల్లటి హామీలిచ్చి.. అధికారంలోకొచ్చిన 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చినవి 420 హామీలని.. ఓట్ల సమయంలో ప్రజలకు అభయ హస్తమిచ్చి.. అధికారంలోకి వచ్చాక భస్మాసుర హస్తంగా పరిణమించారని విమర్శించారు. హామీల విషయంలో ఎన్నికలకు ముందు రజనీకాంత్ తరహాలో మాట్లాడి.. ఆ తర్వాత గజనీకాంత్‌లా మారారని మండిపడ్డారు. "మిమ్మల్ని అభినందించడం కాదు... అభిశంసించాలి. రీకాల్ విధానం లేనందువల్ల మరో నాలుగేళ్లు మిమ్మల్ని భరించక తప్పని పరిస్థితి నెలకొంది" అని రేవంత్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బుధవారం శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై, అనంతరం సభ బయట మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ సర్కారు ఇప్పటిదాకా ఒక్క ఉద్యోగం ఇచ్చినట్లు నిరూపించినా లక్ష మందితో తాము సన్మానం చేస్తామని ప్రకటించారు. తమ హయాంలో 2.32 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని, అందులో 1.8 లక్షల ఉద్యోగాలు తామిచ్చామని పేర్కొన్నారు. తామిచ్చిన నోటిఫికేషన్లలోంచే 30వేల ఉద్యోగాలను ఇచ్చి.. మందికి పుట్టిన బిడ్డను తమ బిడ్డగా చెబుతున్నారని ఆక్షేపించారు. సభను వాయిదా వేసి అశోక్‌నగర్, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళదామని, కాంగ్రెస్ సర్కారు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చినట్లు అక్కడి నిరుద్యోగులు చెబితే తాను రాజీనామా చేసేందుకు సిద్ధం అని ప్రకటించారు. గోబెల్స్ బతికి ఉంటే గనక కాంగ్రెస్ సర్కారు వద్ద ట్యూషన్ చెప్పించుకునేవారని ఎద్దేవా చేశారు. తాము అధికారంలో ఉండగా రూ.లక్ష దాకా మాఫీ చేయడానికి రూ.16 వేల కోట్లు అయ్యాయని, ఇప్పుడు రూ.1.5 లక్షల రుణమాఫీకి రూ.12 వేల కోట్లు ఎలా సరిపోతాయి? అని ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. అంక్షలు, కొర్రీలతో ఎంతోమందిని పథకానికి దూరం చేశారని విమర్శించారు. తాము రైతు బంధును నాట్లు వేసేటప్పుడు ఇస్తే.. కాంగ్రెస్ ఓట్లు వేసేటప్పుడే నిధులు జమచేసిందని ఆక్షేపించారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక ఇప్పటిదాకా 382 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. ఫసల్ బీమా యోజనను మోదీ సొంత రాష్ట్రం గుజరాత్ బేకార్ అంటోందని, అది మనమెందుకు తీసుకోవాలి? అని కేటీఆర్ ప్రశ్నించారు.

బట్టకాల్చి మీదేసే ధోరణి..

బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై మాట్లాడేముందు ఆ పదేళ్లకు ముందున్న పరిస్థితి ఎలా ఉండేదనేదానిపై మాట్లాడాలని ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు. పదేళ్ల క్రితం 4లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర సంపద, ప్రస్తుతం రూ.14.64 లక్షల కోట్లకు చేరిందని వివరించారు. తలసరి ఆదాయంలోనూ దేశంలో తెలంగాణ నంబర్ 1 గా ఉందన్నారు. ఆదాయంగా వచ్చే ప్రతి రూపాయిలో 47పైసలు జీతభత్యాలు, వడ్డీలు, సబ్సిడీలకు వెళుతున్నాయని.. 53 పైసలు అభివృద్ధి పనులకు మిగులుతున్నాయని చెప్పారు. 2014లో రూ.369 కోట్ల మిగులుతో రాష్ట్రం ఇస్తే... 2023లో రూ.5944 కోట్ల రెవెన్యూ మిగులుతో రాష్ట్రాన్ని అప్పగించామని చెప్పారు. జీతాల కోసమూ అప్పు చేయాల్సిన పరిస్థితి ఉందంటూ రాష్ట్రం గురించి ప్రచారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేయడాన్ని ఆపాలని సూచించారు. కాంగ్రెస్ సర్కారు తమపై బట్టకాల్చి మీదేసి బద్నాం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రాన్ని క్యాన్సర్ రోగిలా, ఎయిడ్స్ రోగిలా ఉందని చెబితే బయట నుంచి పెట్టుబడులు వస్తాయా? అని ప్రశ్నించారు.

ఆ 30 వేల ఉద్యోగాలు మీరెందుకు ఇవ్వలేదు: సీతక్క



30 వేల ఉద్యోగాలు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇస్తే.. ఆ ఉద్యోగాలు తామిచ్చిన నోటిఫికేషన్లతో వచ్చాయని కేటీఆర్ చెబుతున్నారని, మరీ ఆ ఉద్యోగాలు పదేళ్ల అధికారంలో ఉండగా ఎందుకివ్వలేకపోయారని మంత్రి సీతక్క ప్రశ్నించారు. తాము అధికారంలోకొచ్చి 8 నెలలు కాలేదని, హామీలు అమలు చేసేందుకు తమకు సమయం ఉందన్నారు. అధికారంలోకి వచ్చాకా పెట్టిన పూర్తిస్థాయి తొలి బడ్జెట్‌కే ఇంత భయపడితే ఎట్లా? అని మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ దళితులను మోసం చేసినంతగా మరెవరినీ చేయలేదని విప్ అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. పదేళ్లలో దళితుల కోసం 73 వేలు కేటాయించి... 28 వేల కోట్లను మాత్రమే బీఆర్ఎస్ ఖర్చు చేసిందన్నారు. దళిత బంధు కోసం 39 వేల కోట్లు ప్రకటించి, రూ.3 వేల కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు.

సీఎంగా రేవంత్ అన్‌ఫిట్

మహిళాసభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని ఉద్దేశించి సీఎం రేవంత్ అసభ్యంగా, హీనాతిహీనంగా మాట్లాడారని.. ఏ నాయకుడు కూడా అంత అసభ్యంగా మాట్లాడరని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీ అక్కలను నమ్ముకుంటే నన్ను ముంచారు. రేపు నీ బతుకూ నిక్కష్టంగా జూబ్లీ బస్‌స్టాండ్ అవుతుంది" అంటూ సీఎం మాట్లాడారని, ఇది ఇద్దరు మహిళా సభ్యులకే కాకుండా రాష్ట్రంలోని మహిళలందరికీ అవమానమని పేర్కొన్నారు. రేవంత్ వెంటనే ఆడబిడ్డలందరికీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియా పాయింట్ వద్దకు కేటీఆర్ వచ్చి ప్రభుత్వానికివ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎంగా రేవంత్ అన్‌ఫిట్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సభ్యులను ఉద్దేశించి నోటికొచ్చినట్లు వాగడం తగదని, సిగ్గు తెచ్చుకుని, బుద్ధి తెచ్చుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి కూడా తమ ఆడబిడ్డలను ఉద్దేశించి ఏ మొహం పెట్టుకుని సభకు వస్తారు అని ఎలా అంటారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కేటీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. సబిత, సునీత లక్ష్మారెడ్డిని ఉద్దేశించి సీఎం వ్యాఖ్యలపై గురువారం నిరసనలు చేపట్టాలని, రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.



సభా పర్వం

'అక్కా.. మా పార్టీలోకి రండి.. సీఎం చేస్తం..'

బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితకు బీజేపీ నేత రాకేశ్‌రెడ్డి ఆహ్వానం

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): 'అక్కా..! మా పార్టీలోకి రండి.. సీఎం చేస్తం..' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఆహ్వానం పలికారు. బుధవారం అసెంబ్లీ లాబీలో ఈ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో సభ వాయిదా పడిన తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలు లాబీలోకి వచ్చారు. ఈ సందర్భంగా వారు మీడియాతో కాసేపు చిట్‌చాట్ చేశారు. సభలో జరిగిన పరిణామాలను మీడియాతో పంచుకున్నారు. మహిళలను అవమానించేలా మాట్లాడిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు క్షమాపణలు చెప్పే వరకూ వదలిపెట్టబోమన్నారు. వారు క్షమాపణలు చెప్పేదాకా సభను కొనసాగనీయబోమని కేటీఆర్ అన్నారు. అనంతరం సబిత బీఆర్ఎస్ఎల్పీ వైపు ఫోన్‌లో మాట్లాడుకుంటూ వెళ్లారు. అయితే ఆమె బీఆర్ఎస్ఎల్పీకాకుండా పక్కనే ఉన్న బీజేఎల్పీ ఆఫీసు తలుపుతట్టారు. అదే సమయంలో అక్కడే ఫోన్ మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి... సబితను చూసి అక్కా.. మా పార్టీలోకి రండి అంటూ ఆమెను ఆత్మీయంగా నవ్వుతూ ఆహ్వానించారు. అయితే ఆమె చిరునవ్వు నవ్వుతూ బీఆర్ఎస్ఎల్పీలోకి వెళ్లిపోయారు. అప్పటికే మీడియాతో చిట్‌చాట్ సాగిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి మాటవిని సరదాగా నవ్వుకున్నారు.

మా ఆవేదన అర్థం కావట్లేదా!



సభలో సీఎం చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలంటూ బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కోవ లక్ష్మీతో పాటు మిగతా ఎమ్మెల్యేలు స్పీకర్ వెల్, పోడియం దగ్గరకు వెళ్లారు. ఆ సమయంలో 'మా ఆవేదన మీకు అర్థం కావడం లేదా' అంటూ గద్గగ స్వరంతో సబిత ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సభ్యులందరికీ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి డైరెక్షన్స్ ఇస్తూ కనిపించారు.

ధరణి పేరు భూమాతగా మార్పు?

సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో ఒకదానికి పీవీ పేరు?

నేడు క్యాబినెట్ భేటీ.. జాబ్ క్యాలెండర్‌పై చర్చ

హైదరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ పేరును భూమాతగా మారుస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో ఒక జిల్లాకు దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు పేరును పెట్టాలని నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గురువారం మధ్యాహ్నం 2:30 గంటలకు శాసనసభ కమిటీ హాల్లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన భేటీ కానున్న రాష్ట్ర మంత్రి వర్గం ఈ అంశాలపైన చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి ధరణి పేరును భూమాతగా మార్చనున్నట్లు కాంగ్రెస్ పార్టీ.. తన ఎన్నికల మేనిఫెస్టోలోనే పెట్టింది. అధికారంలోకి వచ్చాక సమస్యలపై అధ్యయనం కోసం కమిటీని ఏర్పాటు చేసింది. క్యాబినెట్ భేటీలో ఈ అంశాలన్నింటిపైనా చర్చించనున్నట్లు చెబుతున్నారు. రైతు, విద్యా కమిషన్లను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తొలుత ఈ కమిషన్లకు చట్టబద్ధత కల్పించి.. చైర్మన్లకు క్యాబినెట్ హోదా ఇవ్వాలనుకున్నారు. సాంకేతిక కారణాలతో ఆ ప్రతిపాదనను విరమించుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారానే ఈ కమిషన్లను ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ కమిషన్ల ఏర్పాటుపైనా క్యాబినెట్లో చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెబుతున్నారు. తెలంగాణకు చెందిన క్రీడాకారులు.. క్రికెటర్ మహమ్మద్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్‌లకు ఇళ్ల స్థలాలు, గ్రూప్-1 క్యాడర్‌లో ఉద్యోగాల కల్పనపైనా క్యాబినెట్లో నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. జాబ్ క్యాలెండర్‌పైనా క్యాబినెట్ భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే స్థానిక సంస్థలకు ఎన్నికలు, ఈ ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపు తదితర అంశాలపైనా చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

రూ.2 లక్షల లంచం తీసుకుంటూ.. ఏసీబీకి చిక్కిన సీటీవో

అఫ్జల్‌గంజ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆస్తుల మదింపునకు రూ.2 లక్షల లంచం డిమాండ్ చేసిన వాణిజ్య పన్నుల శాఖ అధికారి శ్రీధర్‌ను అవినీతి నిరోధకశాఖ ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కథనం ప్రకారం.. ఉప్పల్ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీని నిర్వహిస్తున్నారు. ఆయన కంపెనీకి చెందిన ఆస్తులను మదింపు చేసేందుకు పంజాగుట్ట సర్కిల్‌కు చెందిన స్టేట్ ట్యాక్స్ అధికారి శ్రీధర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సరైన ఫార్మాట్‌లో దరఖాస్తు చేయలేదంటూ శ్రీకాంత్‌కు శ్రీధర్ నోటీసులు పంపారు. దానికి శ్రీకాంత్ స్పందిస్తూ.. సరైన ఫార్మాట్‌లోనే డాక్యుమెంట్లు ఉన్నాయని వివరిస్తూ సమాధానం ఇచ్చారు. దాంతో శ్రీధర్ 3 లక్షల లంచం ఇస్తేనే పనవుతుందని తేల్చిచెప్పారు. చివరకు రూ.2 లక్షలకు బేరానికి దిగారు. దాంతో శ్రీకాంత్ ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు బుధవారం ఆబిడ్స్‌లోని కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో.. శ్రీధర్‌కు రూ.2 లక్షలు అందజేశారు. ఏసీబీ అధికారులు దాడి చేసి, శ్రీధర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని నుంచి రూ.2 లక్షలను సీజ్ చేశారు.

ఇంజనీరింగ్‌లో ఏఐ, డేటా సైన్స్, ఐటీదే హవా

కంప్యూటర్స్ అనుబంధ 17 కోర్సుల్లో 98% సీట్లు భర్తీ .. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్‌లోనూ పోటాపోటీ

ఇంజనీరింగ్‌లో రెండో విడత సీట్ల కేటాయింపు పూర్తి

హైదరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ప్రవేశాల్లో ఈసారీ కంప్యూటర్స్ అనుబంధ కోర్సుల్లో హవా కొనసాగింది. కంప్యూటర్ సైన్స్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ.. విభాగాల్లో సీట్లు దాదాపు పూర్తయ్యాయి. రెండో విడత సీట్ల కేటాయింపు పూర్తయ్యాక కంప్యూటర్స్ అనుబంధంగా ఉన్న 17 కోర్సుల్లో 61,329 సీట్లలో 60,173 (98.12%) సీట్లు భర్తీ అయ్యాయి. 1,156 సీట్లే మిగిలాయి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా 29,462 సీట్లుండగా.. 29,074 (98.68%) సీట్లు భర్తీ అయ్యాయి. సీఎస్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఎంఐలో 14,081 సీట్లకు 13,778 (97.85%), సీఎస్ డేటా సైన్స్‌లో 7985 సీట్లకు 7,769 (97.29%), ఐటీలో 4,069 సీట్లకు 4,025 (98.92%), సైబర్ సెక్యూరిటీలో 1,621 సీట్లకు 1,580 (97.47%), సీఎస్ ఏఐ, డేటా సైన్స్‌లో 1,479 సీట్లకు 1,424 (96.28%), ఏఐ, ఎంఎల్ ఇంజనీరింగ్ 924కు 895 (96.86%) సీట్లు భర్తీ అయ్యాయి. సీఎస్‌తోపాటు ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ విభాగాల్లోనూ ఈసారి డిమాండ్ నెలకొంది. ఇందులోని మొత్తం 9 విభాగాల్లో కోర్సులుండగా.. 16,573 సీట్లకు 14,895 (89.88%) సీట్లు భర్తీ అయ్యాయి. బయో మెడికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలిమెటిక్స్, ఎలక్ట్రానిక్స్ వీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ కోర్సుల్లో సీట్లన్నీ భర్తీ అయ్యాయి. ఏరోనాటికల్, మెక్‌ట్రానిక్స్, ఆటోమొబైల్, మెటలర్జికల్, మాన్యుఫ్యాక్చరింగ్, థర్మల్ ఇంజనీరింగ్‌లో సీట్లన్నీ భర్తీ కాగా.. మెకానికల్‌లో 3,370 సీట్లకు 2,331 (69.17%), సివిల్‌లో 3,560 సీట్లలో 2,797 (78.57%) పూర్తయ్యాయి. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో 4,731 సీట్లకు 3,625 సీట్లు (76.62%) భర్తీ అయ్యాయి. ఫార్మాసూటికల్ ఇంజనీరింగ్‌లో 69 సీట్లు ఉండగా 23, బయో టెక్నాలజీలో 102 సీట్లకు 62 మాత్రమే భర్తీ అయ్యాయి. మైనింగ్, టెక్స్‌టైల్‌లో సగం కూడా భర్తీ కాలేదు.

రెండో విడత సీట్ల కేటాయింపు పూర్తి...

ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన రెండో విడత సీట్ల కేటాయింపు బుధవారం పూర్తయింది. 175 ఇంజనీరింగ్ కళాశాలల్లో 86,509 కన్వీనర్ కోటా సీట్లు ఉండగా.. ఇందులో రెండు విడతల్లో మొత్తం 81,490 సీట్ల కేటాయింపు పూర్తయింది. ఇంకా 5,019 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కోర్సీలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో 68, 18 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లోని కళాశాలల్లో 893, రెండు ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 15, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 4,043 ఖాళీగా ఉన్నాయి. 7 విశ్వవిద్యాలయాలతోపాటు 80 ప్రైవేటు కాలేజీల్లో 100శాతం సీట్లు పూర్తయ్యాయని ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన తెలిపారు. రెండో విడతలో సీట్లు ఖరారైన విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ ఆగస్టు2లోపు పూర్తి చేయాలని కోరారు. చివరి విడత కౌన్సెలింగ్ ఆగస్టు8 నుంచి ప్రారంభం కానుండగా.. ఆగస్టు13న సీట్లను కేటాయించనున్నారు.

ఎల్ఆర్ఎస్‌కు పచ్చజెండా

(మొదటిపేజీ తరువాయి)

మొదలు.. జీహెచ్ఎంసీ దాకా సిబ్బంది, ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన విధులను నిర్దేశించింది. దీంతో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న 25 లక్షల దరఖాస్తులకు మోక్షం కలగనుంది.

నాలుగు దశల్లో వడపోత

● పెండింగ్/కొత్త దరఖాస్తులను సుపరిపాలన కేంద్రం(సీజీజీ) రూపొందించిన అప్లికేషన్ ద్వారా పరిశీలిస్తారు. ఈ సాఫ్ట్‌వేర్‌లో దరఖాస్తులను నిషేధిత భూములతో పోల్చి.. ఒకవేళ ఆ జాబితాలో ఉంటే తిరస్కరిస్తారు. ఆ తర్వాత సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ ఏఈ, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ లేదా పంచాయతీ ఈవో లేదా స్థానిక సంస్థల సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. దరఖాస్తులో పేర్కొన్న భూములు ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్ భూములు, జలవనరుల ఫుల్ ట్యాంక్ లెవెల్(ఎఫ్‌టీఎల్)లో ఉన్నాయా? అనే విషయాన్ని పరిశీలిస్తారు. వీరి వద్ద ఉండే మొబైల్ యాప్ ద్వారా జీపీఎస్ వివరాలతోపాటు స్క్రూటినీ చేస్తారు. వీరు పంపే దరఖాస్తులను నీటిపారుదల, రెవెన్యూ లేదా టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలిస్తారు. ఈ ముగ్గురూ ఆయా దరఖాస్తులను తిరస్కరించవచ్చు లేదా ఆమోదించవచ్చు లేదా మార్పులతో మరోసారి దరఖాస్తుకు ఆదేశించవచ్చు. ఈ దశలో వడపోత తర్వాత డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు పరిశీలిస్తారు.

● రెండో దశకు చేరుకునే దరఖాస్తులను టౌన్‌ప్లానింగ్ అధికారులు లేదా పంచాయతీ అధికారులు మాస్టర్‌ప్లాన్, రోడ్ల విస్తరణ నిబంధనలు, జోన్ నిబంధనలు, ఖాళీ స్థలాల వివరాలను పరిశీలించి.. అన్నీ సవ్యంగా ఉంటే.. లేఅవుట్లకు ఫీజును నిర్ణయిస్తారు. దరఖాస్తుదారులు నిర్ణీత ఫీజును చెల్లించాక.. మూడోదశ వడపోతకు దరఖాస్తులు వెళ్తాయి.

● మూడో దశకు చేరిన దరఖాస్తులను మునిసిపల్ కమిషనర్లు, పట్టణాభివృద్ధి సంస్థల వైస్ చైర్మన్లు, అదనపు కలెక్టర్లు(స్థానిక సంస్థలు) పరిశీలిస్తారు. దరఖాస్తులో లోపాలుంటే తిరస్కరిస్తారు. వీరు ఆమోదించే దరఖాస్తులు నాలుగోదశకు చేరుతాయి.


● నాలుగోదశలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు.. జిల్లాల్లో కలెక్టర్లు పరిశీలించి ఆమోదిస్తారు. ఈ అన్ని దశల్లో క్షేత్రస్థాయి బృందం ఇచ్చే నివేదిక అత్యంత కీలకమైనది.

నేడు సీఎస్ సమీక్ష

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ఉన్నతాధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) గురువారం సమీక్ష నిర్వహించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ సమీక్షలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు, కలెక్టర్లు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు, పంచాయతీరాజ్, రెవెన్యూ, నీటిపారుదల అధికారులకు సీఎస్ సూచనలు చేయనున్నారు. మునిసిపాలిటీలు, జిల్లాల స్థాయిలో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయనున్నారు.

స్విగ్గీ ఆర్డర్లలో శాకాహారమే టాప్!

» టాప్ టెన్ వంటకాల్లో ఆరు వెజిటేరియనే
» హైదరాబాదీలు మసాలా దోశ, ఇడ్లీ ప్రియులు
» ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ నివేదిక



హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ ద్వారా వినియోగదారులు ఎక్కువగా ఆర్డర్ చేసుకునే వంటకాల్లో శాకాహార వంటకాలే అధికంగా ఉంటున్నాయి. దేశ వ్యాప్తంగా ఉత్తమ శాకాహార వంటకాలు, వాటిని అందించే రెస్టారెంట్లకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చేందుకు గ్రీన్ డాట్ అవార్డుల పేరిట స్విగ్గీ ఓ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా స్విగ్గీకి వచ్చే ఆర్డర్లను విశ్లేషించి ఓ నివేదిక విడుదల చేసింది. దాని ప్రకారం.. స్విగ్గీకి అత్యధిక ఆర్డర్లు వచ్చే టాప్-10 వంటకాల్లో మసాలా దోశ, పన్నీర్ బటర్ మసాలా, మార్గెరిటా పిజ్జా, పావ్ బాజీ సహా ఆరు శాకాహార వంటకాలు ఉన్నాయి. ఇక, దేశంలో సిలికాన్ వ్యాలీగా పేరొందిన బెంగళూరులో స్విగ్గీకి అత్యధికంగా వెజ్ ఆర్డర్లు వస్తున్నాయి. బెంగళూరులో స్విగ్గీకి వచ్చే ప్రతీ మూడు ఆర్డర్లలో ఒకటి శాకాహారం కోసం ఉంటుంది. బెంగళూరు ప్రజలు మసాలా దోశ, పన్నీర్ బిర్యానీ, పన్నీర్ బటర్ మసాలాను ఎక్కువగా ఆర్డర్ చేస్తున్నారు. అత్యధిక వెజ్ ఆర్డర్ల జాబితాలో ముంబై రెండో స్థానంలో ఉండగా హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. ముంబై వాసులు దాల్ కిచిడి, మార్గెరిటా పిజ్జా, పావ్ బాజీ అధికంగా ఆర్డర్ చేస్తుండగా.. హైదరాబాదీలు మసాలా దోశ, ఇడ్లీ ఎక్కువగా తెప్పించుకుంటున్నారు. దేశ వ్యాప్తంగా ఉదయం అల్పాహారం వేళలో ఎక్కువ మంది మసాలా దోశ, వడ, ఇడ్లీ, పొంగల్ ఆర్డర్ చేస్తున్నారు. మసాలా దోశ కోసమైతే ఉదయం నుంచి రాత్రి భోజనం వరకు ఆర్డర్లు వస్తుంటాయని స్విగ్గీ పేర్కొంది.

సబితా ఇంద్రారెడ్డి కంటతడి

(మొదటి పేజీ తరువాయి)



మాట్లాడారని ఆరోపించారు. గతంలో కూడా సోనియాగాంధీతోపాటు చాలా మంది మహిళలను ఇలాగే అవమానించారని, దీనిని బట్టే మహిళలంటే ఆయనకు ఎంత గౌరవం ఉందో తెలుస్తోందని అన్నారు. తన 24 ఏళ్ల రాజకీయ జీవితంలో చాలా మంది సీఎంలను చూశానని, కానీ.. సీఎం కుర్చీనే అవమానించేలా రేవంత్ ఒక్కరే మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఏ మొహం పెట్టుకుని వస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అనడం బాధకలిగిస్తోందన్నారు. సీఎం బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో చాలా మంది పార్టీలు మారతారన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ నాయకులను కాంగ్రెస్‌లో ఎలా చేర్చుకుంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నుంచి తమను ఎలా మెడపట్టి బయటకు నెట్టారో తెలుసునన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై ప్రభుత్వాన్ని నిలదీసినందుకే తనను టార్గెట్ చేశారని చెప్పారు. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వల్లే ఆనాడు తన కుమారుడికి టికెట్ రాలేదని ఆరోపించారు. అసెంబ్లీ నుంచి సీఎం దొంగలా పారిపోయారని ఆరోపించారు. తమ కర్మకాలి అసెంబ్లీకి వచ్చామని వ్యాఖ్యానించారు.

ఎక్కడున్నా కమిట్‌మెంట్‌తో పని చేస్తా: సునీత

తాము ఏ పార్టీలో ఉన్నా కమిట్‌మెంట్‌తో పని చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో మహిళలందరిని అవమానించినట్లేనన్నారు. తాము అధికారంలో ఉన్నా లేకున్నా జెండా మోసిన కార్యకర్తలను కాపాడుకున్నామని చెప్పారు. కాంగ్రెస్ మంత్రి సీతక్క ఏ పార్టీ నుంచి వచ్చారో ప్రజలకు తెలుసునన్నారు. గురువారమైనా సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఏడుపు ఎందుకు సబితమ్మా?: కాంగ్రెస్

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): 'ఏడుపు ఎందుకు సబితమ్మా? చేవెళ్ల చెల్లమ్మా అని కాంగ్రెస్ పార్టీ ఆదరించినందుకా?' అంటూ ఆ పార్టీ బుధవారం అసెంబ్లీలో జరిగిన సంఘటనపై 'ఎక్స్' వేదికగా ప్రశ్నించింది. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంలో హోం మంత్రిని చేసినందుకా? కష్టకాలంలో కాంగ్రెస్‌ను మోసం చేసి పదవి కోసం బీఆర్ఎస్‌లో చేరినందుకా? బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పనిచేసినందుకా? నువ్వు ఏడిస్తే సానుభూతి రాదు సబితమ్మా!' అని కాంగ్రెస్ నేతలు ఆ పార్టీ అధికారిక 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కాగా, పదేళ్ల అధికారంలో ఉన్న కేటీఆర్ ఉద్యోగాల ప్రకటనలకే పరిమితమైతే... సీఎం రేవంత్ రెడ్డి 7 నెలల్లో 30 వేల కొలువులు భర్తీ చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ మహిళల పక్షపాతి అని, ఆడబిడ్డల ఆత్మగౌరవం పెంచిందే సీఎం రేవంత్ రెడ్డి అని ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పేర్కొన్నారు. బుధవారం సభా నాయకుడిని బీఆర్ఎస్ నాయకులు ఏకవచనంతో సంబోధించడాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఖండించారు. సీఎం ప్రసంగంలో మహిళలను అగౌరవపరిచే వ్యాఖ్యలు లేవన్నారు. గతంలో కేసీఆర్ మహిళలను కించపరిచేలా మాట్లాడారన్నారు. మహిళా గవర్నర్‌ను ఇబ్బంది పెట్టిన సందర్భాలు ప్రజలకు తెలుసన్నారు.

ప్రశ్నించడం మా రక్తంలోనే ఉంది: సీతక్క

అడవి బిడ్డలుగా ప్రశ్నించడం తమ రక్తంలోనే ఉందని మంత్రి సీతక్క అన్నారు. పోడు భూముల వ్యవహారంలో తన తండ్రి జైలు జీవితాన్నీ గడిపారన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఓట్ల కోసమే పోడు పట్టాల పంపిణీ జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోడు భూములకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తోందన్నారు. అసెంబ్లీ ఆవరణలో మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

అట్టుడికిన అసెంబ్లీ

అక్కలు ఇక్కడ ముంచి అక్కడ తేలారు.. వారిని నమ్ముకుంటే బస్టాండే గతేనన్న సీఎం వ్యాఖ్యలతో దుమారం

- పోడియం వద్దకు బీఆర్ఎస్ సభ్యులు
- సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్
- కాంగ్రెస్ ఎదురుదాడితో గందరగోళం
- రేవంత్‌పై మండిపడ్డ సబితా ఇంద్రారెడ్డి
- కాంగ్రెస్‌లోకి అక్కగా ఆహ్వానించాను
- నన్నెందుకు టార్గెట్ చేస్తున్నారు?: సబిత



హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శాసనసభ తొలిసారిగా అట్టుడికింది. అధికార, ప్రతిపక్షాల అరుపులు, కేకలు, విమర్శలు, ప్రతివిమర్శల మధ్య బుధవారం ఆద్యంతం వాడివేడిగా జరిగింది. ఒక దశలో ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోడియంను చుట్టుముట్టి నినాదాలు చేయడంతో సభ అదుపు తప్పింది. సభ్యులను గాడిలో పెట్టడానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. బీఆర్ఎస్ సభ్యుడు కేటీఆర్‌కు సమాధానం చెప్పే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ పార్టీ మహిళా సభ్యులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సభలో దుమారం రేపాయి. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. మధ్యలో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా.. వారు పట్టించుకోలేదు. దీంతో అధికార కాంగ్రెస్ సభ్యులు కూడా ముందుకు వచ్చి, సీఎంకు, డిప్యూటీ సీఎంకు బాసటగా నిలిచారు. ఇరు పక్షాల అరుపులు, గందరగోళం మధ్యే 'ద్రవ్య వినిమయ బిల్లు-2024' సభ ఆమోదం పొందింది. శాసనసభ ఉదయం 10 గంటలకు ప్రారంభం కాగానే డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టారు. దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చర్చను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతుండగానే ఉదయం 11.30 గంటల ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి సభలోకి ప్రవేశించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలంటూ కేటీఆర్ డిమాండ్ చేస్తుండగా.. మధ్యలో రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని మాట్లాడారు. "ప్రతిపక్ష సభ్యులు కలిసివస్తారనుకున్నాం. కానీ, ప్రతిపక్ష నేత సభకు రారు. కేటీఆర్‌కు సూచన చేస్తున్నా. వెనుక ఉన్న అక్కలు ఇక్కడ ముంచి అక్కడ తేలారు. వాళ్లను నమ్ముకుంటే జూబ్లీ బస్టాండులో కూర్చోవాల్సిందే" అని రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఒక్కసారిగా గందరగోళానికి దారితీశాయి. తమను ఉద్దేశించే సీఎం ఈ వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కుర్చీల్లోంచి లేచి నిరసన తెలిపారు. వెల్‌లోకి దూసుకొచ్చి పోడియంను చుట్టుముట్టారు.

రేవంత్‌ను అక్కగా ఆహ్వానించా..

మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకుని.. ముఖ్యమంత్రి ఎవరి గురించీ ప్రస్తావించలేదని, ఒక సూచన, సలహా మాత్రమే ఇచ్చారని అన్నారు. సజావుగా నడుస్తున్న సభను పక్కదారి పట్టిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై మండిపడ్డారు. మంత్రి సీతక్క జోక్యం చేసుకుని.. తనను మోసం చేసిన అక్కలతో జాగ్రత్తగా ఉండాల్సిందిగా కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి సూచన చేశారని చెప్పారు. మీతో కలిసి వస్తానంటూ సబితా ఇంద్రారెడ్డి చెప్పడంతో రాహుల్‌గాంధీతో మాట్లాడి ఢిల్లీకి తీసుకెళ్లాలనుకున్నామని, కానీ.. ఇంతలో సబిత హ్యాండిచ్చారని ఆరోపించారు. పైగా.. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోండంటూ సబితతోనే గవర్నర్‌కు ఫిర్యాదు చేయించారని ధ్వజమెత్తారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సబితా ఇంద్రారెడ్డి గద్గద స్వరంతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి తననెందుకు టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు. ఓ అక్కగా 'కాంగ్రెస్‌లోకి రా తమ్ముడూ' అని రేవంత్‌ను ఆహ్వానించానని, కాంగ్రెస్‌లో ఆశాకిరణం అవుతావని, సీఎం అవుతావని ఆశీర్వదించానని తెలిపారు. దీంతో సీఎం రేవంత్ మళ్లీ కల్పించుకుంటూ.. తనను మోసం చేసిన సబితక్కతో జాగ్రత్తగా ఉండాల్సిందిగా కేటీఆర్‌కు సూచన చేశానని అన్నారు. "సబితక్క నన్ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించిన మాట వాస్తవం. 2019లో మల్కాజిగిరి నుంచి పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ నన్ను కోరింది. అక్కడి నుంచి పోటీ చేస్తే అండగా ఉంటానని సబితక్క నాకు మాట ఇచ్చారు. కానీ, కాంగ్రెస్ పార్టీ నన్ను అభ్యర్థిగా ప్రకటించగానే.. ఆమె బీఆర్ఎస్‌లోకి వెళ్లి మంత్రి పదవి పొందారు" రేవంత్ అన్నారు. కొత్త గవర్నర్‌ను విమానాశ్రయానికి వెళ్లి రిసీవ్ చేసుకోవాల్సి ఉందని, తిరిగి వచ్చిన తర్వాత అందరికీ కలిపి సమాధానం చెబుతానని చెప్పి సభ నుంచి సీఎం బయటికి వెళ్లారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లేచి.. బీఆర్ఎస్‌పై ఎదురుదాడి చేశారు.

ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం..

మధ్యలో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ కల్పించుకొని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క.. సబితా ఇంద్రారెడ్డి పేరు పెట్టి మాట్లాడినందున.. ఆమెకు తిరిగి మాట్లాడే హక్కు ఉందన్నారు. అయితే ముగ్గురు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు పోడియం వద్ద నేలపై కూర్చుని నిరసన కొనసాగిస్తుండడంతో స్పీకర్ మైక్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్యే జి.వివేక్‌కు ఇచ్చారు. కాగా, ఆయన ప్రసంగం మొదలుపెట్టి.. ముగించేదాకా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళన కొనసాగుతూనే ఉంది. మరోవైపు కాంగ్రెస్ సభ్యులు కూడా తీవ్రంగా ప్రతిస్పందించారు. ఈ గందరగోళం మధ్యే స్పీకర్ అనుమతితో ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించాలంటూ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సభను కోరారు. దీంతో మూజువాణి ఓటుతో బిల్లును సభ ఆమోదించింది. ఈ సందర్భంలో భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ఈసారి పీపుల్స్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని అన్నారు. దీని పట్ల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తుంటే బీఆర్ఎస్ తట్టుకోలేకపోతోందని ఆరోపించారు. అనంతరం సభను గురువారానికి స్పీకర్ వాయిదా వేశారు.

ఏ మొహం పెట్టుకుని మాట్లాడుతున్నారు?



సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నత పదవులు అనుభవించారని, ఆ తర్వాత పార్టీని వదిలి బీఆర్ఎస్‌లో చేరారని భట్టివిక్రమార్క విమర్శించారు. దళితుడినైన తాను ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు.. ఆమె బీఆర్ఎస్‌లో చేరి, తాను ఆ హోదా కోల్పోవడానికి కారకులయ్యారని తెలిపారు. సబితకు 2004, 2009లో కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవులు ఇచ్చిందని గుర్తు చేశారు. దశాబ్దకాలంపాటు మంత్రి పదవులు అనుభవించిన సబితా ఇంద్రారెడ్డి.. తనను ప్రతిపక్ష నేతగా నిలబెట్టాల్సిందిపోయి.. అధికారం కోసం పార్టీ మారారని ఆరోపించారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. దీంతో సభ మరోసారి హీటెక్కింది. సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో.. మధ్యాహ్నం 1.15 గంటల ప్రాంతంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభను 10 నిమిషాలపాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం సభ పునఃప్రారంభం కాగా.. మళ్లీ అదే సీన్ రిపీట్ అయింది. సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబిత, సునీతా లక్ష్మారెడ్డి వెల్‌లోకి దూసుకెళ్లారు. వీరితోపాటు కోవ లక్ష్మి, కేటీఆర్, కౌశిక్‌రెడ్డి, కమలాకర్ తదితరులు పోడియం వద్దకు దూసుకొచ్చారు. మహిళా ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు.



సభా పర్వం

పోచారం నివాసంలో విందు

» హాజరైన సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో అందుబాటులో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలకు విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సైతం పాల్గొన్నారు. అయితే పోచారంతోపాటు కాంగ్రెస్‌లో చేరిన పలువురు ఎమ్మెల్యేలు విందుకు హాజరయ్యారు. కానీ.. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాత్రం ఈ విందుకు హాజరు కాలేదన్న ప్రచారం జరుగుతోంది.

భట్టి ఏనాడూ చెప్పుకోలేదు!

» ఆయన బాధ అర్థమవుతోంది: దుద్దిళ్ల

హైదరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): "డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఏనాడూ తన సామాజిక వర్గం పేరు చెప్పుకోలేదు.. వాడుకోలేదు. కానీ నిండు సభలో తాను దళితుడిననే పదం వాడారంటే ఆయన ఎంత బాధతో మాట్లాడారో అర్థం అవుతుంది" అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో బుధవారం దుద్దిళ్ల మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనకు జరిగిన అన్యాయంపై ఐదేళ్ల తర్వాత మొదటి సారి భట్టి నోరు విప్పారని పేర్కొన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు.

అన్నా రావొచ్చు కదా!

స్పీకర్ పోడియం వద్ద నిరసన తెలుపుతున్న సమయంలో ఎమ్మెల్యే సబిత... సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని వైపు తిరిగి 'అన్నా రావొచ్చు' కదా అని కోరారు. సభ గురువారానికి వాయిదా పడ్డ తర్వాత కూడా సబిత, కోవ లక్ష్మి, సునీతాలక్ష్మారెడ్డి మరో సారి కూనంనేని వద్దకు వెళ్లి మాట్లాడారు. కాగా, ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ పెట్టిన వాయిదా తీర్మానం.. ఈ నిరసన కారణంగా తిరస్కరణకు గురైంది.

మీరు జెంటిల్‌మన్.. ఏంటిలా?

స్పీకర్ పోడియం దగ్గర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టే కేటీఆర్ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఆయన్ను ఉద్దేశించి స్పీకర్ మాట్లాడుతూ 'సభలో మీరు జెంటిల్‌మన్.. మీరు కూడా ఇలా వ్యవహరిస్తే ఎలా?' అని ప్రశ్నించారు. హౌజ్ మీది.. మేమంతా మీకు సమానమా? కాదా? చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

కొందరు ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు!

కోమటిరెడ్డి, సంపత్ కుమార్ సభ్యత్వం రద్దు కాలేదా?.. నన్ను కూడా ఏ ఒక్కరోజూ అసెంబ్లీలో ఉండనివ్వలేదు

» బీఆర్ఎస్ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి పరోక్ష హెచ్చరిక



హైదరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): సమయం, సందర్భాన్ని బట్టి కొందరు ఎమ్మెల్యేల సభ్యత్వాలూ రద్దు కావచ్చునని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ తొలి శాసనసభలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా కుర్చీలో నుంచి లేచి నిలుచున్నారన్న కారణంతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ సభ్యత్వాలను రద్దు చేశారని, అప్పుడు వారు స్పీకర్ పోడియం వద్దకు కూడా వెళ్లలేదని.. 2014 నుంచి 2018 వరకూ ఏ ఒక్క సమావేశంలోనూ తనను ఉండనీయ లేదని, సభకు వచ్చిన వెంటనే తీసుకెళ్లి బయటకు తోసేశారని గుర్తు చేశారు. ఇప్పుడూ సభ్యుల శాసనసభ సభ్యత్వాలను స్పీకర్ రద్దు చేసినా చెయ్యవచ్చన్నారు. సభలో సస్పెన్షన్లు, బహిష్కరణలు, మార్షల్స్ అవసరం రావద్దనే తాను కోరుకుంటున్నానన్నారు. అసెంబ్లీలోని తన చాంబర్లో బుధవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన రేవంత్.. శాసనసభ సభ్యత్వాల రద్దుపై బీఆర్ఎస్ నేతలకు పరోక్ష హెచ్చరికలు జారీ చేశారు. 'ఈ సంప్రదాయం మన దగ్గర ఇప్పటికే వచ్చింది కదా?' అని వ్యాఖ్యానించారు. శాసనసభలో గత ప్రభుత్వం తీసుకువచ్చిన రకరకాల సంప్రదాయాల్లో ఏ సంప్రదాయాన్నయినా మనం తీసుకోవచ్చునన్నారు. అలాగే.. "నన్ను కాంగ్రెస్‌లోకి రమ్మని ఆహ్వానించిన సబితక్క.. నాకు అండగానిలబడకుండా బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిందంటే ఈ తమ్ముణ్ని అనాథను చేసినట్లే కదా?" అని సీఎం వ్యాఖ్యానించారు. అలాగే 2018 ఎన్నికల్లో సునీతక్క తరఫున ప్రచారానికి వెళితే అప్పటి ప్రభుత్వం తనపై రెండు కేసులు పెట్టించిందన్నారు. కౌడిపల్లి, నర్సాపూర్ పోలీస్ స్టేషన్లలో ఆ కేసులు ఇప్పటికీ ఉన్నాయన్నారు. తాను కేసుల చుట్టూ తిరుగుతూ ఉంటే.. సునీతక్క మాత్రం మహిళా కమిషన్ చైర్మన్ పోస్టు తీసుకుని, ఆ తర్వాత ఎమ్మెల్యే కూడా అయ్యారన్నారు. అక్కల మాట నమ్మి మోసపోవద్దనే తాను శాసనసభలో కేటీఆర్‌కు చెప్పానని, వారి పేర్లు ఎక్కడా ప్రస్తావించలేదని వివరించారు. రేవంత్‌ను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకువచ్చినందుకు తన కొడుకుకు రాజేంద్రనగర్ టిక్కెట్టు రాకుండా ఉత్తమ్ అడ్డుపడ్డారన్న సబిత వ్యాఖ్యలపై స్పందిస్తూ.. అప్పుడు పొత్తులో భాగంగా రాజేంద్రనగర్ సీటు టీడీపీకి కేటాయించారని గుర్తు చేశారు. 2014ఎన్నికల్లో సబితక్కకు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టు ఇవ్వలేదని, కానీ 2018 ఎన్నికల్లో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. పెద్ద మనసు చేసుకుని ఆమెకు టిక్కెట్టు ఇచ్చారన్నారు. ఉత్తమ్‌పైన ఆమె ఆ ఔదార్యం ఎందుకు చూపట్లేదని ప్రశ్నించారు. సబితక్కకు సభలో నిజంగా అవమానం, అన్యాయం జరిగితే.. ఆమె ఆవేదన చెందితే.. సభకు వచ్చి అండగా నిలబడాల్సిన కేసీఆర్, హరీశ్‌రావు ఎందుకు దుమ్మా కొట్టారని ప్రశ్నించారు. తన పార్టీ సభ్యులను పట్టించుకోకుండా కేసీఆర్ ఎందుకు పత్తా లేకుండా పోయారని ప్రశ్నించారు. "సభలో మాట్లాడేందుకు కేటీఆర్, హరీశ్ చాలనుకుంటే.. బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా కేసీఆర్‌ను ఎందుకు పెట్టుకున్నట్లు? ఆ పదవి నుంచి ఆయన్ను తొలగించండి!" అని సూచించారు. శాసనసభ నడపడంలో తాము ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరిస్తున్నామని స్పష్టం చేసిన సీఎం.. బడ్జెట్, డిమాండ్లపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులకు అనుకున్న దాని కంటే ఎక్కువ సమయమే ఇచ్చామన్నారు.

సభలో వాగ్యుద్ధం..

ద్రవ్య వినిమయ బిల్లుపై బుధవారం అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. "కృత్రిమమేధకు, కేటీఆర్‌కు పోలిక ఏమిటంటే.. కేటీఆర్ 100 శాతం ఆర్టిఫిషియల్, సున్నా ఇంటెలిజెన్స్" అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. దీనికి ఘాటుగా స్పందించిన కేటీఆర్.. తనను అలా అన్నా బాధ లేదని, తనను తన తండ్రి బాగా చదివించారని, తనకు రెండు డిగ్రీలు ఉన్నాయని, రేవంత్ ఏం చదివారో మాత్రం తనకు తెలియదని వ్యాఖ్యానించారు. తొలుత కేటీఆర్ మాట్లాడుతూ.. మగ్గంపై మళ్లీ మరణ మృదంగం మోగుతోందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సిరిసిల్లలో ఇప్పటివరకు 15 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. బతుకమ్మ చీరల పంపిణీని, గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీని నిలిపివేశారన్నారు. దీనికి రేవంత్.. "కేటీఆర్ సభను తప్పుదోవ పట్టించటానికి సమయాన్ని వినియోగించుకుంటున్నారు. సూచన అనే ముసుగులో మోసం అనే ప్రణాళికను ప్రజల మెదళ్లలో జొప్పిస్తున్నారు. బతుకమ్మ చీరల పథకంలో అవినీతి జరిగింది. నేత కార్మికులకు పని కల్పించామంటూ అబద్ధాలు చెప్పారు. పథకాన్ని ప్రారంభించిన 2017-18 సంవత్సరంలో సూరత్ నుంచి చీరలు తెప్పించారు. కిలోల కొద్దీ చీరలను కొని, కమీషన్లు దండుకున్నారు. సిరిసిల్ల నేతన్నలకు రూ.275కోట్లు బకాయి పడ్డారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.100కోట్లు చెల్లించాం" అని వ్యాఖ్యానించారు. అలాగే.. తాము ఫార్మాసిటీ అనకుండా ఫార్మా విలేజెస్ అంటున్నామని.. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత అక్కడి 4000 ఎకరాల్లో నాల్గో సిటీని అభివృద్ధి చేస్తున్నామని, స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ, హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటుచేసి ప్రపంచస్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తెస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ చీల్చి చెండాడుతానని అనడంతో తాము సభకు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకుని వచ్చామని ఎద్దేవా చేశారు. రెండు గంటలపాటు మాట్లాడిన కేటీఆర్.. విషం చిమ్మడం తప్ప ప్రజలకు మేలు చేసేలా మాట్లాడలేదని ఆరోపించారు. ఇలాగైతే ప్రజలు వారిని సభలో కూడా ఉండనివ్వరని వ్యాఖ్యానించారు. దీనికి కేటీఆర్.. అదృష్టం బాగుండి రేవంత్ సీఎం అయ్యారని వ్యాఖ్యానించారు. గతంలో ఆయన, తాను మంచి స్నేహితులమేనని.. కానీ, గత పదేళ్లుగా చెడిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన రేవంత్‌ను ఏకవచనంతో సంబోధించడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. దీంతో ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని కేటీఆర్ చెప్పాల్సి వచ్చింది. మళ్లీ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... తాను రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నానని, గుంటూరులో చదువుకోలేదని.. 610 జీవో, ముల్కీ రూల్స్ ప్రకారం ఉద్యోగాలకు కేటీఆర్‌కు అర్హత లేదని అన్నారు. ఇందుకు కేటీఆర్.. 610 జీఓ, ముల్కీ రూల్స్ ప్రభుత్వ ఉద్యోగాలకు అవసరమని, తాను ప్రైవేటు రంగంలో ఉద్యోగం చేశానని బదులిచ్చారు. మొదటి సంవత్సరం పాక్షికంగా సూరత్ నుంచి బతుకమ్మ చీరలను తెప్పించిన మాట వాస్తవమేనని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వచ్చినంతమాత్రాన..

బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు తన వద్దకు వచ్చి అరగంట పాటు కూర్చుని వెళ్లారని, చాలా విషయాలు తనతో మాట్లాడారని సీఎం రేవంత్ వెల్లడించారు. తన వద్దకు వచ్చి వెళ్లినంత మాత్రాన వారు ఇటు వచ్చేసినట్లు కాదన్నారు. అలాగే తమవాళ్లు కేటీఆర్‌ను కలిసినంత మాత్రాన అటు పోయినట్లు కాదన్నారు. గద్వాల ఎమ్మెల్యే తిరిగి బీఆర్ఎస్‌లో చేరనున్నారన్న వార్తలపై సీఎం ఇలా స్పందించారు.

ఆర్ అండ్ బీ శాఖలో బదిలీలు పూర్తి

» అటవీశాఖలో డీఎఫ్‌వోలు, ఏసీఎఫ్‌ల బదిలీలు కూడా

» నేటి నుంచి బదిలీలపై నిషేధం.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖలో అధికారుల బదిలీల ప్రక్రియ బుధవారం పూర్తయింది. 40శాతం మేర సిబ్బందినే బదిలీ చేయాలన్న నిబంధనతోపాటు స్పౌజ్ కోటా, వికలాంగులు, ఏడాదిలో పదవీ విరమణ పొందే వారితోసహా ఇతర నిబంధనలను పాటిస్తూ అధికారులు బదిలీ ప్రక్రియను పూర్తిచేశారు. ఇందులో భాగంగా 24 మంది ఈఈలు, 86 మంది డిప్యూటీ ఈఈలు, ఏఈఈ/ఏఈలు మల్టీజోన్-1లో 71 మంది, మల్టీజోన్-2లో 76 మంది, ఎలక్ట్రికల్ విభాగంలో 2పోస్టులు.. మొత్తం 259 మంది బదిలీ అయ్యారు. మరోవైపు అటవీశాఖలోనూ అధికారుల బదిలీ ప్రక్రియ పూర్తయింది. జిల్లా అటవీ అధికారులు (డీఎఫ్‌వో), అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ఏసీఎఫ్)ల స్థాయిల్లో 20మంది అధికారులకు స్థానచలనం కలిగింది. వీరిలో 8 మంది డిప్యూటీ కన్జర్వేటర్లు, 12 మంది అసిస్టెంట్ కన్జర్వేటర్లున్నారు. వీరు బుధవారం బాధ్యతలు చేపట్టారు. కాగా ఉద్యోగుల బదిలీలకు ఇచ్చిన గడువు బుధవారంతో ముగియడంతో ఆగస్టు 1వ తేదీ నుంచి బదిలీలపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అవినీతి కేసుల్లో కోర్టు విచారణకు ఏడేళ్ల సమయం

» ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అవినీతి కేసుల్లో కోర్టు విచారణ ప్రారంభం కావడానికి కనీసం 6-7 ఏళ్లు పడుతుందని ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్ తెలిపారు. 2013లో ఆదిలాబాద్ జిల్లా వాంఖిడి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన లచ్చన్న ఓ కేసు విషయంలో రూ.10వేలు లంచం తీసుకుంటు ఏసీబీకి చిక్కాడు. విచారణ అనంతరం కరీంనగర్ ఏసీబీ కోర్టు లచ్చన్నకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.12వేల జరిమానా విధిస్తు బుధవారం తీర్పు వెలువరించింది. దీనిపై సీవీ ఆనంద్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. అవినీతి కేసుల్లో నిందితుడికి ఐదేళ్లు శిక్ష పడటం అరుదైన విజయం అన్నారు. సాధారణంగా 3 సంవత్సరాల వరకు శిక్ష పడుతుందన్నారు. అయితే ట్రాప్ చేసి, ప్రభుత్వ ఉద్యోగుల్ని అరెస్ట్ చేసిన తర్వాత ఏం జరుగుతుందని ప్రశ్నిస్తున్న చాలా మందికి ఈ సందర్భంగా ఏసీబీ పనితీరును ఆనంద్ వివరించారు. 'నిందితుడైన ఉద్యోగికి కోర్టు రిమాండ్ విధించిన తర్వాత ఏసీబీ అన్ని సాక్ష్యాలు సేకరిస్తుంది. తర్వాత ప్రాసిక్యూషన్ అనుమతి కోసం విజిలెన్స్ కమిషన్ నుంచి ప్రభుత్వానికి లేఖ వెళ్తుంది. ప్రభుత్వ అనుమతి లభించిన తర్వాత అన్ని ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేస్తారు. కోర్టులో విచారణ ప్రారంభం కావడానికి 6-7 సంవత్సరాలు పడుతుంది. విచారణ పూర్తి చేసుకుని శిక్ష పడేందుకు 10 సంవత్సరాలు పడుతుంది' అని ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్ 'ఎక్స్' వేదికగా వివరించారు.

సాయి వెంకట కిషోర్ సస్పెన్షన్ కొనసాగింపు

ఇన్‌స్పెక్టర్ ఎం.సాయి వెంకట కిషోర్ సస్పెన్షన్ కొనసాగిస్తూ ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సంగారెడ్డి సీసీఎస్‌లో పనిచేస్తూ సస్పెండ్ అయిన సాయి వెంకట కిషోర్ గత జూలై 23న ఏసీబీ అధికారులకు పట్టుబడి అరెస్ట్ అయ్యారు. గతంలో సస్పెండ్ అయినప్పటికీ పద్ధతి మారకపోవడం, లంచం కేసులో అరెస్ట్ కావడం వల్ల ఆయనపై విశ్వసనీయత కోల్పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐజీ వెల్లడించారు. సాయి వెంకట కిషోర్ విషయంలో తదుపరి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

టెకీ రేప్ కేసులో మరో నిందితుడి అరెస్టు

వనస్థలిపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో మరో నిందితుడు శివాజీరెడ్డి అలియాస్ చింటూరెడ్డిని బుధవారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అత్యాచార ఘటన తర్వాత చింటూరెడ్డి పరారయ్యాడని.. అతడిని పట్టుకోవడానికి నాలుగు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి అదుపులోకి తీసుకున్నామని వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి వెల్లడించారు. అతడిని విచారిస్తున్నట్లు తెలిపారు. చింటూరెడ్డిది చౌటుప్పల్ మండలం ఆరెగూడెం. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే అతడు.. గతంలో వార్డు సభ్యుడిగా కూడా పనిచేశాడు. ఈ నేపథ్యంలోనే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అనుచరుడనే పేరు వినిపిస్తోంది. పలు కార్యక్రమాల్లో రాజగోపాల్‌రెడ్డితో చింటూరెడ్డి దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇటు ప్రధాన నిందితుడు ఎడ్ల గౌతంరెడ్డిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే.

వామపక్షాల వైఫల్యం వల్లే మతోన్మాదం

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కమ్యూనిస్టుల ధోరణి మారాలి: కె.నాగేశ్వర్
- 'మతోన్మాదం-సెక్యులరిజం'పై వామపక్షాల రాష్ట్ర సదస్సు

హైదరాబాద్ సిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): మతోన్మాద శక్తులు సమాజంలో ఇంతలా ప్రబలడానికి వామపక్ష, ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తుల వైఫల్యమే కారణమని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. మరీ ముఖ్యంగా 'మత జాతీయవాదం' వ్యాప్తికి కమ్యూనిస్టులు చాలా దోహదం చేశారని విమర్శించారు. జాతీయవాదంలోని సమస్యలను గుర్తించకుండా 1960ల్లో కమ్యూనిస్టులు తాము అందరి కంటే ఎక్కువ జాతీయవాదులమని నిరూపించుకోవడానికి ప్రయత్నించారన్నారు. ఇన్నాళ్లుగా సెక్యులరిజం పేరుతో చేస్తున్న వాదనలు, ఆచరణ సక్రమమైనవి కాదన్నారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య కళానిలయంలో 'మతోన్మాదం-సెక్యులరిజం' అంశంపై సదస్సు జరిగింది. తెలంగాణ చరిత్రను మతతత్వ శక్తులు పూర్తిగా వక్రీకరించి, ప్రచారం చేస్తుంటే కమ్యూనిస్టు పార్టీలు మొదట ఎందుకు మౌనంగా ఉన్నాయని కె. శ్రీనివాస్ నిలదీశారు. బీజేపీకి లోక్‌సభ సీట్లు తగ్గినా భావజాలపరంగా వాళ్లు మరింత దూకుడుగా వెళ్లే ప్రమాదం లేకపోలేదన్నారు. అందుకు యూపీలోని కావడి యాత్ర పేరుతో సాగుతున్న రభసే నిదర్శనమన్నారు. మరో ముఖ్య వక్త ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ మత ఛాందసవాదుల్లాగే కమ్యూనిస్టుల్లోనూ తాము చెప్పిందే సత్యమని వాదించే వారున్నారని, ఆ ధోరణి మార్చుకోవాలని హితవు పలికారు. దేవుడు, మతం విషయాల్లో వామపక్షవాదులు నాస్తికుల్లా వ్యవహరించడం సరికాదన్నారు. మెజారిటీ మతమైనంత మాత్రాన, వారి విశ్వాసాలను అవహేళన చేయకూడదన్నారు. బీజేపీని ఎదుర్కోవాలంటే పోరాడాల్సింది దేవుడిపై కాదన్నారు. సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.



వామపక్షాల సదస్సులో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్. చిత్రంలో ప్రొఫెసర్ నాగేశ్వర్, చాడ వెంకట్‌రెడ్డి తదితరులు

ఐరాస ప్రపంచ యూత్ కాన్ఫరెన్స్‌కు తెలంగాణ గురుకుల విద్యార్థిని ఎంపిక


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కత్యపాగ మెరల్ మేరబ్

మొయినాబాద్ రూరల్, జూలై 31: మలేషియాలో ఆగస్టు 2 నుంచి 5వ తేదీ వరకు జరగనున్న ఐక్యరాజ్యసమితి ప్రపంచ యూత్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు తెలంగాణ గురుకుల విద్యార్థిని ఎంపికయింది. ఆ విద్యార్థినిని బుధవారం తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల కేంద్రంలోని స్థానిక మెథడిస్టు చర్చి పాస్టర్‌గా పనిచేస్తున్న కృపవరం కూతురు కత్యపాక మెరల్ మేరబ్. ఆమె ఇబ్రహీంపట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ప్రస్తుతం ఆమె పీజీ కోర్సులో చేరేందుకు సిద్ధమవుతోంది. అయితే మెరల్ మేరబ్ డిగ్రీ ఆఖరి ఏడాదిలో ఉన్నప్పుడు ఐక్యరాజ్యసమితి నిర్వహించిన రాత పరీక్ష, ఇంటర్వ్యూలో పాల్గొంది. దాంతో ఆమె ప్రపంచ యూత్ కాన్ఫరెన్స్‌కు ఎంపికయింది.

కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని న్యాయస్థానం మరోసారి పొడిగించింది. సీబీఐ కేసుతోపాటు మనీలాండరింగ్ కేసులోనూ కవిత కస్టడీ బుధవారంతో ముగిసింది. దీంతో తిహాడ్ జైల్లో ఉన్న ఆమెను వర్చువల్‌గా ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచారు. ఇదే కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాలను సైతం జైలు అధికారులు వర్చువల్ విధానంలో జడ్జి కావేరి బవేజా ఎదుట ప్రవేశ పెట్టారు. కవిత, కేజ్రీవాల్, సిసోడియాల జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని సీబీఐ, ఈడీ తరఫు న్యాయవాదులు కోరారు. సీబీఐ కేసులో ఆగస్టు 9 వరకు, ఈడీ కేసులో 13 వరకు ముగ్గురి కస్టడీని పొడిగిస్తున్నట్లు జడ్జి ప్రకటించారు.

రూ.300 కోట్లు గోల్‌మాల్ !

- మహేష్ కో-ఆపరేటీవ్ బ్యాంకు కేసు
- హైదరాబాద్‌లో ఈడీ సోదాలు

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):మహేష్ కో-ఆపరేటీవ్ బ్యాంకులో రూ.300 కోట్ల నిధుల గోల్‌మాల్‌కు సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మహేష్ కో-ఆపరేటీవ్ బ్యాంకు ప్రమోటర్ల ఇళ్లు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బుధవారం సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌లోని ఆరు వేర్వేరు ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ సోదాలు జరిగాయి. నకిలీ పత్రాలు సృష్టించడం, నిబంధనలకు విరుద్ధంగా రూ.300 కోట్లకుపైగా రుణాల మంజూరు, బ్యాంకు నుంచి రూ.18.30 కోట్లు దారి మళ్లింపు ఆరోపణలపై ఈడీ విచారణ చేస్తోంది. ఇందులో భాగంగా బ్యాంకు చైర్మన్ రమేష్ కుమార్ బంగ్, వైస్ చైర్మన్ పురుషోత్తమదాస్, ఎండీ ఉమేష్ చంద్‌కు సంబంధించిన ప్రాంతాల్లో సోదాలు చేసిన ఈడీ బృందాలు కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలను సేకరించాయి. ఈ సమాచారం ఆధారంగా నిధుల దారిమళ్లింపుతో సంబంధం ఉన్న వెంకట్, మరో ఇద్దరు వ్యక్తుల ఇళ్లు, కార్యాలయాల్లోనూ సోదాలు చేశారు.

బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిందేమీ లేదు

- అల్టిమేటం ఇచ్చి నిధులు సాధించిన బిహార్ : కేఏ పాల్

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందేమీ లేదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆరోపించారు. పోలవరం, రైల్వేజోన్, స్టీల్ ప్లాంట్, అమరావతికి కేంద్రం గాడిద గుడ్డు ఇచ్చిందని ఎద్దేవా చేశారు. కేంద్రానికి బిహార్ సీఎం నితీశ్‌కుమార్ అల్టిమేటం ఇచ్చి 60 వేల కోట్ల నిధులు సాధించారని అన్నారు. ఆగస్టు 8న ఢిల్లీలో నిర్వహించే గ్లోబల్ ఎకనమిక్ సమ్మిట్‌కి చంద్రబాబు మద్దతు ఇవ్వాలని కోరారు. తెలంగాణ, ఏపీకి లక్ష కోట్ల చొప్పున పెట్టుబడులు వస్తాయన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

- జంతర్ మంతర్ వద్ద ధర్నాలో తెలుగు ఎంపీల డిమాండ్

న్యూఢిల్లీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని తెలుగు రాష్ట్రాల ఎంపీలు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ కృషి వల్లనే భారతీయ రిజర్వ్ బ్యాంకు ఏర్పడిందని, అటువంటి మహనీయుని ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బుధవారం, ఇక్కడ జంతర్ మంతర్‌లో కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ అధ్యక్షతన మహాధర్నా జరిగింది. తెలుగు రాష్ట్రాల ఎంపీలు.. బలరాంనాయక్, అప్పలనాయుడు, ఈటల రాజేందర్, ఆర్.కృష్ణయ్య ధర్నాకు హాజరై మద్దతు తెలిపారు. ఈ అంశాన్ని తమ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ దృష్టికి తీసుకెళ్లి, పార్లమెంటులో పార్టీ ఎంపీలందరూ మాట్లాడే విధంగా కృషి చేస్తానని ఎంపీ బలరాం నాయక్ హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్తామని ఎంపీ అప్పలనాయుడు తెలిపారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తానని, పార్లమెంటులో మాట్లాడుతానని ఈటల రాజేందర్ చెప్పారు.

చిన్నారిపై హత్యాచారం కేసు.. దోషికి ఉరి ఖరారు

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఓ వలస కూలీ కుటుంబానికి చెందిన ఐదేళ్ల బాలికపై లైంగిక దాడి చేసి, చంపేసిన వ్యక్తికి హైకోర్టు ఉరి శిక్షను ఖరారు చేసింది. జస్టిస్ పీ శ్యాంకోషీ, జస్టిస్ సాంబశివరావు నాయుడు ధర్మాసనం బుధవారం తుది తీర్పు వెలువరించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన దినేశ్ కుమార్ ధర్నె (25) నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలోని అల్కాపురి టౌన్‌షిప్ ప్రాజెక్టు నిర్మాణంలో పనిచేస్తుండేవాడు. ఒడిశాకు చెందిన వలస కూలీ దంపతులు కూడా అక్కడే లేబర్ క్యాంప్‌లో ఉండేవారు. దినేశ్‌కుమార్ 2017 డిసెంబరు 12న ఆ దంపతుల ఐదేళ్ల కుమార్తెను చాక్లెట్ కొనిస్తానని తీసుకెళ్లాడు. కానీ మళ్లీ తీసుకురాలేదు. అతడిని బాలిక తల్లిదండ్రులు నిలదీయగా చాక్లెట్ కొనిపెట్టి ఇంటి వద్దే వదిలేశానని బుకాయించాడు. తర్వాత అతను పోలీసుల విచారణలో నేరాన్ని అంగీకరించడంతో పాటు నార్సింగిలోని ఓ ఆస్పత్రి వద్ద పొదల్లో బాలిక మృతదేహాన్ని పడేసినట్లు చెప్పాడు. బలమైన సాక్ష్యాలు ఉండటంతో రంగారెడ్డి జిల్లా ఎంఎస్‌జే కోర్టు జడ్జి బీ సురేశ్‌బాబు ఉరి శిక్ష విధించారు. కాగా, నిందితుడి అప్పీల్‌తో పాటు ఉరి శిక్ష ధ్రువీకరణ పిటిషన్‌పై హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావు వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ధర్మాసనం.. దారుణమైన నేరానికి పాల్పడిన దినేశ్‌కుమార్‌కు ఎంఎస్‌జే కోర్టు విధించిన ఉరి శిక్షను ఖరారు చేసింది.

గర్భిణిపైనుంచి దూసుకెళ్లిన లారీ

- ఛిద్రమైన పిండం.. మహిళ దుర్మరణం


పనేటి రేణ (ఫైల్)

మనోహరాబాద్, జూలై 31: మెదక్ జిల్లా మనోహరాబాద్‌లోని జాతీయ రహదారిపై అత్యంత ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఏడు నెలల గర్భంతో ఉన్న ఓ మహిళ దుర్మరణం పాలవ్వగా.. ఆమె గర్భంలోని పిండం రహదారిపై పడి ఛిద్రమైంది. సిద్దిపేట జిల్లా మీర్‌దొడ్డి మండలం రుద్రారం పరిధి మల్లుపల్లె గ్రామానికి చెందిన దంపతులు ద్విచక్రవాహనంపై హైదరాబాద్ బయలుదేరారు. ద్విచక్ర వాహనంపై ఉన్న వారిలో పనేటి రేణ(29) ఏడు నెలల గర్భంతో ఉంది. అయితే, వీరు మనోహరాబాద్‌లోని 44వ నెంబరు జాతీయ రహదారిపై వెళుతుండగా తూప్రాన్ నుంచి మేడ్చల్ వైపు వేగంగా వెళ్తున్న ఓ లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపైన ఉన్నవారంతా కింద పడగా రేణ శరీరంపై నుంచి లారీ దూసుకెళ్లింది. దీంతో రేణ అక్కడికక్కడే చనిపోగా ఆమె గర్భంలోని పిండం రహదారిపై పడి ఛిద్రమైంది. ఈ హృదయవిదారక దృశ్యాన్ని చూసి పలువురు కంటతడి పెట్టుకున్నారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు 13,412 కోట్లు

రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దేశంలోని మహిళలు, చిన్నారుల భద్రత కోసం వివిధ పథకాలు, కార్యక్రమాల కింద రూ.13,412 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. బుధవారం రాజ్యసభలో ఒక ఎంపీ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. ఇంటర్ ఆపరేబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం కోసం రూ.3375 కోట్లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ కోసం రూ.531.24 కోట్లు, స్కీం ఫర్ మోడర్నైజేషన్ ఆఫ్ ఫోరెన్సిక్‌కు రూ.280 కోట్లు, జైళ్ల ఆధునికీకరణకు రూ.950 కోట్లు, రాష్ట్ర సైన్స్ ఫోరెన్సిక్ లేబొరేటరీల పటిష్ఠత కోసం రూ.106.75 కోట్లు, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలు, ఫోరెన్సిక్ డేటా సెంటర్ తోపాటు 6 సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీల ఆధునికీకరణకు రూ.354.25 కోట్లు, సేఫ్ సిటీ ప్రాజెక్ట్ కోసం రూ.2840 కోట్లు, శిక్షణ, సామర్థ్యం పెంపు కోసం రూ.76.5 కోట్లు, జైళ్లలోని ఖైదీల కోసం రూ.60 కోట్లు, మానవ అక్రమ రవాణా నిరోధక (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్) యూనిట్‌కు రూ.113.76 కోట్లు, మహిళా హెల్ప్ డెస్కుల కు రూ.164.2 కోట్లు, చండీగఢ్‌లో డీఎన్ఏ ల్యాబ్ ఏర్పాటుకు రూ.42.84 కోట్లు, మహిళలు, చిన్నారులపై సైబర్ నేరాల నియంత్రణకు రూ.224.76 కోటు ఖర్చు చేస్తున్నట్టు సంజయ్ వివరించారు. కాగా, అన్ని రకాల సైబర్ నేరాలను సమన్వయంతో, సమగ్రంగా ఎదుర్కొనేందుకు కేంద్ర హోంశాఖ 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ)ని ఏర్పాటు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు. రాజ్యసభలో మరో సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

రాజ్యసభలో బీజేపీ విప్‌గా లక్ష్మణ్



న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో బీజేపీ విప్‌గా ఎంపీ కె.లక్ష్మణ్‌ను నియమిస్తున్నట్లు బీజేపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 2022 జూన్ 2న ఉత్తరప్రదేశ్ నుంచి బీజేపీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా లక్ష్మణ్ నియమితులయ్యారు. విద్యార్థి దశలోనే ఏబీవీపీలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన లక్ష్మణ్.. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగానూ పని చేశారు. రెండు సార్లు ముషీరాబాద్ ఎమ్మెల్యేగా సేవలు అందించారు. ప్రస్తుతం బీజేపీలో అత్యంత కీలకమైన పార్లమెంటరీ బోర్డు సభ్యుడిగా ఉన్నారు. తెలంగాణకే చెందిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి లోక్ సభలో బీజేపీ విప్‌గా సోమవారమే నియమితులైన విషయం తెలిసిందే.

నాలుగో నగరం

(మొదటిపేజీ తరువాయి)


కందుకూరులో ఏర్పాటు చేసిన పవర్‌గ్రిడ్

ఉన్న మరికొంత ప్రభుత్వ భూమిని కూడా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని ఈ ప్రాంతాన్ని 'వ్యాపార కేంద్రం (బిజినెస్ సెంటర్)'గా మార్చాలని రేవంత్ సర్కారు యోచిస్తోంది. తాజాగా అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ ప్రస్తావన చేశారు. తాము ఫార్మాసిటీ అనకుండా ఫార్మా విలేజెస్ అంటున్నామన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత అక్కడ 4000 ఎకరాల్లో నాలుగో సిటీని అభివృద్ధి చేస్తామని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. మొత్తంమీద ప్రభుత్వ ప్రత్యేక దృష్టితో మహేశ్వరం నియోజకవర్గం ఒక 'మహానగరం'గా రూపాంతరం చెందనుంది. ఇక ముచ్చెర్లలో ఏర్పాటు చేసే నెట్‌జీరో సిటీని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అనుసంధానిస్తూ మెట్రో రైలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన చేయనుంది. అలాగే ఇక్కడి నుంచి ఆదిభట్ల, తుక్కుగూడ మధ్య ఔటర్ రింగ్ రోడ్డుకు కలిసే విధంగా 150 అడుగుల రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక అభివృద్ధితో పాటు పర్యాటకం, విద్య, వినోదం, ఆరోగ్యం, కృత్రిమ మేధ హబ్‌గా మహేశ్వరం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దాలని సర్కారు ప్రణాళికలు రూపొందిస్తోంది.

మూడు క్లస్టర్లుగా..

నగర శివారు ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న యోచనలో ఉన్న ప్రభుత్వం.. వాటిని మూడు క్లస్టర్లుగా విభజించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి భాగాన్ని అర్బన్ క్లస్టర్‌గా, ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని సెమీ అర్బన్‌గా, ఆర్ఆర్ఆర్ వెలుపలి ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్‌గా ఏర్పాటు చేయనుంది. ఆయా క్లస్టర్ల అభివృద్ధికి ఏం చేయాలనేదానిపై సమాలోచనలు చేస్తోంది. ఇప్పటికే కోకాపేట ప్రాంతం అభివృద్ధిలో దూసుకెళుతోంది. మహేశ్వరం కూడా అదేబాటలో పయనించనుంది. కొత్తగా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఓఆర్ఆర్‌కు బయట, ఆర్ఆర్ఆర్‌కు లోపల భూములను గుర్తిస్తున్నారు. ఈ ప్రాంతానికి విదేశీ కంపెనీలను ఆకర్షించాలంటే ఎలాంటి భూ సమస్యలూ లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అత్యధిక పరిశ్రమలు ఇక్కడే..

ప్రభుత్వ గణాంకాల ప్రకారం రంగారెడ్డి జిల్లాలోని వివిధ కంపెనీల్లో 8,27,447 మంది ఉపాధి పొందుతున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోనే అత్యధికంగా చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటిలో ప్రధానంగా విప్రో, మలబార్ గోల్డ్, సింపాల్, అమెజాన్, వెమ్ టెక్నాలజీస్, రేడియన్స్ ఎలక్ట్రానిక్స్, వెంకటేశ్వర, టాటా ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్ సిటీ, ఇండస్ట్రియల్ పార్కులు వచ్చాయి. దేశంలోనే రెండో పెద్ద (765/400కేవీ) పవర్ గ్రిడ్‌ను కందుకూరులో ఏర్పాటు చేశారు. అలాగే 45 ఎకరాల్లో అమెజాన్ డేటా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రావిర్యాలలో ఫాక్స్‌కాన్ కంపెనీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఫార్మా సిటీ కోసం రైతుల నుంచి గత ప్రభుత్వం 12 వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించింది. ఈ ప్రక్రియలో కొందరు రైతులకు అన్యాయం జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం అలాంటి తప్పులు పునరావృతమవకుండా ఉండేందుకు రేవంత్ సర్కారు చర్యలు తీసుకుంటోంది. భూములిచ్చిన రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని యోచిస్తోంది.

6 కోర్సులు.. 2వేల మంది విద్యార్థులు!

- స్కిల్ వర్సిటీలో వచ్చే ఏడాది నుంచి ప్రవేశాలు
- తొలుత 6 రంగాల్లో కోర్సులతో తరగతులు

హైదరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగితను తగ్గించడం, ప్రైవేటులో యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముచ్చెర్లలో రాష్ట్ర సర్కారు ఏర్పాటుచేస్తున్న 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'లో వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు నిర్వహించనున్నారు! తొలి ఏడాది ఆరు రంగాల్లో ఉపాధి అవకాశాలున్న కోర్సులను ప్రవేశ పెడతారు. రెండువేల మందికి ప్రవేశాలు కల్పిస్తారు. క్రమంగా అడ్మిషన్ల సంఖ్యను 20 వేలకు పెంచుతారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుచేస్తున్న ఈ వర్సిటీలో ఇంటర్ తర్వాత చదివే మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీలతో పాటు.. ఏడాది డిప్లొమా, మూడు నుంచి నాలుగు నెలల వ్యవధి ఉండే సర్టిఫికెట్ కోర్సులు ఉంటాయి. తెలంగాణలో అభివృద్ధి చెందుతున్న 17 ప్రాధాన్య రంగాలు, పరిశ్రమల భవిష్యత్తు అవసరాలకు సరిపడే కొత్త కోర్సులను ఐటీ, పరిశ్రమల శాఖ ఇప్పటికే గుర్తించింది. సర్కారు గుర్తించిన ప్రాధాన్య రంగాల్లో.. ఫార్మా, కన్‌స్ట్రక్షన్, బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఈ కామర్స్ అండ్ లాజిస్టిక్స్, రిటైల్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్స్ తదితరాలున్నాయి. ప్రతి కోర్సుకూ సంబంధిత రంగంలో పేరొందిన ఒక కంపెనీతో భాగస్వామ్యం ఉండేలా అనుసంధానం చేస్తారు. ఈమేరకు ఆయా కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోనుంది.

విభజన చట్టంలోని చాలా అంశాలను అమలు చేశాం: కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విభజన చట్టంలోని చాలా అంశాలను అమలు చేశామని, మిగిలిన అంశాలు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. బుధవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు. విభజన చట్టంలోని అంశాల అమలు పురోగతిపై కేంద్ర హోం మంత్రిత్వశాఖ సమయానుగుణంగా మంత్రిత్వశాఖలు, ప్రభుత్వ విభాగాలు, ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులతో సమీక్షలు నిర్వహిస్తోందని చెప్పారు. ఇప్పటి వరకు 34 సమీక్షా సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రాల సహకారంతోనే ద్వైపాక్షిక సమస్యలు పరిష్కారమవుతాయని, పరస్పర అవగాహనతో వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి కేంద్రప్రభుత్వం సంధానకర్తగా మాత్రమే వ్యవహరిస్తుందని నిత్యానంద రాయ్ స్పష్టం చేశారు.

పదోన్నతుల వివాదాన్ని పరిష్కరించండి

నీటి పారుదలశాఖ సలహాదారుడు ఆదిత్యనాథ్‌దాస్‌కు బాధ్యతల అప్పగింత

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో పదోన్నతుల వివాదాన్ని తేల్చే బాధ్యతను ఆ శాఖ సలహాదారుడు ఆదిత్యనాథ్‌దాస్‌కు ప్రభుత్వం అప్పగించింది. శాఖలో జోన్-5 (పూర్వ ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లా లు), జోన్-6 (పూర్వ మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాలు) ఇంజనీర్ల మధ్య ఏళ్లుగా సీనియారిటీ వివాదం నెలకొంది. నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రజత్‌కుమార్ ఇచ్చిన మెమో నం.11656తో వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో సామరస్యపూర్వకంగా పదోన్నతుల సమస్యను పరిష్కరించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. ఆదిత్యనాథ్‌దాస్‌ను కోరారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత పదోన్నతుల ప్రక్రియ కొలిక్కి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

డ్రగ్స్ కేసు.. వీఐపీలతో లింకులు..!

- రకుల్ తమ్ముడికి, పాజిటివ్ వచ్చిన మరో 9 మందికి వీఐపీలతో పరిచయాలు
- వాట్సాప్ చాటింగ్‌ల ద్వారా విశ్లేషణ
- స్టేట్‌మెంట్ రికార్డ్ చేస్తున్న టీజీ న్యాబ్

హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) పోలీసులు ఇటీవల ఛేదించిన నైజీరియా డ్రగ్స్ ముఠా కేసులో తవ్వినకొద్దీ విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల ఇద్దరు నైజీరియన్లు సహా ఐదుగురు డ్రగ్స్ పెడ్లర్లను అరెస్టు పోలీసులు.. వారి నుంచి రూ.35 లక్షల విలువ చేసే 199 గ్రాము ల కొకైన్‌ను సీజ్ చేసిన విషయం తెలిసిందే..! ఈ ముఠాను పట్టుకునే సమయంలో సినీ నటి రకుల్ ప్రీత్‌సింగ్ తమ్ముడు అమన్ ప్రీత్‌సింగ్, మరో 12 మంది డ్రగ్స్ వినియోగదారులను అదుపులోకి తీసుకున్నారు. వారికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించగా.. అమన్ సహా 10 మందికి పాజిటివ్ ఫలితం వచ్చింది. తదుపరి దర్యాప్తులో భాగంగా పెడ్లర్లు అల్లం సత్యవెంకట గౌతమ్, సానబోయిన వరుణ్‌కుమార్, మహమ్మద్ మహబూబ్ షరీఫ్, వినియోగదారులు-- రకుల్ సోదరుడు, మరో తొమ్మిది మంది మొబైల్ ఫోన్ కాల్ డేటా, వాట్సాప్ చాటింగ్‌పై టీజీ న్యాబ్ పోలీసులు దృష్టి సారించారు. వీటిని విశ్లేషించిన పోలీసులు.. వీరికి వీఐపీలు, సినీ ఇండస్ట్రీకి చెందినవారు, బడా వ్యాపారుల పిల్లలతో లింకులున్నట్లు గుర్తించారు. వీఐపీలకు డ్రగ్స్‌తో సంబంధాలున్నాయా? అనే కోణంపై పోలీసులు దృష్టి సారించారు. ఈ లింకుల తీగను కదిపితే.. డ్రగ్స్ నెట్‌వర్క్ డొంక కదులుతుందని టీజీ న్యాబ్ పోలీసులు భావిస్తున్నారు.

గవర్నర్‌గా జిష్ణుదేవ్ బాధ్యతల స్వీకరణ

ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే అరాధే.. హాజరైన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

- శుభాకాంక్షలు తెలిపిన కిషన్‌రెడ్డి
- ఘన స్వాగతం పలికిన సీఎం, సీఎస్
- సుస్థిర అభివృద్ధికి సహకరించాలని కొత్త గవర్నర్ పిలుపు


కొత్త గవర్నర్‌కు శుభాకాంక్షలు చెప్తున్న సీఎం రేవంత్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నూతన గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ బాధ్యతలు చేపట్టారు. రాజ్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన గవర్నర్‌కు సీఎం రేవంత్ రెడ్డి, జస్టిస్ అలోక్ అరాధే పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా గవర్నర్‌ను వెంట తీసుకెళ్లి మంత్రులు, ఇతర ప్రముఖుల్ని పరిచయం చేశారు. పరిచయ కార్యక్రమం తర్వాత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. సీఎం, మంత్రులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఆ తర్వాత ప్రముఖులతో కలిసి గవర్నర్ తేనీటి విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సీఎస్ శాంతి కుమారి, గవర్నర్ ముఖ్య సలహాదారు బుర్రా వెంకటేశం, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. కాగా, ప్రమాణ స్వీకార కార్యక్రమంలో గవర్నర్, సీఎం ధరించిన కండువాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రమాణ స్వీకారానికి ముందు జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో కలిసిన సీఎం రేవంత్ రెడ్డి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. వెంటనే గవర్నర్ తమ సాంప్రదాయం ప్రకారం రేవంత్ రెడ్డికి కండువా కప్పారు. సాధారణంగా సీఎంకు ఎవరైనా శాలువా, కండువా కప్పితే భద్రతా సిబ్బంది వెంటనే తీసేస్తారు. కానీ, ఇది తమ సంప్రదాయమని గవర్నర్ చెప్పడం, ఆయన కూడా ధరించి ఉండటంతో.. సీఎం కూడా కండువా ధరించే ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రూప్ ఫొటోలోనూ కండువాతోనే కనిపించారు. అంతకు ముందు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జిష్ణుదేవ్ వర్మకు సీఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. సీఎస్‌తో పాటు డీజీపీ జితేందర్, త్రివిధ దళాల అధికారులు, ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

యంగ్ అండ్ డైనమిక్ సీఎం రేవంత్‌రెడ్డి

గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిష్ణుదేవ్ వర్మ రాష్ట్ర ప్రజలకు సందేశం ఇచ్చారు. సమ్మిళిత, స్థిరమైన భవిష్యత్తును నిర్మించడంలో తెలంగాణ పౌరులంతా చేతులు కలపాలని పిలుపునిచ్చారు. "విభిన్న సంస్కృతులు, సుసంపన్న వారసత్వం, ప్రకృతి అందాలకు నిలయం తెలంగాణ. ఇక్కడి ప్రజలకు సేవ చేసే అదృష్టం నాకు దక్కింది. యంగ్ అండ్ డైనమిక్ సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సారథ్యంలోని మంత్రి వర్గానికి అభినందనలు. యువత సమాజానికి గొప్ప ఆస్తి. నాణ్యమైన విద్య, ఉపాధి అకాశాలు అందించడం వల్ల వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయవచ్చు" అని గవర్నర్ అన్నారు. రైతులకు రూ.2లక్షల మేర రుణాలు మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం.. తనకు సంతోషం కలిగించిందని పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై 8 గంటల ట్రా'ఫికర్'

- ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న ఘటనలో డ్రైవర్ దుర్మరణం
- మృతదేహం రెండు లారీల మధ్య ఇరుక్కోవడంతో వెలికితీతకు సమయం
- చౌటుప్పల్ పరిధిలో ఘటన


రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

చౌటుప్పల్ రూరల్, జూలై 31: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు ఎనిమిది గంటల పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఎస్సై కృష్ణ మధు తెలిపిన వివరాల ప్రకారం.. బడ్‌వైజర్ బీర్ల లోడుతో ఓ లారీ సంగారెడ్డి జిల్లా నుంచి ఖమ్మం వెళ్తోంది. అలాగే ఉల్లిగడ్డల లోడుతో మరో లారీ మహారాష్ట్రలోని పుణె నుంచి విజయవాడ వైపు వెళ్తోంది. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లక్కారం గ్రామంలోని తంగేడువనం వద్ద.. ఉల్లి లోడుతో వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న బీర్ల లారీని అతివేగంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మహారాష్ట్రలోని నాందుగామ్ గ్రామానికి చెందిన దర్విపు అజయ్‌అశోక్ (22)గా గుర్తించారు. అయితే.. అతి వేగంగా ఢీకొట్టడంతో ఉల్లి లారీ ముందుభాగం నుజ్జునుజ్జవడంతో పాటు ముందు లారీలోకి చొచ్చుకుపోయింది. డ్రైవర్ అశోక్ మృతదేహం రెండు లారీల మధ్యన ఇరుక్కుపోయింది. దీంతో ఇటు లారీలను, మధ్యలో ఇరుక్కున్న మృతదేహాన్ని వేరుచేసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. నాలుగు గంటల పాటు శ్రమించి క్రేన్ సహాయంతో లారీలను వేరు చేశారు. ఈ క్రమంలో మృతదేహం చితికిపోయింది. శరీరభాగాలు ఛిద్రమయ్యాయి. మరోవైపు, ఉదయం నాలుగు గంటలకు రోడ్డు ప్రమాదం జరుగగా.. మధ్నాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ అంతరాయం కొనసాగింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే మార్గం కొయ్యలగూడెం వరకు ఐదు కిలోమీటర్ల మేర, విజయవాడ నుంచి హైదరాబాద్ మార్గంలో చౌటుప్పల్ వరకు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫి క్ నిలిచిపోయింది. దారిపొడవునా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించారు. విజయవాడ నుంచి వచ్చే వాహనాలను సర్వీసు రోడ్డు మీదుగా మళ్లించారు. కాగా, ఉల్లి లారీ డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కృష్ణ మధు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● గురువారం 1 ఆగస్టు 2024

కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఎన్ఐఏ-జైపూర్)- ఎమ్మెస్సీ(ఇంటర్ డిసిప్లినరీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్క్రీనింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. అభ్యర్థులు సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.



నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదలో ఎమ్మెస్సీ

స్పెషలైజేషన్‌లు-సీట్లు: పోషణాహార(ఆయుర్వేద డైట్ అండ్ న్యూట్రిషన్) 3, ఆయుర్వేద మాన్యుస్క్రిప్టాలజీ 4, ఆయుర్-యోగ ప్రివెంటివ్ కార్డియాలజీ 2, మర్మ చికిత్స-క్రీడ భేషజ్(మర్మాలజీ అండ్ స్పోర్ట్స్ మెడిసిన్) 1, సౌందర్య ఆయుర్వేద(ఆయుర్వేదిక్ కాస్మోటాలజీ) 1, వృక్షాయుర్వేద 1 చొప్పున మొత్తం 12 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/ బీయూఎంఎస్/బీఎన్‌వైఎస్/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులు అన్ని స్పెషలైజేషన్‌లకు అప్లయ్ చేసుకోవచ్చు. పోషకాహార స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(డైటెటిక్స్/ఫుడ్ అండ్ న్యూట్రిషన్)/ఎమ్మెస్సీ(డైటెటిక్స్) పూర్తిచేసినవారు; ఆయుర్వేద మాన్యుస్క్రిప్టాలజీకి ఎంఏ(సంస్కృతం) ఉత్తీర్ణులు; మర్మ చికిత్స-క్రీడ భేషజ్‌కు బీఎస్ఎంఎస్/బీఎస్సీ స్పోర్ట్స్ మెడిసిన్/బీపీటీ పూర్తిచేసినవారు; సౌందర్య ఆయుర్వేద స్పెషలైజేషన్‌కు బీఎస్సీ స్కిన్ కేర్ అండ్ ఈస్థటిక్ మెడిసిన్ ఉత్తీర్ణులు; వృక్షాయుర్వేదకు బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/ఫారెస్ట్రీ)అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయుర్-యోగ ప్రివెంటివ్ కార్డియాలజీకి కంపల్సరీ ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.

స్క్రీనింగ్ టెస్ట్: ఇందులో 50 శాతం ప్రశ్నలను సంబంధిత సబ్జెక్ట్ నుంచి ఇస్తారు. మిగిలిన ప్రశ్నలను జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, కంప్యూటర్ నాలెడ్జ్ నుంచి అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** మొదటి ఏడాది రూ.37650 (రూ.8000లు రిఫండబుల్); రెండో ఏడాది రూ.26650
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.300
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 7
- **స్క్రీనింగ్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 11
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 13
- **ఇంటర్వ్యూలు:** ఆగస్టు 16
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 20
- **అడ్మిషన్ విండో ఓపెన్:** ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 5 వరకు
- **సెషన్ ప్రారంభం:** సెప్టెంబరు 9 నుంచి
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద, జొరావర్ సింగ్ గేట్, అమీర్ రోడ్, జైపూర్-302002.
- **వెబ్‌సైట్:** www.nia.nic.in

ఎన్ఐపీహెచ్ఎంలో ఆన్‌లైన్ కోర్సులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(ఎన్ఐపీహెచ్ఎం)- మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ఒక్కో కోర్సు వ్యవధి మూడు నెలలు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కోర్సుకు సంబంధించిన రీడింగ్ మెటీరియల్ అందిస్తారు. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.

ప్లాంట్ బయోసెక్యూరిటీ: ఈ కోర్సులో ప్లాంట్ బయో సెక్యూరిటీ, ప్లాంట్ క్వారంటైన్ సిస్టం, ఇంటర్నేషనల్ అండ్ నేషనల్ రెగ్యులేషన్స్, ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రొసీజర్స్-ప్లాంట్స్ అండ్ ప్లాంట్ ప్రొడక్ట్స్, ఫైటో శానిటరీ ట్రీట్‌మెంట్, హార్మోనైజేషన్ ఆఫ్ ఫైటో శానిటరీ మెజర్స్ తదితర అంశాలు వివరిస్తారు. కోర్సు మొత్తమ్మీద 24 లెక్చర్స్ ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు కనీసం 20 ఏళ్లు నిండి ఉండాలి.

రోడెంట్స్ అండ్ హౌస్‌హోల్డ్ పెస్ట్ మేనేజ్‌మెంట్: ఈ కోర్సులో మూడు మాడ్యూల్స్ ఉంటాయి. మాడ్యూల్‌కు ఏడు చొప్పున మొత్తం 21 చాప్టర్స్ ఉంటాయి. కోర్సులో భాగంగా బయాలజీ అంశాలు; ఎలుకలు, దోమలు, ఈగలు, బొద్దింకలు, నల్లులు, చెదలు, కలుపు మొక్కల నివారణ పద్ధతులు వివరిస్తారు. వీడియో ప్రజంటేషన్స్ కూడా ఉంటాయి.

అర్హత: సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఏ గ్రూప్‌తోనైనా ఇంటర్/డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు ఏదేని పెస్ట్ కంట్రోల్ సంస్థలో పనిచేసిన అనుభవం ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.



- **కోర్సు ఫీజు:** రూ.2500.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 12
- **కోర్సు ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **కోర్సు సంబంధిత ఆన్‌లైన్ సెషన్స్:** సెప్టెంబరు 1 నుంచి నవంబరు 30 వరకు
- **వెబ్‌సైట్:** niphm.gov.in

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఏఎంపీబీఏ



ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)- అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ బిజినెస్ అనలిటిక్స్(ఏఎంపీబీఏ)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హైదరాబాద్, మొహాలీ క్యాంపస్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా డేటా మేనేజ్‌మెంట్, ప్రోగ్రామింగ్, స్టాటిస్టిక్స్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిజినెస్ అప్లికేషన్స్ అంశాలకు సంబంధించి థియరీ సెషన్స్, ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటాయి. ఫౌండేషనల్ ప్రాజెక్ట్‌లు, క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. ఇది హైబ్రిడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: ఇంజనీరింగ్, టెక్నాలజీ, స్టాటిస్టిక్స్, మేథమెటిక్స్, సైన్స్ విభాగాల్లో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్, ప్రోగ్రామింగ్ అంశాల్లో పూర్తి పరిజ్ఞానం ఉండాలి. అడ్మిషన్ నాటికి కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 22
- **తరగతులు ప్రారంభం:** 2025 ఫిబ్రవరి 1 నుంచి
- **వెబ్‌సైట్:** isb.edu

జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- 'జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్ఏటీ)2025' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారానే దేశవ్యాప్తంగా కొన్ని ప్రముఖ బీ-స్కూళ్లు, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎక్స్ఎల్ఆర్ఐ జంషెడ్‌పూర్, ఢిల్లీ క్యాంపస్‌లు అందిస్తున్న పీజీడీఎం ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు.

జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి 2025 జూన్ నాటికి పరీక్షలు పూర్తికావాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎక్స్ఏటీ 2025: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో రెండు పార్టులు ఉంటాయి. మొదటి పార్ట్‌లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంట్రప్రిటేషన్ నుంచి 28 ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ నుంచి 21 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. ఒక అనలిటికల్ ఎస్సే రాయాల్సి ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు లేవు. జనరల్ నాలెడ్జ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొదటి పార్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి వీరు రాసిన ఎస్సేలను మాత్రమే పరిశీలిస్తారు. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
- **ఎక్స్ఏటీ 2025 తేదీ:** 2025 జనవరి 5
- **ఫలితాలు విడుదల:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.xatonline.in

జాబ్ కార్నర్

బీబీనగర్ ఎయిమ్స్‌లో ఫ్యాకల్టీ

పోస్టులు: 68

బీబీనగర్(తెలంగాణ)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)...కింద పేర్కొన్న విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ప్రొఫెసర్: **24 పోస్టులు**
2. అడిషనల్ ప్రొఫెసర్: **6 పోస్టులు**
3. అసోసియేట్ ప్రొఫెసర్: **16 పోస్టులు**
4. అసిస్టెంట్ ప్రొఫెసర్: **22 పోస్టులు**

విభాగాలు: అనస్థీషియాలజీ, ఈఎన్‌టీ, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఎండ్రోక్రినాలజీ అండ్ మెటబాలిజం, రేడియో - డయాగ్నోసిస్.


అర్హత: సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, ఎమ్మెస్సీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,68,900, అడిషనల్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,48,200, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,38,300, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500.

వయోపరిమితి: ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్ పోస్టులకు 58 ఏళ్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 50 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళా అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: దరఖాస్తులను రిక్రూట్‌మెంట్ సెల్, ఎయిమ్స్ బీబీనగర్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్(హెచ్ఎంఆర్), తెలంగాణ చిరునామాకు పంపాలి.



ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: సెప్టెంబరు 3

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 19

వెబ్‌సైట్: aiimsbibinagar.edu.in/

ఐఓసీఎల్‌లో జూనియర్ ఇంజనీర్లు

పోస్టులు: 443

ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్)... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల వివరాలు

1. జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్-4: **256 పోస్టులు**
2. జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్-4/జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్-4: **99 పోస్టులు**
3. జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్-4: **21 పోస్టులు**
4. ఇంజనీరింగ్ అసిస్టెంట్: **38 పోస్టులు**
5. టెక్నికల్: **29 పోస్టులు**

విభాగాలు: ప్రొడక్షన్, పీ అండ్ యూ, ఓ అండ్ ఎం, ఫైర్ అండ్ సేఫ్టీ, ఎలక్ట్రికల్, మెకానికల్, టీ అండ్ ఐ.

అర్హత: ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, షార్ట్‌లిస్ట్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: జనరల్/ఈడబ్ల్యూఎస్/ఓబీసీ అభ్యర్థులకు రూ.300.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 21

వెబ్‌సైట్: https://iocl.com/

'సమీర్'లో ఉద్యోగాలు

పోస్టులు: 101

ముంబయిలోని సొసైటీ ఫర్ అప్లయిడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ అండ్ రీసెర్చ్(సమీర్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్: **4 పోస్టులు**
2. రీసెర్చ్ సైంటిస్ట్: **34**
3. ప్రాజెక్ట్ అసిస్టెంట్: **29**
4. ప్రాజెక్ట్ టెక్నీషియన్(ఎ/బి)- **34**

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్/ఐటీ, ఫిజిక్స్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు రూ.39,200; రీసెర్చ్ సైంటిస్ట్‌కు రూ.30,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.17,000; ప్రాజెక్ట్ టెక్నీషియన్(ఎ)కు రూ.15,100; ప్రాజెక్ట్ టెక్నీషియన్(బి)కి రూ.19,100.

వయోపరిమితి: సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ టెక్నీషియన్(ఎ)కు 25 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: పోస్టును అనుసరించి దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ టెస్ట్(సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్, రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టులకు: ఆగస్టు 17

ఇంటర్వ్యూలు: ఆగస్టు 21, 22, 23

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 12

వెబ్‌సైట్: https://sameer.gov.in/

ఎన్ఐబీలో జూనియర్ సైంటిస్టులు

నోయిడా(ఉత్తరప్రదేశ్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్స్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 6

- సైంటిస్ట్ గ్రేడ్-1: **1 పోస్టు**
- సైంటిస్ట్ గ్రేడ్-2: **2 పోస్టులు**
- జూనియర్ సైంటిస్ట్: **2 పోస్టులు**
- అసిస్టెంట్ -2: **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, పీజీ, మెడికల్ పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: అభ్యర్థుల విద్యార్హత, రాత పరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, పర్సనాలిటీ టెస్ట్ తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 23

వెబ్‌సైట్: https://www.nib.gov.in/

బీఐఎస్‌లో సైంటిస్ట్-బి పోస్టులు

న్యూఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 15

పోస్టు: సైంటిస్ట్-బి

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ(కెమిస్ట్రీ), బీటెక్(సివిల్/ఎలక్ట్రికల్) ఉత్తీర్ణతతోపాటు గేట్ స్కోరు, పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.1,11,780

వయోపరిమితి: 2024 ఆగస్టు 16 నాటికి 30 ఏళ్లు మించకూడదు

ఎంపిక: విద్యార్హత, గేట్ స్కోరు, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా


దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16

వెబ్‌సైట్: https://www.bis.gov.in/

కృతజ్ఞత నేర్పిన దొంగ

ఒక ఊరిలో సీతారామయ్యఅనే రైతు వద్దఒక గుర్రం ఉండేది. దానికి అక్కడ ఉండటం అసలునచ్చేది కాదు. 'నా పూర్వీకులంతా రాజుల కొలువుల్లో ఉండి మంచి సౌకర్యాలు అనుభవించారు. నేను ఇక్కడబానిస బతుకు మతుకుతున్నాను'అని ప్రతిరోజూ బాధ పడుతూ ఉండేది. వీలైనంత త్వరగా అక్కడినుండి తప్పించుకు పోవాలని అనుకుంటూ ఉండేది. ఒక రోజు రాత్రి, సీతారామయ్య ఇంట్లోకి ఒక దొంగ ప్రవేశించాడు అతను చేతికిఅందిన సొమ్ము, విలువైన వస్తువులు మూటగట్టుకుని పోతూ ఉంటే, గుర్రం గమనించిమౌనంగా ఉన్నది తీరాదొంగ వెళ్లిపోతుంటే, గుర్రం అతనితో దయచేసి, నా కట్లు విప్పి, నన్ను విడిపించుఅని అడిగింది.' నీ కట్లు విప్పితే నాకేం లాభం?అన్నాడు దొంగ .దానికి"కట్లు విప్పి, నన్ను కూడా నీతో తీసుకెళితే, నీకు 'సేవ చేస్తూ, నీ దగ్గరే పడిఉంటాను' అన్నది గుర్రం. ఆ మాటలు విన్న దొంగ 'నేను దొంగతనం చేస్తున్నాను అని నీకు తెలుసు, ఐనా నువ్వు నీ యజమానిని నిద్ర లేపడానికి, నన్ను ఆపడానికి ప్రయత్నించలేదు. చిన్న శబ్దమైనా చేయలేదు. ఇప్పటి యజమానిపట్ల ఇలా ఉన్న దానివి రేపు నాకు ఆపద కలిగినా ఇలాగే చేస్తావు కాబట్టి, నిన్ను నేను విడిపించను, నీకు కృతజ్ఞత లేదు' అని చెప్పి, ఆ దొంగ వెళ్లిపోయాడు. ఆ మాటలకు సిగ్గుపడిన గుర్రం ఆ రోజునుండి తన యజమాని చెప్పిన పని చేస్తూ, కృతజ్ఞతతో మెలగసాగింది.




15 తేడాలను గుర్తించండి?




సరైన నీడ ఏది?



ఏనుగులు ఎన్ని, ఖడ్గ మృగాలు ఎన్ని



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 372

					7	6		
	7		1	3		5	2	
			2	5	6			9
		7	8			4	3	1
3		4				7		5
6	5	1			4	8		
4			7	1	3			
	2	5		8	9		4	
		8	5					

సుడోకు - 371 సమాధానం

5	1	2	4	9	7	6	8	3
9	7	6	1	3	8	5	2	4
8	4	3	2	5	6	1	7	9
2	9	7	8	6	5	4	3	1
3	8	4	9	2	1	7	6	5
6	5	1	3	7	4	8	9	2
4	6	9	7	1	3	2	5	8
1	2	5	6	8	9	3	4	7
7	3	8	5	4	2	9	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.